www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 16-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 288

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: తదియ తె. 4.06 తదుపరి చవితి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 11.17 తదుపరి మఖ; వర్జ్యం: రా.12.01-1.42; దుర్ముహూర్తం: ఉ.11.34-11.18, మ.3.00-4.44; అమృతఘడియలు: ఉ.9.37-11.17; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.57 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఏప్రిల్ 29 నుంచి ఎప్‌సెట్

జూన్ 6న లాసెట్.. 8న ఐసెట్.. వివిధ కోర్సుల ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

పూర్తి వివరాలతో త్వరలో సెట్ల వారీగా నోటిఫికేషన్లు



హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మా, న్యాయ విద్య, ఎంబీఏ, ఎంసీఏ సహా వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి బుధవారం ప్రకటించింది. దీని ప్రకారం.. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎప్‌సెట్ పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు నిర్వహించనున్నారు. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో జరిగే

మిగతా 14వ పేజీలో...

అరెస్టు చేస్తారా?

నేడు ఈడీ ముందుకు మాజీ మంత్రి కేటీఆర్

ఫార్ములా-ఈ కారు రేసు కేసులో విచారణ

జోక్యానికి సుప్రీం నిరాకరణతో పార్టీలో గుబులు

న్యాయవాదులతో వస్తానన్నట్లుగా కేటీఆర్ సమాచారం ఇవ్వలేదన్న ఈడీ



హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరు కానున్నారు. ఇదే కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి, నాటి పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ అధికారులు ఇప్పటికే ప్రశ్నించారు. అయితే ఏ1గా ఉన్న కేటీఆర్‌ను ఈడీ ఏం అడగనుంది? విచారణ నేపథ్యంలో ఆయనను కేవలం ప్రశ్నించి ఇంటికి పంపుతారా? లేదంటే.. అరెస్టు చేస్తారా? అన్నదానిపై బీఆర్‌ఎస్ శ్రేణుల్లో టెన్షన్ నెలకొంది. ఈ కేసులో కేటీఆర్ 9న ఏసీబీ విచారణకు హాజరైన విషయం తెలిసిందే. అయితే ఏసీబీ అధికారుల ప్రశ్నలకు సమాధానాలిచ్చి.. సాయంత్రానికి కేటీఆర్ తిరిగి రావడంతో గులాబీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. కానీ, ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ కేటీఆర్ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను తిరస్కరించడం, దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. జోక్యానికి ధర్మాసనం

మిగతా 12వ పేజీలో...



స్కిల్ కేసులో బాబుకు ఊరట

- బెయిల్ రద్దు కోరుతూ గత వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్ కొట్టివేత
- ఇంటర్‌లొక్యూటరీ దరఖాస్తు వేసిన జర్నలిస్టుపై న్యాయమూర్తి ఆగ్రహం
- ఈ కేసుతో మీకేం సంబంధమని నిలదీత
- మళ్లీ ఇలా చేస్తే తీవ్ర చర్యలని హెచ్చరిక

12

సుప్రీంకోర్టులో కేటీఆర్‌కు షాక్

- ఫార్ములా-ఈ రేసు కేసులో క్వాష్ పిటిషన్
- ఏసీబీ, ఈడీ విచారణలో జోక్యానికి నో
- పిటిషన్ ఉపసంహరించుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



ఢిల్లీలోని కేసీ వేణుగోపాల్ నివాసంలో ఆయనతో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్, దీపాదాస్ మున్షి

రూ.50 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం

నేడు విదేశీ పర్యటనకు రేవంత్

- సింగపూర్, స్విట్జర్లాండ్‌లో 8 రోజుల టూర్
- దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరు!
- 24న తిరిగి హైదరాబాద్‌కు సీఎం రాక

వచ్చే నెలలో కాంగ్రెస్ సభ

13

- సూర్యాపేట లేదా ఖమ్మంలో 'సంవిధాన్ బచావో' పేరిట సభ.. రాహుల్ హాజరు
- నెలాఖరుకు నామినేటెడ్ పదవులు: మహేశ్
- రాష్ట్ర మంత్రులతో కేసీ వేణుగోపాల్ భేటీ

ఆ పార్టీ బీఆరెస్సెస్

ఆరెస్సెస్ భావజాలంతో ప్రజల్లోకి వెళ్లడానికి బీఆర్‌ఎస్ యత్నం

- కాంగ్రెస్‌పై బీజేపీ చేసే ఆరోపణలే ఆ పార్టీ తెలంగాణలో చేస్తోంది
- ఆరెస్సెస్‌తో కాంగ్రెస్‌ది సిద్ధాంతపరమైన వైరుధ్యం
- సంఘ్‌కు, స్వాతంత్ర్య పోరాటానికి అసలు సంబంధమే లేదు
- స్వాతంత్ర్య పోరాటాన్ని వక్రీకరించిన భాగవత్‌పై చర్యలుండాలి
- మోదీ.. భాగవత్ వైపా? స్వాతంత్ర్య సమరయోధుల వైపా?
- కాంగ్రెస్ కొత్త కార్యాలయం దేశ ప్రయోజనాలకు వేదిక కానుంది
- బీఆర్‌ఎస్ నుంచి మేం నేర్చుకోవాల్సింది ఏమీ లేదు: రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, దామోదర

న్యూఢిల్లీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ 'బీఆరెస్సెస్'గా మారిందని, ఆరెస్సెస్ భావజాలంతో ప్రజల్లోకి వెళ్లేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ ఏ ఆరోపణలు చేస్తోందో.. తెలంగాణలో బీఆర్‌ఎస్ కూడా అవే ఆరోపణలు చేస్తోందన్నారు. బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పినట్లు ఆరెస్సెస్‌తో కాంగ్రెస్‌ది సిద్ధాంతపరమైన వైరుధ్యమని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆరెస్సెస్ ఏనాడూ, ఎలాంటి పోరాటం చేయలేదని, ఆ సంస్థలోని వ్యక్తులు ఎలాంటి త్యాగాలు

మిగతా 13వ పేజీలో...



బీజేపీ, సంఘ్‌తోనే కాదు.. భారత రాజ్య వ్యవస్థతోనూ పోరాడుతున్నాం

- దేశ వ్యవస్థలన్నీ బీజేపీ, ఆరెస్సెస్ స్వాధీనమయ్యాయి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్
- స్వాతంత్ర్యంపై భాగవత్ వ్యాఖ్యలు దేశద్రోహమేనని మండిపాటు

2

హైకోర్టు తాత్కాలిక సీజేగా

జస్టిస్ సుజాయ్ పాల్

- రాష్ట్రపతి ఆమోదం.. న్యాయశాఖ ఉత్తర్వులు
- హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జిలు
- కేంద్రానికి కొలీజియం ప్రతిపాదనలు



న్యూఢిల్లీ, హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ సుజాయ్‌పాల్‌ను రాష్ట్రపతి నియమించారు. ఈ నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అలోక్ అరాధే.. బాంబే హైకోర్టు సీజేగా బదిలీ అయిన నేపథ్యంలో తదుపరి సీనియర్ జడ్జి అయిన జస్టిస్ సుజాయ్‌పాల్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. మధ్యప్రదేశ్

మిగతా 14వ పేజీలో...



నర్సింగ్ రావు



తిరుమల దేవి



రేణుక యారా



మధుసూదన్‌రావు

కోట్లు కూతెట్టాయ్

కనుమనాడు వెయ్యి కోట్లు దాటిన పందెం

- కోనసీమ నుంచి రాయలసీమ దాకా జోరు.. కోట్లల్లో పందేలు.. భారీ ఆఫర్లు
- గుండాట, పేకాట పోటీలతో జోష్.. 'పశ్చిమ'లో ఒక్క పందేనికే 1.25 కోట్లు
- విజేతలకు మహీంద్రా థార్, యాక్టివా, రాయల్ ఎన్‌ఫీల్డ్‌లు
- సరిహద్దు బరుల వద్ద తెలంగాణ మద్యం విక్రయాలు

కనుమా కో..ఢీ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

పండగ పందేలు జాతరను తలపించాయి. ఎక్కడికక్కడ షామియానాలు, కుర్చీలు, ఎల్ఈడీ స్క్రీన్లలో ప్రత్యక్ష ప్రసారాలు, వీటికి కామెంట్రీలు ఏర్పాటు చేసి స్టేడియం తరహాలో బరులను నిర్వహించారు. ఏపీలోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ, కోనసీమలను కలుపుకొని పందేలు రూ.500కోట్లు దాటేశాయి. బరుల్లో కోడిపందేలతో సమానంగా గుండాట భారీగా జరిగింది. ఎక్కడా పోలీసుల జాడ లేకపోవడంతో పందెంరాయుళ్లు, గుండాట వ్యాపారులు చెలరేగిపోయారు. అడ్డూఅదుపూ లేకుండా రేయింబవళ్లు రెచ్చిపోయారు. మొత్తం పందేల్లో సగానికిపైగా గుండాటదే కావడం విశేషం. ప్రధానంగా కాకినాడ

మిగతా 14వ పేజీలో...

తెగిన బతుకు దారం

- పతంగులు ఎగురవేస్తూ రాష్ట్రంలో వేర్వేరు చోట్ల నలుగురి మృతి
- మాంజాతో పలువురికి గాయాలు

14

భాగ్యనగరీ ఊపిరిపీల్చుకో

- గ్రేటర్‌లో పడిన విద్యుత్తు డిమాండ్
- మెరుగుపడిన గాలి నాణ్యత సూచీ
- పండక్కి నగరం ఖాళీ అవడంతోనే..



ఏపీలోని ఎంకిపాడులో ఓ కోడిపందెం



మోహన్ భాగవత్.. దేశంలో

తిరగలేరు జాగ్రత్త!

- 'నిజమైన స్వాతంత్ర్యం' వ్యాఖ్యలపై సంఘ్ చీఫ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే హెచ్చరిక
- 1947లో స్వాతంత్ర్యం వచ్చిందనేది మీరు గుర్తించకపోవడం సిగ్గుచేటు
- అంబేడ్కర్ అన్నట్టుగా చరిత్రను విస్మరించేవాళ్లు చరిత్ర సృష్టించలేరు
- ఎందరో ప్రాణాలర్పించారు.. అందుకే మేం 1947ను గుర్తుపెట్టుకుంటాం: ఖర్గే
- కాంగ్రెస్ పార్టీ నూతన కేంద్రకార్యాలయం ప్రారంభం.. ఇందిరాభవన్‌గా పేరు

2

మోహన్‌బాబు వర్సిటీ వద్ద

హై టెన్షన్

13

- క్యాంపస్‌లోకి వెళ్లేందుకు మనోజ్ దంపతుల యత్నం.. అడ్డుకున్న పోలీసులు, సిబ్బంది
- మనోజ్ వాహనంపై కర్రతో యువకుడి దాడి
- విష్ణు అనుచరులపై పరోక్షంగా మనోజ్ ఫైర్
- కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకు ఫిర్యాదు చేస్తాం: ఎంబీయూ మీడియా ఇన్‌చార్జ్

డ్రోన్ విధ్వంసక సూక్ష్మ క్షిపణి

భార్గవాస్త్రం

2

- మైక్రో మిస్సైల్ సిస్టమ్ పరీక్ష విజయవంతం

అగ్రశేణి నౌకాదళంగా భారత్

- నౌకాదళానికి ఇది చిరస్మరణీయమైన రోజు
- 3 శక్తిమంతమైన అస్త్రాలు ఒకేసారి చేరాయి
- విశ్వ భాగస్వామిగా మన నౌకాదళం ఎదగాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన
- 2 యుద్ధనౌకలు, సబ్‌మెరైన్ జాతికి అంకితం
- నవీ ముంబైలో ఇస్కాన్ ఆలయం ప్రారంభం

అన్న కూతురిని ప్రేమించాడని..

వ్యక్తి ఇంటికి అగ్గి

- చిన్నాన్న దుర్మార్గం.. ప్రేమికుడి కన్నవారికి నిప్పు
- తండ్రికి 50% గాయాలు.. త్రుటిలో తప్పించుకున్న తల్లి
- సమీపంలో ఆడుకుంటున్న ఓ చిన్నారికి అంటిన మంటలు
- హైదరాబాద్ అల్వాల్‌లో ఘోరం.. పరారీలో నిందితుడు

అల్వాల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తన అన్న కూతురిని ఓ యువకుడు ప్రేమిస్తుండటాన్ని సహించలేక సదరు యువతి చిన్నాన్న అతనిపై కసి పెంచుకున్నాడు. అతని కుటుంబ సభ్యులను హతమార్చాలనుకున్నాడు. ఇందులో భాగంగా ఆ యువకుడు నివసించే ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన హైదరాబాద్

మిగతా 3వ పేజీలో...




నిందితుడు వివేకానంద

పోలీసుల ఎదుటే కూతురిపై కాల్పులు

- పెళ్లికి నాలుగురోజుల ముందు తండ్రి ఘాతుకం
- ఆమె ఇష్టపడ్డ వ్యక్తితో కాక, మరొకరితో పెళ్లి నిశ్చయం
- వ్యతిరేకిస్తూ సోషల్‌మీడియాలో వీడియో పెట్టిన కుమార్తె
- కొద్దిసేపటికే తండ్రి చేతిలో బలి.. గ్వాలియర్‌లో ఘటన

2



ఆ లెక్క తేలాలి

సాగుకు యోగ్యం కాని భూములపై సర్వే

- నేటి నుంచి 20 వరకు అధికారుల క్షేత్రస్థాయి పర్యటన
- 21 నుంచి 24 తేదీవరకు గ్రామసభల్లో వివరాల ప్రదర్శన
- గ్రామ, మండలస్థాయిలో ప్రత్యేక బృందాల ఏర్పాటు
- భరోసా పథకంలో అనర్హులను గుర్తించే ప్రక్రియ షురూ

హైదరాబాద్, జనవరి15(ఆంధ్రజ్యోతి): రైతుభరోసా పథకంలో అనర్హులను గుర్తించే ప్రక్రియ గురువారం నుంచి షురూ కాబోతోంది. సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించేందుకు అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నాయి. గ్రామం, రైతులు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం వివరాలను రైతుభరోసా పోర్టల్‌లోని ఏవో(వ్యవసాయాధికారి) లాగిన్‌లో పొందుపరిచారు. ఈ వివరాల ఆధారంగా క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతో నేటి నుంచి ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారుల బృందాలు ఈనెల 20 తేదీ వరకు పర్యటించనున్నాయి. గ్రామస్థాయిలో

మిగతా 14వ పేజీలో...

తుమ్మల x ధర్మపురి

- రాష్ట్ర మంత్రి, బీజేపీ ఎంపీ మధ్య పసుపు బోర్డు క్రెడిట్ వార్
- రాష్ట్రం లేఖల వల్లే బోర్డు వచ్చిందన్న తుమ్మలపై అర్వింద్ ఫైర్
- వయసు మీదపడ్డా ఆయనకు చిలిపి చేష్టలు పోలేదంటూ వ్యాఖ్య
- బండి చక్రంపై వాలిన ఈగ ఆ చక్రాన్ని తిప్పినట్టా అని ఎద్దేవా
- ఇంత దిగజారుడు భాషనా? సభ్యత కాదని తుమ్మల సీరియస్





హైదరాబాద్/న్యూఢిల్లీ/ఖమ్మం, జనవరి 15, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ పసుపు బోర్డు ప్రారంభం నేపథ్యంలో కాంగ్రెస్-బీజేపీల మధ్య క్రెడిట్ వార్ మొదలైంది. తమ ప్రభుత్వం లేఖ రాయడం వల్లే పసుపు బోర్డు ఏర్పాటు సాధ్యమైందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తుమ్మలకు వయసు మీద పడ్డా చిలిపి చేష్టలు పోలేదన్నారు. ఆయన్ను బండి చక్రంపై వాలిన ఈగతో పోల్చారు. దీనిపై తుమ్మల తీవ్రంగా స్పందించారు. అర్వింద్ వ్యాఖ్యలు అభ్యంతరకరం, ఆక్షేపణీయమని బుధవారం

మిగతా 12వ పేజీలో...

హమాస్-ఇజ్రాయెల్ మధ్య కుదిరిన
కాల్పుల విరమణ ఒప్పందం

న్యూఢిల్లీ, జనవరి 15: గాజాలో కాల్పుల విరమణపై ఇజ్రాయెల్, హమాస్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని ఖతార్ ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. బుధవారం ఖతార్‌లో జరిగిన చర్చల్లో అమెరికా, ఇజ్రాయెల్ అధికారులు పాల్గొన్నారు. ఇజ్రాయెల్ ప్రకారం.. ఇంకా 94 మంది హమాస్ చెరలో ఉన్నారు. అయితే.. వారిలో 34 మంది చనిపోయినట్లు అనుమానిస్తున్నారు. తాజా చర్చల మేరకు 33 మంది బందీలను విడుదల చేయాలని ఇజ్రాయెల్ సూచించింది. దీనికి హమాస్ వర్గాలు అంగీకరించాయి. అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హమాస్‌ను తీవ్రంగా హెచ్చరించిన విషయం తెలిసిందే..! ఈ నేపథ్యంలో.. ట్రంప్ ప్రమాణ స్వీకారంలోగా బందీలను విడుదల చేయాల్సి ఉంటుంది.

జుకర్‌బర్గ్ వ్యాఖ్యలపై భారత్‌కు మెటా క్షమాపణలు

వాషింగ్టన్, న్యూఢిల్లీ, జనవరి15: గత పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం ఓడిపోయిందన్న మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ వ్యాఖ్యలపై మెటా భారత్‌కు క్షమాపణలు చెప్పింది. అనుకోకుండా జరిగిన పొరపాటుకు క్షమించాలంటూ మెటా ఇండియా ఉపాధ్యక్షుడు శివ్‌నాథ్ ఠుక్రాల్ భారత ప్రభుత్వాన్ని కోరారు. జుకర్‌బర్గ్ వ్యాఖ్యలను తప్పుబడుతూ కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్ వేదికగా పెట్టిన పోస్టుపై శివ్‌నాథ్ స్పందించారు. కోవిడ్-19 తర్వాత ప్రపంచంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలన్నీ ఓడిపోయాయన్న జుకర్‌బర్గ్ వాదన భారత్ విషయంలో మాత్రం వర్తించదని శివ్‌నాథ్ పేర్కొన్నారు. భారత్ తమకు కీలక భాగస్వామి అంటూ, దేశ భవిష్యత్తులో కీలక పాత్ర పోషించేందుకు ఎదురుచూస్తున్నామని పోస్టులో రాశారు.

పోలింగ్ బూత్ ఫుటేజీలపై గోప్యత ఎందుకు?

- కాంగ్రెస్ వ్యాజ్యం.. కేంద్రం, ఈసీలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, జనవరి 15: పోలింగ్ బూత్‌ల్లోని సీసీటీవీ కెమేరాలు, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీలను ప్రజలకు బహిర్గతం చేయకూడదంటూ ఎన్నికల సంఘం తీసుకొచ్చిన కొత్త నిబంధనను సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961కు తగిన సవరణ చేయడం ద్వారా ఎలక్షన్ కమిషన్ ఈ రూల్‌ను చేర్చించింది. ఫుటేజీ అందరికీ అందుబాటులోకి తెస్తే ఓటరు గుర్తింపు వెల్లడవుతుందని, అందువల్ల దాన్ని గోప్యంగా ఉంచడమే మంచిందని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. దీన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పిటిషన్ వేశారు. ఫుటేజీ అందరికీ అందుబాటులో తెచ్చినంత మాత్రాన ఓటరు ఎవరికి ఓటు వేశారన్న విషయం బహిర్గతమయ్యే అవకాశం లేదని పేర్కొన్నారు. పోలింగ్ బూత్‌లో అక్రమాలు జరిగితే వాటిని గుర్తించేందుకు ఫుటేజీలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందన్నారు. పిటిషన్‌ను స్వీకరించిన ధర్మాసనం.. సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి బుధవారం నోటీసులు పంపించింది.

కేజ్రీవాల్‌పై దాడికి 'ఖలిస్థాన్' కుట్ర

- నిఘా వర్గాల నివేదిక.. న్యూఢిల్లీ నుంచి కేజ్రీ నామినేషన్

న్యూఢిల్లీ, జనవరి 15: దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే నెల 5న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై దాడికి ఖలిస్థాన్ అనుకూల సంస్థ కుట్ర పన్నుతున్నట్టు నిఘా వర్గాల నివేదికలు చెబుతున్నాయి. దీనిపై బుధవారం కేజ్రీవాల్ స్పందించారు. దేవుడే తనను కాపాడతాడని, జీవనరేఖ ఉన్నంత కాలం తాను జీవిస్తానని పేర్కొన్నారు. న్యూఢిల్లీ స్థానం నుంచి పోటీ చేయనున్న కేజ్రీవాల్ బుధవారం తన నామినేషన్‌ను సమర్పించారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి ముందు ఆయన కన్నాట్‌ప్లేస్‌లోని ప్రాచీన హనుమాన్ మందిరంలో పూజలు చేశారు. కేజ్రీవాల్ ప్రాణానికి ముప్పున్నట్టు ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో ఆయన భద్రతా ఏర్పాట్లను సమీక్షించనున్నట్టు ఢిల్లీ పోలీస్ వర్గాలు తెలిపాయి. కేజ్రీవాల్‌కు జడ్ ప్లస్ భద్రత ఉంది. పైలట్, ఎస్కార్ట్ టీమ్, తనిఖీ యూనిట్లతో సహా మొత్తంగా 63 మంది ఆయనకు రక్షణగా ఉంటారు.

కేజ్రీవాల్‌పై ఈడీ విచారణకు కేంద్ర హోం శాఖ ఓకే

న్యూఢిల్లీ, జనవరి 15: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్(56)కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆయనపై విచారణ జరిపేందుకు ఈడీకి కేంద్రహోం శాఖ అనుమతి ఇచ్చిందని బుధవారం అధికార వర్గాలు తెలిపాయి. ఢిల్లీ ఎక్సయిజ్ విధానం కేసులో నగదు అక్రమ చలామణికి పాల్పడినట్టు ఈడీ ఆయనపై ఛార్జిషీటు దాఖలు చేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎల్ఎంఏ) కింద కేసు పెట్టి గత ఏడాది మార్చిలో అరెస్టు చేసింది. బెయిల్‌పై విడుదలైన ఆయన ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పీఎల్ఎంఏ చట్టం కింద ఆయనపై విచారణ జరిపేందుకు ఈడీకి ప్రస్తుతం హోంశాఖ అనుమతి ఇచ్చింది. ఆయనపై విచారణ జరపాలని తొలుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా 'కాంపెటెంట్ అథారిటీ' అయిన హోం శాఖకు సిఫార్సు చేశారు. అందుకు హోం శాఖ సానుకూలంగా స్పందించింది. ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఇతర అధికారులపై విచారణ జరిపేందుకు కూడా హోంశాఖ అనుమతి ఇచ్చింది. రాజకీయ నాయకులు, మంత్రులు, అధికారులపై విచారణ జరిపేందుకు సీఆర్‌పీసీలోని సెక్షన్ 197(1) ప్రకారం కాంపెటెంట్ అథారిటీ నుంచి సీబీఐ ముందస్తు అనుమతి తీసుకుంటున్నట్టుగానే ఈడీ కూడా అనుమతి పొందాల్సి ఉంటుందని గత ఏడాది నవంబరులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం కాంపెటెంట్ అథారిటీ అయిన కేంద్ర హోంశాఖ అనుమతి తీసుకుంది.

15 ఏళ్లుగా 50కి పైగా అమ్మాయిలను చెరబట్టి!

- నాగ్‌పూర్‌లో సైకో సైకాలజిస్టు అరెస్టు..

నాగ్‌పూర్, జనవరి 15: అతడొక సైకాలజిస్టు.. వ్యక్తిత్వ వికాస నిపుణుడు కూడా.. వయసు 45 ఏళ్లు.. దాదాపు 15 ఏళ్లుగా అతడి ఇంటి వద్దే క్లినిక్ నిర్వహిస్తూ చాలా మంది విద్యార్థినులకు క్లాసులు తీసుకుంటూ ఎంతో మంచి పేరు తెచ్చుకున్నాడు. దీంతో నాగ్‌పూర్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా సమీప హాస్టళ్లలో ఉంటూ క్లాసులకు వచ్చే వారు.. అయితే కొన్ని వారాల క్రితం ఓ యువతితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో అతడి అసలు బండారం బయటపడింది. ప్రస్తుతం నాగ్‌పూర్ సెంట్రల్ జైల్లో ఉన్న అతగాడి కీచక పర్వం తాజాగా వెలుగులోకి వచ్చింది. దాదాపు 15 ఏళ్లుగా 50 మందికి పైగా అమ్మాయిల్ని క్లాసుల పేరుతో రప్పించి వారితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగికంగా వాడుకోవడం, ఫొటోలు, వీడియోలు తీసి బెదిరింపులకు పాల్పడ్డాడు. సాయంత్రం తర్వాత క్లాసుల పేరుతో అమ్మాయిలను క్లినిక్‌కు రప్పించే అతడు.. రాగానే వారికి రంగు లేని ఓ ద్రావణాన్ని ఇచ్చేవాడు.. అది తాగి స్పృహ కోల్పోయిన వారితో అసభ్యంగా ప్రవర్తిస్తూ ఫొటోలు తీసుకునే వాడు.. ఆ తర్వాత వారిని బెదిరింపులకు గురి చేస్తూ లైంగికంగా వాడుకునేవాడు.. చివరికి ఓ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడికి సహకరించిన భార్య, మరో మహిళ పరారీలో ఉన్నారు.

బెంగళూరు స్టార్టప్ 'పిక్సెల్' ప్రయోగం సక్సెస్

బెంగళూరు, జనవరి 15: భారత్‌కు చెందిన స్పేస్ స్టార్టప్ సంస్థ 'పిక్సెల్' అమెరికా నుంచి ప్రపంచంలోనే అత్యధిక రిజల్యూషన్ కలిగిన మూడు కమర్షియల్ హైపర్‌స్పెక్ట్రల్ ఉపగ్రహాలను ప్రయోగించినట్లు బుధవారం వెల్లడించింది. మంగళవారం రాత్రి కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం చేపట్టి.. 'ఫైర్‌ఫ్లైస్'గా పిలిచే ఈ భూ పరిశీలన ఉపగ్రహాలను 550 కిలోమీటర్ల ఎత్తులోని దిగువ భూ కక్ష్యలో ప్రవేశపెట్టినట్టు పేర్కొంది. తాము తొలిసారిగా ప్రయోగించిన 3ఉపగ్రహాలతో కచ్చితమైన వాతావరణ సమాచారం పొందవచ్చని, అత్యధిక రిజల్యూషన్‌తో ఇవి అందించే చిత్రాలతో భూపరిశీలన చేయవచ్చని పిక్సెల్ సీఈవో అహ్మద్ చెప్పారు. భారత్‌కు ప్రైవేట్ ఎర్త్ ఇమేజింగ్ శాటిలైట్‌ను అందించిన తొలి స్టార్టప్‌గా పిక్సెల్ చరిత్ర సృష్టించిందన్నారు.

కెనడా ఓపెన్ వర్క్ పర్మిట్ రూల్స్ సడలింపు

ఒట్టావా, జనవరి 15: తమ దేశంలో చదువుకునేందుకు వచ్చే విదేశీ విద్యార్థులు, ఉద్యోగాలు చేస్తున్న వారికి కెనడా శుభవార్త చెప్పింది. ఈ కేటగిరీ వారికి ఇచ్చే ఓపెన్ వర్క్ పర్మిట్ల వీసా నిబంధనలను ప్రభుత్వం సడలించింది. ఈ నెల 21 నుంచి వర్క్ పర్మిట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది. అయితే.. 16 నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలపరిమితి ఉన్న మాస్టర్స్, రిసెర్చ్ లేదా ప్రొఫెషనల్ కోర్సుల్లో నమోదు చేసుకున్న వారి కుటుంబీకులకే ఈ సడలింపు వర్తిస్తుంది. ఉద్యోగుల విషయంలో.. వారి కాల పరిమితి దరఖాస్తు సమయానికి కనీసం 16 నెలలు మిగిలి ఉండాలి.

భాగవత్.. జాగ్రత్త!

అలా మాట్లాడితే దేశంలో తిరగలేరు

- 1947లోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనే విషయాన్ని మీరు గుర్తించకపోవడం సిగ్గు చేటు
- రామమందిర ప్రతిష్ఠాపనతోనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వ్యాఖ్యలపై ఖర్గే ఫైర్



కాంగ్రెస్ పార్టీ కొత్త ప్రధాన కార్యాలయం, కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సోనియా గాంధీ(ఇన్‌సెట్)

న్యూఢిల్లీ, జనవరి 15: ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గుమంది. మన దేశానికి 'నిజమైన స్వాతంత్ర్యం' అయోధ్యలో రామ మందిరం ప్రారంభమైన రోజే వచ్చిందని భాగవత్ పేర్కొన్నారు. సోమవారం ఓ కార్యక్రమంలో భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే భాగవత్ 'అసలైన స్వాతంత్ర్యం' వ్యాఖ్యలను ఖర్గే తీవ్రంగా ఖండించారు. భాగవత్ ఇలాంటి వ్యాఖ్యలను కొనసాగిస్తే గనక ఆయనకు దేశంలో తిరగడం కష్టమవుతుందని హెచ్చరించారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా దాన్ని గుర్తించకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'చరిత్రను మరిచిపోయేవాళ్లు చరిత్ర సృష్టించలేరు' అన్న అంబేడ్కర్ వ్యాఖ్యలను ఖర్గే ప్రత్యేకంగా గుర్తుచేశారు. బుధవారం ఢిల్లీలోని 9-ఏ కోట్లా రోడ్డులో కాంగ్రెస్ పార్టీ నూతన కేంద్ర కార్యాలయాన్ని ఖర్గే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన, పార్టీ నేతలను ఉద్దేశించి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ వాళ్ల పాత్రేలేదని, ఎవ్వరూ జైళ్లకు వెళ్లలేదని, అసలు స్వాతంత్ర్య పోరాటంతో వారికి సంబంధమే లేదని.. ఈ విషయాలు అందరికీ తెలుసునని.. అందుకే మన దేశానికి 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిందనే విషయం వారికి గుర్తులేక.. ఇప్పుడు రామ మందిరం ప్రారంభమైన రోజును స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకోవాలని చెబుతున్నారని మండిపడ్డారు. "రామ మందిరం ప్రారంభోత్సవం రోజు స్వాతంత్ర్యం వచ్చిందని భాగవత్ చెబుతున్నారు. ప్రధాని మోదీనేమో తాను అధికారంలోకి వచ్చిన 2014లోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని నమ్ముతారు. కానీ దేశం స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు పోరాటం చేశారు. తమ ప్రాణాలను అర్పించారు కాబట్టి మేం మాత్రం 1947 స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తుపెట్టుకుంటాం" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిందని, దీన్ని మరిచిపోయిన వాళ్లు చరిత్ర సృష్టించలేరని సంఘ్‌ను ఉద్దేశించి మండిపడ్డారు. కాగా, పార్టీ నూతన కేంద్ర కార్యాలయానికి 'ఇందిరా భవన్' అని పేరు పెట్టారు.

'ఎల్ అండ్ టీ-90 గంటల పని'పై అసంతృప్తి

వారంలో 90 పని గంటలు ఉండాలంటూ ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణియన్ చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విభేదించారు. రోజుకు 8గంటలు పనిచేశాక అలసిపోతారు కాబట్టే రోజుకు అంతకుమించి పని గంటలు ఉండొద్దంటూ నెహ్రూ, అంబేడ్కర్ సూచించారని గుర్తు చేశారు. ఇప్పుడేమో ఎల్ అండ్ టీ వాళ్లు 12 గంటలు, 14 గంటలు అంటున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆఫీసు వాస్తు మార్చిన సంఘ్

కాంగ్రెస్ పార్టీ కొత్త ఆఫీసు వాస్తును సంఘ్ ప్రభావితం చేసిందా? అంటే అవుననే అనిపిస్తోంది. పార్టీ కార్యాలయ ప్రధాన ముఖ ద్వారం వాస్తవానికి దీన్‌దయాళ్ మార్గ్ వైపు ఉండాల్సింది. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త పేరుతో కార్యాలయ చిరునామా ఉండేందుకు వీల్లేకుండా కాంగ్రెస్ జాగ్రత్తపడింది. ఆ మేరకు దీన్‌దయాళ్ రోడ్డుకు వెనుకవైపు రోడ్డు అయిన కోట్లా మార్గ్‌వైపు కార్యాలయ ప్రధాన ద్వారాన్ని తెరిచింది.

ఏఐసీసీ కార్యాలయంలో పీవీకి చోటు

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు గుర్తింపునిచ్చింది. బుధవారం ప్రారంభమైన ఏఐసీసీ నూతన ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో పీవీ చిత్రపటాలను మూడింటిని ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి.. పీవీ కుర్చీలో కూర్చున్న ఫొటో ఒకటి కాగా, మరొకటి ప్రధాని హోదాలో దక్షిణ కొరియా అధ్యక్షుడు కిమ్ యంగ్ సామ్‌ను స్వాగతిస్తున్న ఫొటో. మూడోది.. కేంద్ర రక్షణశాఖ మంత్రిగా ఒకప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీతో కలిసి ఉన్న ఫొటో. పీవీ నర్సింహారావు 1991-1996 మధ్య దేశ ప్రధానిగా పని చేయడంతోపాటు 1992-1994 మధ్య ఏఐసీసీ అధ్యక్షుడిగానూ వ్యవహరించినప్పటికీ ఇప్పటివరకు ఉన్న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేయలేదు. ఆయన మృతి చెందిన 20 ఏళ్ల తరువాత తాజాగా ఏఐసీసీ కార్యాలయంలో ఆయనకు చోటు దక్కింది.



పోలీసుల ఎదుటే కుమార్తెను కాల్చేశాడు

- పెళ్లికి 4రోజుల ముందు తండ్రి ఘాతుకం
- ప్రేమ వ్యవహారమే కారణం
- మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఘటన

గ్వాలియర్, జనవరి 15: పెద్దలు కుదిర్చిన పెళ్లిని వ్యతిరేకించి తన ఇష్టప్రకారం జీవిత భాగస్వామిని ఎంచుకోవాలనుకున్న కుమార్తెను ఆమె తండ్రి కాల్చి చంపారు. పోలీసులు చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన తనూ గుర్జార్‌కు ఆమె తండ్రి మహేశ్ వివాహాన్ని ఏర్పాటుచేశారు. అది ఇష్టం లేని ఆమె.. తన పెళ్లికి నాలుగు రోజులు ముందు, మంగళవారం, 52 నిమిషాలు నిడివి గల వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోను తనూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. విక్కీ అనే వ్యక్తిని ప్రేమిస్తున్నానని, కానీ, తమ కుటుంబం వేరే సంబంధం ఖాయం చేసిందని ఆమె తెలిపారు. వారు కుదిర్చిన సంబంధాన్ని వ్యతిరేకించినందుకు నన్ను రోజూ ఇంట్లో కొడుతున్నారనీ వాపోయారు. తనకు ప్రాణహాని ఉన్నదని, తనను రక్షించాలని ఆ వీడియోలో ఆమె కోరారు. సోషల్ మీడియాలో ఆమె వీడియో వైరల్ కావడంతో ఎస్పీ ధర్మవీర్‌సింగ్ సహా పోలీసు అధికారులు మంగళవారం రాత్రి ఆమె ఇంటికి చేరుకున్నారు. ఎందరు ఎన్నివిధాలా చెప్పినా తనూ, తన కుటుంబంతో కలిసి ఉండేందుకు నిరాకరించారు. తనను ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి (వన్ స్టెప్ సెంటర్) పంపాలని పోలీసు అధికారులను కోరారు. ఆమె మేజర్ (20ఏళ్లు) కావడంతో తనూను సంరక్షణ కేంద్రంలో చేర్చడానికి పోలీసు అధికారులు సిద్ధమయ్యారు. ఇంతలో తండ్రి వారిని ఆపారు. తన కుమార్తెతో కొద్దిసేపు మాట్లాడే అవకాశం ఇవ్వాలని ఆమెను కొద్ది దూరం తీసుకువెళ్లాడు. పోలీసులు చూస్తుండగానే కూతుర్ని కాల్చి చంపేశాడు.

బీజేపీ, ఆరెస్సెస్‌తోనే కాదు.. భారత రాజ్య వ్యవస్థతోనూ పోరాడుతున్నాం

- దేశ వ్యవస్థలన్నీ బీజేపీ, ఆరెస్సెస్ స్వాధీనమయ్యాయి
- పార్టీ కార్యకర్తలతో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, జనవరి 15: కాంగ్రెస్ పార్టీ ఆరెస్సెస్, బీజేపీతోనే కాక.. భారత రాజ్యవ్యవస్థతో కూడా పోరాడుతోందని ఆ పార్టీ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఏఐసీసీ నూతన ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మనం బీజేపీ, ఆరెస్సెస్ అనే రాజకీయ సంస్థలతో పోరాడుతున్నామని మీరు భావిస్తుంటే.. అసలేం జరుగుతోందో మీకు అర్థం కానట్టే. ఆ రెండూ మనదేశంలోని ప్రతి వ్యవస్థనూ స్వాధీనం చేసుకున్నాయి. మనం పోరాడుతున్నది బీజేపీ, ఆరెస్సెస్‌తోపాటు భారత రాజ్య వ్యవస్థతో కూడా" అని ఆయన పేర్కొన్నారు. అలాగే.. అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన రోజునే భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందంటూ భాగవత్ చేసిన వ్యాఖ్యలపైనా రాహుల్ మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలు దేశ ద్రోహంతో సమానమని.. ఇవే వ్యాఖ్యలు మరే దేశంలోనైనా చేసి ఉంటే.. వెంటనే ఆయన్ను అరెస్టు చేసి, విచారణ జరిపి ఉండేవారని దుయ్యబట్టారు. భారతదేశం 1947లో స్వాతంత్ర్యం పొందలేదని చెప్పడమంటే భారతీయులందరినీ అవమానించడమేనని ధ్వజమెత్తారు.


సెంట్రల్‌ఫ్యూజ్ ప్లాట్‌ఫారంలో గుర్తించిన పేలుడు పదార్థాలు

అణు పరికరాల్లో బాంబులు!

- ఇరాన్‌పై ఇజ్రాయెల్ వ్యూహం

(సెంట్రల్ డెస్క్)

ఇరాన్ అణు కార్యక్రమాలను ఇజ్రాయెల్ వ్యూహాత్మకంగా లక్ష్యంగా చేసుకుంటోందా? లెబనాన్‌లో హిజ్బుల్లా నేతలే లక్ష్యంగా పేజర్, వాకీటాకీ బాంబులను పేల్చిన ఇజ్రాయెల్.. ఇరాన్‌పైనా అలాంటి వ్యూహాన్నే అమలు చేయాలని కసరత్తు చేసిందా? ఏకంగా ఇరాన్ అణు కార్యక్రమాల పరికరాల్లో ఐఈడీలను అమర్చిందా? టెహ్రాన్ అణు కార్యక్రమాలను తన నియంత్రణలోకి తెచ్చుకుని, అణ్వాయుధాలు, ఇతర అణు ప్రాజెక్టులను ఏ క్షణాన్నైనా పేల్చేసేందుకు వ్యూహం రచించిందా?? ఈ ప్రశ్నలకు ఇరాన్ ప్రభుత్వం అవునని చెబుతోంది. తాము అణు కార్యక్రమాల కోసం కొనుగోలు చేసిన కవ్వాలు(సెంట్రల్ ఫ్యూజ్)కు సంబంధించిన ప్లాట్‌ఫారాల్లో ఇజ్రాయెల్ అమర్చిన బాంబులను గుర్తించామని ఇరాన్ వ్యూహాత్మక వ్యవహారాల ఉపాధ్యక్షుడు, విదేశాంగ శాఖ మాజీ మంత్రి మహమ్మద్ జావేద్ జరీఫ్ 'ఇరాన్ ఇంటర్నేషనల్‌'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. "ఈ చర్య మా భద్రత సవాళ్లను తీవ్రతరం చేసింది" అని ఆయన వివరించారు. అయితే.. ఈ ఘటన ఎప్పుడు జరిగింది? ఎలా గుర్తించారు? అనే వివరాలను ఆయన వెల్లడించలేదు. 2020లో ఇరాన్‌లోని నతాంజ్ అణు కేంద్రంలో సెంట్రల్ ఫ్యూజ్‌లు పేలిపోయి, భారీ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే..! 2021లోనూ నాటాన్జ్ అణు కేంద్రంపై సైబర్ దాడి జరిగింది. అప్పట్లో ఇరాన్ ఈ ఘటనలను 'న్యూక్లియర్ టెర్రరిజం' అని అభివర్ణించింది. తాజాగా జరీఫ్ చేస్తున్న ఆరోపణలు 2021లో కొనుగోలు చేసిన సెంట్రల్ ఫ్యూజ్‌కు సంబంధించినవని ఇరాన్ పత్రికలు చెబుతున్నాయి. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పజెకియాన్ కూడా దీనిపై పరోక్షంగా స్పందించారు. ఎన్‌బీసీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ యుద్ధం పట్ల ఆసక్తి చూపడం లేదన్నారు.

దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ అరెస్టు

సియోల్, జనవరి 15: దక్షిణ కొరియాలో కీలక పరిణామం చోటు చేసుకుంది. నాటకీయ పరిణామాల నడుమ అభిశంసనకు గురైన అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను దక్షిణ కొరియా పోలీసులు అరెస్టు చేశారు. దేశంలో 'మార్షల్ లా' విధించి చట్టాన్ని ఉల్లంఘించినందుకు గాను యూన్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, బుధవారం తెల్లవారుజామున దాదాపు 3వేల మంది పోలీసులు, అవినీతి నిరోధకశాఖ అధికారులు యూన్ నివాసానికి చేరుకున్నారు. యూన్‌ను అరెస్టు చేసేందుకు వెళ్లిన వీరిని ఆయన మద్దతుదారులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. తీవ్ర ఉద్రిక్తతల నడుమ అధికారులు అధ్యక్ష నివాసంలోకి వెళ్లి యూన్‌ను అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఓసారి యూన్‌ను అరెస్టు చేసేందుకు అధికారులు ప్రయత్నించగా తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకోవడంతో వెనక్కు తగ్గారు. ఇక దక్షిణ కొరియా చరిత్రలో అధ్యక్షుడు అరెస్టవడం ఇదే తొలిసారి.

అగ్రశ్రేణి నౌకాదళంగా భారత్

- ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన
- రెండు యుద్ధ నౌకలు, జలాంతర్గామి జాతికి అంకితం


ఐఎన్ఎస్ సూరత్ నమూనాలో ప్రధాని మోదీ, నేవీ చీఫ్ దినేశ్

ముంబై, జనవరి 15: ఒకేసారి శక్తిమంతమైన అస్త్రాలు మూడు చేరడంతో భారత నౌకాదళం మరింత సమున్నతమైంది. ముంబై నావల్ డాక్‌యార్డ్ నుంచి భారత నౌకాదళ చరిత్రలో తొలిసారి ఓ డిస్ట్రాయర్, ఓ ఫ్రిగేట్, మరో జలాంతర్గామి భారత అమ్ములపొదిలోకి చేరాయి. యుద్ధ నౌకలైన ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం జాతికి అంకితం చేశారు. భారత సముద్ర వారసత్వం, నౌకాదళ చరిత్ర, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌కు ఇది చిరస్మరణీయమైన రోజు అని ఈ సందర్భంగా మోదీ అన్నారు. మూడు శక్తిమంతమైన అస్త్రాలు ఒకేసారి నౌకాదళంలో చేరడం చరిత్రలో ఇదే మొదటిసారని చెప్పారు. ఇవి స్వదేశంలో తయారు కావడం అత్యంత గర్వకారణమని కొనియాడారు. వీటి రాకతో ప్రపంచంలోనే ఓ అగ్రశ్రేణి నౌకాదళంగా భారత్ అవతరించిందని అభివర్ణించారు. అంతర్జాతీయ జలాల్లో రక్షణాత్మక చర్యలు చేపట్టడంలో భారత పాత్ర గణనీయంగా పెరిగిందని, మొత్తం హిందూ మహా సముద్ర ప్రాంతంలో తొలిగా స్పందించేది భారత్ అని, ఈ ప్రాంతంలో మన సైనికులు వందలాది మంది ప్రాణాలను కాపాడారని మోదీ తెలిపారు. కీలకమైన మారిటైమ్ శక్తిగా ఎదుగుతున్న భారత్.. జల సరిహద్దులు, స్వేచ్ఛాయుత సముద్రయానం, వ్యాపార మార్గాలను కాపాడటంలో ముఖ్యమైన పోషించాలని చెప్పారు.

భారత్‌ది అభివృద్ధి వాదం..

భారత్‌ది విస్తరణ వాదం కాదని, అభివృద్ధి స్ఫూర్తితోనే మనదేశం పనిచేస్తుందని మోదీ స్పష్టం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత, సహకారం, అభివృద్ధికి భారత్ ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందన్నారు. భవిష్యత్‌లో ప్రపంచంలో కీలకమైన శక్తిగా ఎదిగేందుకు విశాల దృక్పథంతో చేపడుతున్న చర్యలను కూడా మోదీ వివరించారు. సముద్రగర్భంలోని అత్యంత లోతులను శోధించే శక్తిని భారత్ పెంచుకుంటోందని, 6 వేల మీటర్ల లోతుల్లో కూడా అన్వేషణ కొనసాగించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించామని వెల్లడించారు. నౌకాదళంలో 'మేడిన్ ఇండియా' శక్తిసామర్థ్యాలు శరవేగంగా పెరగడాన్ని గర్వకారణమన్న మోదీ.. దీనికి 2014 నుంచి రెండింతలైన నౌకాదళ శక్తి నిదర్శనమని చెప్పారు. ఇప్పటి వరకు 33 నౌకలు, ఏడు జలాంతర్గాములను ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. సముద్ర వ్యవహారాల్లో కూడా గ్లోబల్ లీడర్‌గా ఎదిగే బాటలో భారత్ ఉందని అన్నారు.


ఇస్కాన్ ఆలయాన్ని ప్రారంభించిన మోదీ

ముంబై పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. నవీ ముంబైలోని ఖర్ఘర్‌లో నిర్మించిన ఇస్కాన్ ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. సేవా స్ఫూర్తిలోనే భారత ఆధ్యాత్మిక మూలాలు ఉన్నాయని ఈ సందర్భంగా మోదీ ఉద్ఘాటించారు. ప్రజా శ్రేయస్సు కోసం తమ ప్రభుత్వం దశాబ్దకాలానికి పైగా నిస్వార్థంగా పనిచేస్తోందని చెప్పారు. సేవా స్ఫూర్తి నిజమైన సామాజిక న్యాయానికి, లౌకికవాదానికి ఆలంబనగా నిలుస్తుందని మోదీ అభిప్రాయపడ్డారు. యువకుల్లో ఇస్కాన్ సేవా స్ఫూర్తిని నింపుతోందని కొనియాడారు.

ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం!

- ఉత్తర భారతంలోని సరిహద్దుల్లో పరిస్థితి సాధారణమే: ఆర్మీ చీఫ్
- పుణెలో ఘనంగా 77వ ఆర్మీ డే

పుణె, జనవరి 15: దేశ సరిహద్దు వెంబడి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే సమర్థత మనకుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. ఉత్తర భారతంలోని సరిహద్దుల్లో పరిస్థితి సున్నితమైనప్పటికీ ప్రస్తుతం సాధారణంగానే ఉందని పేర్కొన్నారు. పుణెలోని ఆర్మీ సదరన్ కమాండ్‌కు చెందిన బాంబే ఇంజనీరింగ్ గ్రూప్ అండ్ సెంటర్‌లో బుధవారం ఆర్మీ డే పరేడ్ ఘనంగా జరిగింది. ఈ వేడుకలలో ద్వివేది మాట్లాడారు. నియంత్రణ రేఖ వెంబడి కాల్పుల విరమణ కొనసాగుతోందని, అయితే చొరబాటు ప్రయత్నాలూ జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఆర్మీ డే వేడుకలను తొలిసారి పుణెలో నిర్వహిస్తున్నామని, ఇది కూడా ప్రాముఖ్యత కలిగిన అంశమని, ఇకపై చిన్న నగరాల్లో వేడుకలను నిర్వహిస్తామన్నారు.




వీర జవాన్‌కు గ్యాలంటరీ అవార్డు

సిరిసిల్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతిచెందిన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన జవాన్ అనిల్‌కుమార్(30)కు కేంద్రం ప్రకటించిన గ్యాలంటరీ అవార్డును ఆయన సతీమణి సౌజన్యకు అందజేశారు. పుణెలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. 2023 మే 4న జమ్మూకశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అనిల్ మృతి చెందారు.

డ్రోన్ విధ్వంసక సూక్ష్మ క్షిపణి 'భార్గవాస్త్రం'

- మైక్రో మిస్సైల్ సిస్టమ్ పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ, జనవరి 15: దేశ రక్షణ వ్యవస్థలోకి మరో సరికొత్త క్షిపణి వ్యవస్థ చేరనుంది. డ్రోన్ విధ్వంసక సూక్ష్మ క్షిపణి వ్యవస్థ 'భార్గవాస్త్రం'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. డ్రోన్ తరహా దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దేశీయంగా రూపొందించిన ఈ మైక్రో మిస్సైల్ సిస్టమ్‌ను.. ఒడిసాలోని గోపాల్‌పూర్‌లోని సీవార్డ్ ఫైరింగ్ రేంజ్ నుంచి పరీక్షించారు. భారత సైన్యం కోసం అభివృద్ధి చేసిన ఈ మైక్రో మిస్సైల్ 2.5 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. ఈ ఏడాది చివర్లో మరోసారి పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించి దీన్ని సైన్యానికి అందుబాటులోకి తెచ్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భార్గవాస్త్రం అనేది ఒక కౌంటర్ డ్రోన్ వ్యవస్థ. డ్రోన్ దాడులను దీటుగా ఎదుర్కొనేందుకు దీన్ని అభివృద్ధి చేశారు. 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న వైమానిక వాహనాలను కూడా ఇది గుర్తించి, గైడెడ్ మైక్రో బాంబులను ఉపయోగించి వాటిని నిర్వీర్యం చేస్తుంది. భార్గవాస్త్రం వ్యవస్థకు ఏకకాలంలో 64 మైక్రో క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం ఉంది. ఎక్కడికైనా సులువుగా, వేగంగా తరలించవచ్చు.

అన్న కూతురును ప్రేమించాడని..
వ్యక్తి ఇంటికి అగ్గి

(మొదటి పేజీ తరువాయి)

అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మచ్చబొల్లారం డివిజన్, గోపాల్‌నగర్ ఎరుకల బస్తీలో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ప్రదీప్ (25) తన తల్లిదండ్రులతో కలిసి గత 20 ఏళ్లుగా ఉంటున్నారు. గతంలో ప్రదీప్ తాను ప్రేమించే యువతి చిన్నాన్న వివేకానంద (40) బైక్ షోరూమ్‌లో పని చేశాడు. ఈ క్రమంలో ప్రదీప్‌కు వివేకానంద అన్న కూతురితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అయితే దీనిని వివేకానంద సహించలేకపోయాడు. ఆమె జోలికి రావొద్దని ప్రదీప్‌ను పలుమార్లు హెచ్చరించాడు. అయినా ప్రదీప్ వైఖరిలో మార్పు రాకపోవడంతో వివేకానంద ఉక్రోషం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ప్రదీప్ కుటుంబ సభ్యులను చంపాలనుకొని పథకం ప్రకారం మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో క్యాన్‌లో పెట్రోల్ తీసుకుని ప్రదీప్ ఇంటికి వివేకానంద వచ్చాడు. అప్పుడు ప్రదీప్ ఇంట్లో లేడు.. అతని తల్లిదండ్రులు ప్రకాష్, హేమలత ఉన్నారు. వివేకానంద తన వెంట తెచ్చిన పెట్రోల్‌ను వారిద్దరిపై చల్లాడు. అలాగే ఇంటి తలుపులపై వెదజల్లి నిప్పంటించడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ప్రకాష్ శరీరమంతా మంటలంటుకున్నాయి. హేమలత మాత్రం త్రుటిలో మంటల నుంచి తప్పించుకుంది. మంటలు వ్యాపించడంతో ప్రకాష్ ఇంటికి సమీపంలో ఆరుబయట ఆడుకుంటున్న దిలీప్ అనే వ్యక్తి కూతురు చాందినీ (4)కి కూడా మంటలంటుకున్నాయి. పాప కాళ్లు, చేతులు, కడుపు భాగంలో మంటలు అంటుకోవడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రకాష్‌ను స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించగా, చిన్నారి చాందినిని వారి కుటుంబ సభ్యులు కొంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. 50శాతం గాయాలైన ప్రకాష్ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. చిన్నారి తల్లిదండ్రులు పేదవారు కావడంతో వారు వైద్యం చేయించడం కష్టంగా మారింది. గాయాలపాలైన పాప రోదిస్తుండటంతో తల్లిదండ్రులు చూడలేక విలవిల్లాడుతున్నారు. వారి ప్రేమ వ్యవహారం తమ పాపకు శాపంగా మారిందని బాధపడుతున్నారు. పరారీలో ఉన్న నిందితుడు వివేకానంద కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన ప్రకాష్

ప్లాట్ మార్ట్‌గేజ్‌కు 10 వేలు లంచం డిమాండ్

- ఏసీబీకి చిక్కిన మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్
- కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు

మెట్‌పల్లిటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ మార్ట్‌గేజ్ చేసేందుకు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సుంకె విష్ణుకు మెట్‌పల్లిలోని సాయిరాంనగర్ కాలనీలో 266 గజాల ప్లాట్ ఉంది. దాన్ని మార్ట్‌గేజ్ చేసేందుకు ఆయన మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన ఫైలు సబ్‌రిజిస్ట్రార్ ఆసిఫుద్దీన్ వద్దకు చేరగా రూ. 10 వేలు లంచం ఇవ్వాల్సిందిగా కార్యాలయంలో పనిచేస్తున్న సబార్డినేట్ (అవుట్ సోర్సింగ్ ఉద్యోగి) బానోతు రవి ద్వారా సుంకె విష్ణుకు తెలియజేశాడు. దీంతో బాధితుడు అంత ఇవ్వలేనని రూ.5వేలు ఇస్తానని ఒప్పందం చేసుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు బుధవారం బాధితుడు సుంకే విష్ణు కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న ఆర్మూర్ రవికి రూ. 5 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ ఆసిఫుద్దీన్, సబార్డినేట్ బానోతు రవి, డాక్యుమెంట్ రైటర్ సహాయకుడు ఆర్మూర్ రవిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.


సబ్‌రిజిస్ట్రార్ ఆసిఫుద్దీన్

పుప్పాలగూడలో జంట హత్యల కలకలం

- ఆలయ గుట్టపై వివాహిత, ఓ యువకుడి దారుణ హత్య
- కత్తితో పొడిచి, తలపై బండరాళ్లతో మోది కిరాతకం
- వివాహేతర సంబంధమే కారణమని అనుమానం
- రంగారెడ్డి జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



నార్సింగ్/వనస్థలిపురం/రాయదుర్గం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పుప్పాలగూడ ప్రాంతంలో ఓ జంట దారుణ హత్య తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తులు పుప్పాలగూడ పద్మనాభ స్వామి ఆలయం గుట్టపై ఓ వివాహిత, మరో యువకుడిని కిరాతకంగా చంపేశారు. కత్తితో పొడిచి, తలపై బండరాయితో మోది ప్రాణాలు తీశారు. సంక్రాంతి రోజున గాలి పటాలు ఎగరేసేందుకు గుట్ట మీదకు వచ్చిన స్థానికులు మృతదేహాలను చూడడంతో ఈ దారుణం వెలుగు చూసింది. వనస్థలిపురానికి చెందిన బిందు(30), నానక్‌రాంగూడకు చెందిన అంకిత్ సాకేత్(25)ను మృతులుగా గుర్తించిన పోలీసులు వివాహేతర సంబంధమే హత్యలకు కారణమని అనుమానిస్తున్నారు. రాజేంద్రనగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిందు.. తన భర్త, ముగ్గురు పిల్లలతో కలిసి వనస్థలిపురంలో నివాసముండేది. బిందు ఓ ఐటీ కంపెనీలో చిన్న ఉద్యోగి కాగా ఆమె భర్త కూలి పనులకు వెళతుంటారు. ఇక, మధ్యప్రదేశ్‌కు చెందిన సాకేత్ నానక్‌రాంగూడాలో నివాసముంటూ ఓ ఐటీ కంపెనీ హౌస్ కీపింగ్ విభాగంలో పని చేసేవాడు. ఈ క్రమంలో వీరి మధ్య ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. అయితే, జనవరి 3న ఇంటి నుంచి వెళ్లిన బిందు తిరిగి రాలేదు. దీనిపై బిందు భర్త జనవరి 4న వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇక, 11వ తేదీ నుంచి సాకేత్ కనిపించడం లేదని అతని కుటుంబసభ్యులు 12వ తేదీన గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, పుప్పాలగూడ పద్మనాభ స్వామి ఆలయ గుట్టపై వీరిద్దరూ మృతదేహాలై కనిపించారు. ఎవరో వీరిని కత్తితో పొడిచి తలపై బండరాయితో మోది హత్య చేశారు. బిందు శరీరంపై సగం దుస్తులు మాత్రమే ఉండడంతో హత్యాచారం జరిగిందనే అనుమానం ఉంది. ఘటనా స్థలిలో ఆధారాలు సేకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టి మృతుల వివరాలను సేకరించారు. బిందు, సాకేత్ కలిసి ద్విచక్రవాహనంపై ఘటనాస్థలికి వచ్చిన దృశ్యాలను సీసీ ఫుటేజీల్లో గుర్తించారు. బిందుకు మరో వ్యక్తితో కూడా వివాహేతర సంబంధం ఉందని విచారణలో తెలియడంతో .. ఆ వ్యక్తి ఏమైనా దారుణానికి పాల్పడ్డాడా ? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఆ మూడో వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

యువతిని రక్షించబోయి హత్యకు గురయ్యాడా?!

- ఖమ్మంలో అదృశ్యమైన యువకుడి మృతి
- సాగర్ కాలువలో మృతదేహం లభ్యం


సంజయ్ (ఫైల్)

ఖమ్మం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం ఖమ్మంలో జరిగిన యువకుడి అదృశ్యం ఘటన విషాదాంతమైంది. అతడి మృతదేహం మంగళవారం సాగర్ కాలువలో లభించింది. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి పరిధిలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతానికి చెందిన పందెపు హనుమంతరావు, మమత దంపతుల పెద్దకుమారుడు జ్ఞానసాయి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వారి చిన్న కుమారుడు సంజయ్‌కుమార్(22) కూడా అన్న దగ్గరే ఉండి చదువుకుంటున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా సంజయ్ గత ఆదివారం ఖమ్మం వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున అతడి అన్న కూడా వస్తుండడంతో తీసుకువచ్చేందుకు ఖమ్మం బస్టాండ్‌కు వెళుతున్నానని ఇంట్లో చెప్పి బైక్‌పై బయటికి వెళ్లాడు. కొంతసేపటి తరువాత తనను ఓ ఆటో ఢీకొట్టిందని తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. మరికొంత సమయానికి సాగర్ కాల్వకట్టపై ఆటోలో ఓ యువతిని చంపారని, తనను కూడా చంపుతున్నారని తన అన్న ఫోన్‌కు వాయిస్ మెసేజ్ పంపించాడు. ఆ తరువాత అతడి ఫోన్ స్విచాఫ్ అయ్యింది. దీంతో కుటుంబసభ్యులు, కాలనీ యువకులు మున్నేరు, సాగర్ కాలువ కట్టపైకి వెళ్లి గాలించగా అతడి బైక్ కనిపించింది. అతడు మాత్రం కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అతడి మృతదేహం మంగళవారం సాయంత్రం కొణిజర్ల మండలం తనికెళ్ల పరిధిలోని సాగర్ కాల్వ లాకుల వద్ద లభ్యమైంది. తమ కుమారుడిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సంజయ్ కుటుంబసభ్యులు, కాలనీ వాసులు ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై మృతదేహంతో ధర్నా నిర్వహించారు. కాగా సంజయ్ తన అన్న ఫోన్‌కు పంపించిన వాయిస్ మెసేజ్‌లో చెప్పినట్లుగా ఆటోలో యువతిని అపహరించినట్లుగాని, హత్య జరిగినట్లుగానీ ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

నేటి నుంచి గుడంబాపై స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గుడంబాపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు గురువారం నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నాయి. ఇంతకు ముందు మూడుసార్లు ఈ తరహా స్పెషల్‌డ్రైవర్ నిర్వహించి, సత్ఫలితాలను సాధించామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. 13 జిల్లాల్లో గురువారం ప్రారంభించే డ్రైవ్ వచ్చేనెల 15 వరకు కొనసాగుతుందన్నారు. 25 మండలాల్లో నాటుసారా తయారీ అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు.


నువ్వుల నూనె తాగుతున్న ఆదివాసీ మహిళ

రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగిన ఆదివాసీ మహిళ

- మొక్కు తీర్చుకున్న తొడసం ఆడపడుచు

నార్నూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని తొడసం వంశస్థుల ఆరాధ్య దైవమైన ఖాందేవుని జాతర ప్రతీఏడాది జనవరిలో సంక్రాంతి రోజున మొదలవుతుంది. ఈ జాతరలో తొడసం వంశానికి చెందిన ఆడబిడ్డ నాగుబాయి చందు మంగళవారం రెండున్నర కిలో నువ్వుల నూనె తాగి మొక్కును తీర్చుకుంది. తొడసం వంశస్థుల ఇళ్ల నుంచి పూజకు నూనెను సేకరిస్తారు. ఈ నూనెను ఆ వంశానికి చెందిన ఆడపడుచు తాగి మొక్కు తీర్చుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ జాతరకు మహారాష్ట్ర, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో జనాలు వస్తారు.

మావోయిస్టుల పేరిట లేఖ రాసి.. చిక్కారు

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని హెచ్చరిస్తూ లేఖ
- ముగ్గురి అరెస్ట్, మరొకరి పరారీ

మహబూబ్‌నగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అనిరుధ్‌రెడ్డి ఎమ్మెల్యే కాకముందు ఆయన వెంటే ఉన్నారు.. ఆర్థికంగా ఏ ప్రయోజనం జరగడంలేదని ఎన్నికలకు ముందు ఆయనను వీడి బీఆర్ఎస్‌లో చేరి అనిరుధ్‌రెడ్డికి వ్యతిరేకంగా పనిచేశారు. అయితే అనిరుధ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికవడాన్ని జీర్ణించుకోలేక ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే లక్ష్యంతో మావోయిస్టుల పేరిట నకిలీ ఉత్తరం రాశారు. దీనికి సంబంధించిన కేసును పోలీసులు ఛేదించారు. వివరాలను మంగళవారం జిల్లా ఎస్పీ జానకి మీడియాకు వెల్లడించారు. ఈ నెల 9న మావోయిస్టుల పేరిట జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఆయన సోదరుడు దుశ్యంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనుచరులు ఐదుగురిని హెచ్చరిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలో ఓ ఇంటి గోడపై వెలిసిన లేఖ కలకలం రేపింది. గ్రామానికి చెందిన కోమటి రవికుమార్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. గ్రామానికి చెందిన షేక్ రఫిక్‌పై అనుమానంతో పోలీసులు విచారించగా.. ఎమ్మెల్యేపై కోపంతో తామే లేఖ రాసినట్లు అంగీకరించారు. అనిరుధ్‌రెడ్డి అనుచరుడిగాఉన్న ఇతను ఎన్నికలకు ముందు విభేదించి బీఆర్ఎస్‌లో చేరాడు. అయితే అనిరుధ్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం జీర్ణించుకోలేకపోయాడు. ఎమ్మెల్యేతోపాటు అతని అనుచరుల పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించాలన్న ఉద్దేశంతో అదే గ్రామానికి చెందిన కుమ్మరి భగవంతు, షా అలీ, షేక్ తౌఫిక్‌లతో కలిసి మావోయిస్టుల పేరుతో లేఖలు తయారు చేయాలనుకున్నారు. ఏ1 నిందితుడు షేక్ రఫిక్‌కు తెలిసిన ప్రింటింగ్ ప్రెస్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరిట లెటర్‌ప్యాడ్ తయారు చేయించాడు. అందులో లచ్చన్న దళం పేరిట లేఖ రాశారు. షేక్ తౌఫిక్ గ్రామంలో లేఖ అతికించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. షేక్ తౌఫిక్ పరారీలో ఉన్నాడు. అరెస్ట్ చేసిన వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సోనా' సొరంగం..!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మొన్న సోమవారం జమ్మూకశ్మీర్‌లో సోనామార్గ్ సొరంగాన్ని ఆరంభించారు. ఆరున్నర కిలోమీటర్ల పొడవున్న ఈ సొరంగ మార్గం వల్ల ఈ కేంద్రపాలిత ప్రాంతానికి ఆర్థికంగానూ, దేశానికి రక్షణపరంగానూ ఎంతోమేలు జరుగుతుందని విశ్లేషణలు వెలువడ్డాయి. సముద్రమట్టానికి ఎనిమిదిన్నర వేల అడుగులో దీనిని నిర్మాణానికి ఎవరు ఎంతగా శ్రమించారో ఆరంభానికి బాగా ముందునుంచే వ్యాఖ్యానాలు వినబడ్డాయి. మంచుపెళ్ళలు విరిగిపడుతూ రాకపోకలకు ఏమాత్రం వీలులేని పరిస్థితులు ఈ సొరంగం ఏర్పాటుతో పూర్తిగా మారినమాట వాస్తవం. శ్రీనగర్ నుంచి సోనామార్గ్‌కు దట్టమైన మంచున్నకాలంలో కూడా సులువుగా పోవచ్చును. ప్రజల రాకపోకలకు వీలుకల్పిస్తూ, వ్యాపారావకాశాలను పెంచుతున్న ఈ సొరంగం ఏర్పాటుతో కశ్మీర్‌కు ఎంత లబ్ధిచేకూరగలదో ప్రధాని తన ప్రసంగంలో వివరించారు. కశ్మీర్‌ను గతంలో భూతలస్వర్గం అనేవారనీ, సోనామార్గ్ సొరంగం ఆరంభంతో ఇకపై మళ్ళీ అలా పిలవడం మొదలవుతుందనీ అన్నారాయన. తమ పదేళ్ళ ఏలుబడిలోనే దేశం ప్రగతి మెట్లు ఎక్కినట్టుగానూ, ప్రత్యేకప్రతిపత్తి పోవడంతోనే కశ్మీర్ కళకళలాడుతున్నట్టుగానూ వ్యాఖ్యలు చేయడం బీజేపీ పెద్దలకు అలవాటే. అతిశయోక్తులను అటుంచితే, ఏడాది అంతా శ్రీనగర్‌ను లద్దాఖ్‌తో అనుసంధానించే ఈ టన్నెల్ ఆరంభం కశ్మీర్ ఆర్థిక పురోగతికి తోడ్పడేమాట నిజం.

మోదీ ప్రధాని కావడానికి రెండేళ్ళకు ముందే ఈ సొరంగ నిర్మాణానికి పునాదులు పడినవిషయాన్ని గుర్తుచేస్తూ, ఈ కీర్తిలో తమకూ వాటా దక్కాలని కాంగ్రెస్ వాదిస్తోంది. మొత్తం కీర్తి మోదీకి పోతుందేమోనన్న భయంతో కాబోలు అప్పుడు తాము చూపిన చొరవనూ, పడిన శ్రమనూ ఆ పార్టీ గుర్తుచేస్తోంది. ఎవరి పాత్ర ఎంత అన్నది అటుంచితే, ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్న ప్రతీ ఒక్కరి పట్టుదలవల్లనే ఈ మూడువేలకోట్ల రూపాయల నిర్మాణం ప్రజలకు అందుబాటులోకి వచ్చిన మాట నిజం. అత్యంత సంక్లిష్టమైన ప్రాంతంలో, ప్రకృతి బీభత్సాలకు ఎదురొడ్డి ఈ అద్భుతాన్ని ఆవిష్కరించడానికి పన్నెండేళ్ళు పట్టడంలో తప్పేమీ లేదు. 1999లో కార్గిల్‌లో ఓ చిన్నయుద్ధం చేయాల్సివచ్చిన తరువాత, సర్వకాల సర్వావస్థల్లోనూ సైన్యం ఎల్‌వోసీ, ఎల్ఏసీలకు సులువుగా చేరగలిగే మార్గాలు ఉండాలన్న విషయం మనకు స్పష్టంగా తెలిసొచ్చింది. చైనా దురాక్రమణల తరువాత లద్దాఖ్ మీద మరింత పట్టుబిగించాల్సిన ఆవశ్యకత కనిపించింది. కార్గిల్, లద్దాఖ్ సెక్టార్లను సైనికపరంగా మనకు చేరువచేయడానికి ఈ టన్నెల్ ఉపకరిస్తుంది.


అప్పట్లో అబ్దుల్లాలు అధికారంలో ఉండగానే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం, ఇప్పుడు మళ్ళీ వారి ఏలుబడిలోనే ఆరంభోత్సవం జరగడం కొందరు గుర్తుచేస్తున్నారు. ఆ అనుబంధం వల్లనో, మరేకారణంచేతనో, ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాత్రం ఈ టన్నెల్ ఆరంభోత్సవ కార్యక్రమంలో మోదీని అధికంగా కీర్తించారని కొందరికి ఆగ్రహం కలిగింది. మోదీ మూడో సారి ప్రధానిగా అధికారం చేపట్టిన తర్వాత శ్రీనగర్‌లో అంతర్జాతీయ యోగాదినోత్సవంలో పాల్గొన్నారని, ఎన్నికలు నిర్వహిస్తామని ప్రజలకు ఆయన అప్పుడుచేసిన వాగ్దానాన్ని నాలుగునెలల్లోనే నెరవేర్చారని ఒమర్ చెప్పుకొచ్చారు. తాను ముఖ్యమంత్రి కావడానికి వీలుగా ఎన్నికలు జరిపినందుకు ఆయన ఎన్నికల సంఘానికీ, ప్రధానికీ కృతజ్ఞతలు తెలియచేశారు. అయితే, ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారంటూ సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వం మెడమీద కత్తిపెట్టిన కారణంగా, అప్పట్లో కేంద్రప్రభుత్వం నిర్దిష్టమైన గడువుకు హామీపడిన విషయాన్ని ఒమర్ మరిచిపోయినట్టు ఉన్నారు. అలాగే, ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరిగాయని ఉద్ఘాటించడం ద్వారా తాను భాగస్వామిగా ఉన్న ఇండియాబ్లాక్‌ను కూడా ఆయన ఇరకాటంలో పడేశారు. కశ్మీర్‌లో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని ఆయన ఏ ప్రాతిపదికన వ్యాఖ్యానించారో తెలియదు. సోన్‌మార్గ్ సొరంగం నిర్మాణంలో ఉండగానే ఏడుగురు కార్మికులను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రతిపత్తికోసమే ఒమర్ అబ్దుల్లా ఈ మోదీ కీర్తిగానానికి ఉపక్రమించి ఉండవచ్చు. ఆ కాలం ఎప్పుడు కలిసొస్తుందో మోదీ తెలివిగా చెప్పలేదు కానీ, ఇచ్చినమాట ప్రకారం త్వరలోనే అది నెరవేరితే జమ్మూకశ్మీర్ ప్రజలకు మేలు జరుగుతుంది.

'తొలి సవరణ'పై బీజేపీ వక్రభాష్యాలు

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తొలి రాజ్యాంగ సవరణపై ఓ విచిత్ర వాదనను లేవనెత్తింది. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం వాక్ స్వాతంత్ర్యాన్ని అణచి వేసిందంటూ అదే పనిగా ఆరోపిస్తోంది. నిజానికి బీజేపీ ఎన్నడూ తన పార్టీలో అసమ్మతి గళాలను సహించదన్న, వాటిని నిర్దాక్షిణ్యంగా అణిచివేస్తుందన్న ఆరోపణ ఉండనే ఉంది. నేడు దేశవ్యాప్తంగా జైళ్లన్నీ నేరస్తులతో గాక అధికార బీజేపీ నియంతృత్వపు పోకడలను ప్రశ్నిస్తున్న విద్యార్థులు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, ప్రతిపక్ష నేతలు కిక్కిరిసి ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి మధ్య– ఆత్మరక్షణలో పడినప్పుడు ఎదురుదాడి చేయడమే ఉత్తమం (అఫెన్స్ ఈజ్ ద బెస్ట్ డిఫెన్స్) అనే వ్యూహాన్ని అనుసరిస్తున్నది బీజేపీ. ఆ క్రమం లోనే భారత రాజ్యాంగానికి నెహ్రూ ప్రభుత్వం చేసిన తొలి సవరణపై అనవసరపు రచ్చకు తెర లేపింది.

1951లో దేశంలో ప్రజలకున్న వాక్ స్వాతంత్ర్యంపై సహేతుకమైన పరిమితులను ప్రవేశపెట్టాలన్న నిర్ణయాన్ని ప్రధాని నెహ్రూ అనివార్యంగా తీసుకోవాల్సి వచ్చింది. దీనికి తగిన బలమైన నేపథ్యం ఉంది. ఆనాడు న్యాయస్థానాలు కొన్ని తీర్పుల్లో– ఉదాహరణకు, రమేష్ థాపర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ (1950), అదే విధంగా బ్రిజ్ భూషణ్ వర్సెస్ ఢిల్లీ స్టేట్ (1950) వంటి కేసుల్లో ఆర్టికల్ 19(2)లో పేర్కొన్న విధంగా– మతపరమైన హింసను అరికట్టడానికి నిర్దేశించిన చట్టాలు చెల్లుబాటు కావని స్పష్టం చేశాయి. దాంతో, స్వాతంత్ర్యానంతరం ప్రజల మధ్య ఐక్యతను దెబ్బ తీయడానికి జరిగిన విద్వేషపూరిత ప్రసంగాలు, మతపరమైన ప్రచారాలను ప్రభుత్వం నిరోధించ లేక పోయింది. ఈ పరిస్థితిని చూసి, భిన్నాభిప్రాయాలను స్వీకరించే ప్రజాస్వామ్య లక్షణం కలిగిన ప్రధాన మంత్రి నెహ్రూ వ్యక్తిగత స్వేచ్ఛ, సామూహిక భద్రతల నడుమ సమతుల్యతను సాధించాలని ప్రయత్నించారు. ఫలితంగానే, రాజ్యాంగానికి తొలి సవరణ చేశారు. ఆయన దీనిని తన రాజకీయ లబ్ధి కోసం గానీ, విమర్శకుల నోళ్లు మూయించడానికి గానీ ఒక ఆయుధంగా ఎప్పుడూ ఉపయోగించ లేదు.

ఇందుకు పూర్తి విరుద్ధంగా అసమ్మతి పట్ల బీజేపీ అసహనం తీవ్ర స్థాయిలో ఉంటున్నది. సామాజిక కార్యకర్తలను, ఉద్యమ కారులను 'ఉపా' వంటి క్రూరమైన చట్టాల కింద జైళ్లలోకి నెట్టారు. బీజేపీ విధానాలను నిర్మాణాత్మకంగా ఎండగట్టిన పాత్రికేయులు, మీడియా సంస్థలు వేధింపులకు గురయ్యారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను సైతం ఉపేక్షించలేదు. ఆనాడు నెహ్రూ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన కొన్ని పరిమితులను ఖండిస్తున్న బీజేపీ నేడు ప్రజాస్వామ్యయుతంగా అసమ్మతిని తెలియజేస్తున్న గళాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేయడానికి ఎటువంటి క్రూర చట్టాలను తెచ్చిందో అందరూ గమనిస్తూనే ఉన్నారు.



రాజ్యాంగానికి జరిగిన తొలి సవరణను వివాదాస్పదం చేయడం ద్వారా చరిత్రను బీజేపీ ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నది. రాజ్యాంగ సవరణ వల్ల వాక్ స్వాతంత్ర్యానికి ఏర్పడిన కొన్ని సహేతుకమైన పరిమితుల గురించి మాత్రమే మాట్లాడుతూ ఆ సవరణ వల్ల ఒనగూరిన ప్రయోజనాలను విస్మరించడం బీజేపీ హ్రస్వదృష్టికి నిదర్శనం. నెహ్రూ విధానాలను విమర్శించడం ద్వారా బీజేపీ ఆంక్షలు లేని వాక్ స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నదని భావిస్తే మనం బొక్కబోర్లా పడినట్లే!

ప్రజాస్వామ్యంలో వాక్ స్వాతంత్ర్యం ఎంతో ముఖ్యం. అయితే, రాజ్యాంగ తొలి సవరణ దానిని సంబంధించి మాత్రమే చేసింది కాదు. తొలి సవరణ పరిధి వాక్ స్వాతంత్ర్య చట్టాలను సవరించడం కంటే మించినది. దేశంలో సమతావాద రాజకీయాలకు అవకాశం కల్పించడానికి దోహదం చేసింది. ప్రధాని నెహ్రూ భూసంస్కరణ చట్టాలు న్యాయవ్యవస్థ ద్వారా చెల్లుబాటు కాకుండా రక్షించడానికి ఆర్టికల్స్ 31ఎ, 31బి; అదేవిధంగా 9వ షెడ్యూల్‌ను ప్రవేశపెట్టారు. ఈ నిబంధనలు జమీందారీ వ్యవస్థను కూలదోశాయి. లక్షలాది రైతులకు భూమిని పునఃపంపిణీ చేయడానికి, అదేవిధంగా భూస్వామ్య వ్యవస్థ విచ్ఛిన్నానికి దోహదం చేశాయి.

ఉదాహరణకు, స్వాతంత్ర్యానంతరం జమీందారీ నిర్మూలన చట్టాలపై భూస్వాముల నుంచి గట్టి ప్రతిఘటన ఎదురైంది. ఈ చట్టాలను న్యాయస్థానాలలో వారు సవాలు చేశారు. స్టేట్ ఆఫ్ బీహార్ వర్సెస్ కామేశ్వర్ సింగ్ కేసులో బీహార్ భూ సంస్కరణల చట్టం 1950 రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ, రాజ్యాంగం 3వ విభాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతుందన్న కారణంగా న్యాయస్థానం దానిని కొట్టివేసింది. ఇందువల్లనే ఆర్టికల్స్ 14, 19 కింద ఎదురయ్యే న్యాయపరమైన సవాళ్ల నుంచి వ్యవసాయ సంస్కరణలను పరిరక్షించడానికి ఆర్టికల్ 31ఎ ను ప్రభుత్వం తీసుకువచ్చింది. ఆర్టికల్ 31బి, 9వ షెడ్యూల్ ఇవి రెండూ ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతుందనే కారణంగా కొన్ని నిర్దిష్టమైన చట్టాలను కొట్టివేయకుండా రక్షణ కల్పించాయి. అంతేకాకుండా, ఇవి గతంలో ఉన్నవాటికి కూడా రక్షణ కల్పించాయి. ప్రధాని నెహ్రూ చేపట్టిన ఈ చర్యలు భూస్వామ్య వర్గాల ప్రమేయాన్ని తొలగించి రైతులకు, ప్రభుత్వానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పాయి.

జమీందారీ వ్యవస్థ రద్దుతో దేశంలో పెద్దఎత్తున భూపునఃపంపిణీకి మార్గం సుగమం అయింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ అధీనంలో ఉన్న భూములను, సాగుయోగ్యమైన బంజరు భూములను, ప్రైవేట్ అడవులతో సహా భూమిలేని రైతులకు పునఃపంపిణీ చేశారు. బీహార్ రాష్ట్రంలో '1949 బీహార్ భూ సంస్కరణల చట్టం' కింద ఇటువంటి చర్యలనే చేపట్టారు. సమాజంలో సమానత్వాన్ని సాధించడానికి ఈ భూ సంస్కరణలు చాలావరకు దోహదం చేశాయి. వీటితో పోల్చి చూసినప్పుడు– బీజేపీ ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలపై దేశ వ్యాప్తంగా ఎంత వ్యతిరేకత వచ్చిందో, రైతులు ఎలా రోడ్డెక్కి ఉద్యమించారో అందరం చూశాం. కార్పొరేట్ ప్రయోజనాల కోసమే ఈ చట్టాలు తెచ్చారన్న విమర్శను ఎదుర్కోలేక చివరకు బీజేపీ వాటిని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది.

అలాగే రాజ్యాంగానికి జరిగిన తొలి సవరణ ద్వారా ఆర్టికల్ 15(4)ను చేర్చడంతో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించే వీలు కలిగింది. అంతేకాకుండా, చారిత్రక అసమానతలను పరిష్కరించడానికి ఈ రాజ్యాంగ సవరణ ఉపయోగపడింది. మద్రాస్ రాష్ట్రం వర్సెస్ చంపకం దొరైరాజన్ కేసులో ఒక బ్రాహ్మణ అభ్యర్థి తమిళనాడు ప్రభుత్వం మతపరంగా ఇచ్చిన ప్రభుత్వ జీవోను సవాలు చేశాడు. కులం, మతం ఆధారంగా విద్యా సంస్థల్లో సీట్లను తమిళనాడు ప్రభుత్వం కేటాయించడాన్ని ఆ కేసులో ప్రశ్నించాడు. ఇతర కులాల అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు ఉన్నప్పటికీ, పిటిషనర్‌కు ప్రవేశం నిరాకరించబడింది. తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన కమ్యూనల్ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(1), 29(2)లను ఉల్లంఘిస్తోందని, ఇది వివక్షకు తావు లేకుండా ప్రభుత్వ సంస్థల్లో సమాన ప్రవేశానికి ఇచ్చే హామీకి విరుద్ధమని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. కాగా, ఆర్టికల్ 16(4) వెనుకబడిన తరగతులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లను అనుమతిస్తుండగా, విద్యకు సంబంధించి మాత్రం ఆర్టికల్ 15 ప్రకారం అటువంటి నిబంధన అమలులో లేదు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రాజ్యాంగ రక్షణలో గల అంతరాన్ని ఈ చారిత్రాత్మక తీర్పు ఎత్తిచూపింది. ఫలితంగా, ఇది ఆర్టికల్ 15(4)ని చేర్చడానికి దోహదం చేసింది. రిజర్వేషన్ల పైనా బీజేపీ వైఖరి ఏమాత్రం సానుకూలంగా లేదు. సామాజిక న్యాయం చేయడానికి విధానాలను సమీక్షించాలని పదేపదే కోరుతున్నప్పటికీ బీజేపీ వాటిని పెడచెవిన పెడుతూ తన సైద్ధాంతిక దివాళాకోరుతనాన్ని ప్రదర్శిస్తోంది.

రాజ్యాంగానికి జరిగిన తొలి సవరణను వివాదాస్పదం చేయడం ద్వారా బీజేపీ చరిత్రను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నది. రాజ్యాంగ సవరణ వల్ల వాక్ స్వాతంత్ర్యానికి ఏర్పడిన కొన్ని సహేతుకమైన పరిమితుల గురించి మాత్రమే మాట్లాడుతూ ఆ సవరణ వల్ల ఒనగూరిన ప్రయోజనాలను విస్మరించడం బీజేపీ హ్రస్వదృష్టికి నిదర్శనం. నెహ్రూ విధానాలను విమర్శించడం ద్వారా బీజేపీ ఆంక్షలు లేని వాక్ స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నదని భావిస్తే మనం బొక్కబోర్లా పడినట్లే! నెహ్రూ ప్రభుత్వం చేసిన తొలి రాజ్యాంగ సవరణను ఆనాడు దేశంలో రైతులకు, బడుగు బలహీన వర్గాలకు, సామాన్యులకు ఫ్యూడల్ శక్తుల నుండి లభించిన విముక్తిగా చూడాలి. బీజేపీ కువిమర్శ చరిత్రను వక్రీకరించడం తప్ప మరొకటి కాదు.

■ కె. రాజు
నేషనల్ కోఆర్డినేటర్
ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విభాగాలు – ఏఐసీసీ

'భారత్‌లో రాయబారం అపురూప గౌరవం'

భారత్‌కు నేను మొట్టమొదట నా కౌమార వయసులో వచ్చాను. ఈ అద్భుత దేశం నా హృదయాన్ని ఎలా చూరగొననున్నదనే విషయమై అప్పుడు నాకు ఎలాంటి భావన లేదు. భారత్‌కు అమెరికా రాయబారిగా నా దౌత్య బాధ్యతలను ముగించనున్న ఈ సమయంలో నా మనసు ఈ దేశం పట్ల కృతజ్ఞతా భావంతో నిండి ఉన్నది. ఎందుకంటే భారత్ నాకు ఎన్నో సమున్నత సత్యాలను నేర్పింది. అంతే కాదు, భారత్, అమెరికాలు కలసికట్టుగా ముందుకు సాగితే మన ఉభయ దేశాలకూ, మన ధరిత్రికి సుస్థిర శాంతి, సదా సమృద్ధ ఐశ్వర్యమూ సమకూరుతాయనే ఆశాభావమూ నాకు అపారంగా ఉన్నది.

అమెరికా రాయబారిగా ఈ అపురూప దేశం నాలుగు దిశలా ప్రయాణించాను. నిరంతర సందడితో ఉండే ముంబై వీధుల నుంచి కోల్‌కతా సాంస్కృతిక కేంద్రాల దాకా, హిమాలయ పర్వతాలు మొదలయ్యే ప్రాంతాలు, అరుణాచల్ ప్రదేశ్ నుంచి దక్షిణాగ్రాన ఉన్న కన్యాకుమారి దాకా నేను పర్యటించాను. ఈ సువిశాల దేశంలో నా పర్యటనలు, సందర్శనలలో ఈ పురానవ జాతి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ముఖ్యంగా అమెరికా, భారత్ కలసికట్టుగా ముందుకు సాగితే ఉభయ దేశాలూ సమస్త జీవన రంగాలలో మరింత మెరుగ్గా ఉండడమే కాకుండా ఈ ధరాతలంపై ఉన్న సకల సమాజాల జీవన స్థితిగతులను భవ్యంగా మార్చగలగడం సాధ్యమవుతుందనే వాస్తవాన్ని గుర్తించాను. ఆ అవగాహన నాలో ప్రగాఢంగా నెలకొంది. అంకెలు ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తున్నాయి : ఇంచుమించు 20,000 కోట్ల డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యంతో అమెరికా భారతదేశ అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్నది; అమెరికాలో మూడు లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు (అమెరికా విశ్వవిద్యాలయాలలోని విదేశీ విద్యార్థులలో భారతీయులే అత్యధికం); వరుసగా రెండో సంవత్సరం భారతీయులకు పది లక్షలకు పైగా వలసేతర వీసాలు జారీ చేయడం జరిగింది; వాతావరణ మార్పు నుంచి మన ధరిత్రిని రక్షించుకోవడానికి దాదాపు 1000 కోట్ల డాలర్ల మేరకు వ్యయపరచడం జరిగింది; ఆరోగ్య భద్రతకు సంబంధించి కలసికట్టుగా 90కి పైగా కొత్త ఔషధాల రూపకల్పన, ఉత్పత్తి ద్వారా ఇంచుమించు ఐదు కోట్ల మంది భారతీయులు లబ్ధి పొందారు. ఈ అంకెలు ఆశ్చర్యకరంగా ఉన్నప్పటికీ మన అసాధారణ స్నేహ సంబంధాల గాథను అవి సంపూర్ణంగా చెప్పేవి ఎంత మాత్రం కావు.



'మనం వర్తమానంలో చేసిన పనులపైనే మన భవిష్యత్తు ఆధారడి ఉంటుంది' అని మహాత్మా గాంధీ అన్న మాటలను సదా గుర్తుంచుకోవాలి. శాంతి, సంపద వృద్ధి, ప్రజల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు అనే లక్ష్యాలతో కూడిన ఉమ్మడి దార్శనికత స్ఫూర్తితో మనం కలసికట్టుగా కృషి చేయాలి. భారత్‌లో అమెరికా రాయబారిగా ఉండడం నా జీవితానికి దక్కిన సమున్నత గౌరవంగా భావిస్తున్నాను.

అమెరికా రాయబారిగా భారత్‌కు వచ్చినప్పుడు మన ఉభయ దేశాలు కలసికట్టుగా కృషి చేస్తున్న వివిధ రంగాల విస్తృతి, దాని ప్రాధాన్యం నన్ను అబ్బురపరిచింది. నవీన సాంకేతికతల నుంచి వాణిజ్యం దాకా, మహిళా సాధికారిత నుంచి ఆరోగ్యభద్రత దాకా, ఇండో పసిఫిక్ తీరస్థ దేశాల భద్రత, మహా సాగరాల అగాధాలలో అన్వేషణల నుంచి అంతరిక్షంలో పరిశోధనల దాకా .. ఇంకా ఎన్నో రంగాలలో మనం పరస్పరం సహాయ సహకారాలు అందించుకుంటున్నాం. నేను ఊహించిన దాని కంటే అతి విస్తృతంగా భారత్–అమెరికా సంయుక్త కృషి జరుగుతోంది. మన సంబంధాలలోని నాలుగు కీలక అంశాలు– శాంతి, సంపద సృష్టి, ధరిత్రి శ్రేయస్సు, ప్రజల అభ్యున్నతి–లో సంయుక్త కృషి మరింత మెరుగైన ప్రపంచాన్ని, ఉజ్వల భవిష్యత్తును ఎలా నిర్మిస్తుందో నేను ప్రత్యక్షంగా చూశాను.

భారత్‌లో నేను తొలుత అధికారికంగా పర్యటించిన అహ్మదాబాద్‌లో ఆ విశిష్ట కృషి సాధిస్తున్న సమున్నత ఫలితాలను చూశాను. ఆ నగరంలో మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న 'సేవ' అనే స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, నాయకురాళ్లను కలుసుకున్నాను. వారి గాథలు వాతావరణ సంక్షోభం నుంచి ప్రపంచాన్ని పరిరక్షించేందుకు తక్షణ, అంతర్జాతీయ కార్యాచరణ అవసరమనే సత్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. పూణేలోని సీరమ్ ఇనిస్టిట్యూట్‌లో మలేరియా వ్యాక్సిన్ ఉత్పత్తి కార్యకలాపాలను చూశాను. భారతీయ ఔషధ ఉత్పత్తిదారు, అమెరికాలోని జీవ సాంకేతికత కంపెనీ, బ్రిటన్ లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం సమష్టి కృషి ఫలితంగా ఆ వ్యాక్సిన్ ఉత్పత్తి అవుతోంది. మధ్య ఆఫ్రికా దేశం నొక దానికి ఎగుమతి చేయడానికై ఆ వ్యాక్సిన్ల పెట్టెలను ట్రక్కులలో ఎక్కించడాన్ని కూడా నేను చూశాను.

వివిధ సదస్సులలో ఉత్సాహపూరితులైన భారతీయ వ్యాపార, పారిశ్రామికవేత్తల ప్రతినిధి బృందాలను కలుసుకున్నాను. అమెరికాలో వందల కోట్ల డాలర్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు భారతీయ ప్రతినిధి బృందం ఒకటి అమెరికన్ కంపెనీలతో ఒక ఒప్పందానికి రావడం ఎంతైనా ముదావహమైన విషయం. అమెరికా– భారత పౌర విమానయాన రంగ శిఖరాగ్ర సదస్సులో ప్రైవేట్ పౌర విమానయాన సంస్థల నిర్వాహకులను కలుసుకున్నాను. హర్యానాలో ఒక విమానయాన కేంద్రాన్ని అభివృద్ధి పరిచేందుకు 15,000 కోట్ల డాలర్ల విలువైన అమెరికా విమానాలకు వారు ఆర్డర్ ఇచ్చారు.

భారతదేశ విశిష్ట కళాకృతులు, సంస్కృతీ సంప్రదాయాలు నన్ను చాలాకాలం నుంచీ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించేందుకు ఉద్దేశించిన సాంస్కృతిక సంపద ఒప్పందంలో సహ సంతకందారు అయినందుకు నేను అమితంగా గర్విస్తున్నాను. అమెరికాలో క్రికెట్ ఆట వర్ధిల్లేందుకు, అందునా 2028లో నా సొంత ఊరు అయిన లాస్ ఏంజెల్స్‌లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌లో ఆ క్రీడను కూడా చేర్చడానికి దోహదం చేసినందుకు నేను ఎంతగానో సంతోషిస్తున్నాను. ఆలోచనలలోను, ఆచరణలోను అమెరికా, భారత్ సంయుక్తంగా కృషి చేస్తే మనం తెరవ లేని ద్వారమంటూ ఉండదు, మనం కలుపుకు పోలేని స్నేహితుడు అంటూ ఉండడు. ఎందుకంటే మనం మరింత ప్రపంచ ప్రజల సమష్టి శ్రేయస్సుకు కృషి చేస్తున్నాము. మన ఉభయ దేశాల సంయుక్త కృషి ప్రపంచ పరిస్థితులను తప్పక మెరుగుపరుస్తుంది.

నా జీవితంలో ఒక అపురూప అధ్యాయాన్ని ముగించబోతున్నాను. ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నది, మనం కలిసికట్టుగా నిర్మించనున్న భవిష్యత్తును కౌమార వయస్సులోని నా మనసు ఊహించి ఉండదు. భవిష్యత్తుపై కాకుండా మన ముందున్న ప్రతిబంధకాలపై దృష్టిని కేంద్రీకరించేందుకై స్వల్ప అపార అభిప్రాయ భేదాలను తొలగించుకునేందుకు ప్రాధాన్యమివ్వడం సహజమే. మనం స్వతస్సిద్ధంగా సమరీతిలో విశ్వసిస్తున్న విలువలు, పాటిస్తున్న సంప్రదాయాలు మన విభేదాల కంటే ముఖ్యమైనవి కనుక అమెరికా – భారత్ స్నేహ సంబంధాల భవిష్యత్తు విషయమై నాకు అపరిమితమైన ఆశాభావం ఉన్నది. మన ముందున్న సవాళ్లు– వాయు కాలుష్య నివారణ, మనలను ఏకం చేసేందుకు, రక్షించేందుకు నవీన సాంకేతికతలను ఉపయోగించుకోవడం, ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పెచ్చరిల్లుతున్న యుద్ధ ప్రమాదాలు మొదలైన వాటిని ఎవరికి వారుగా కాకుండా సమైక్యంగా కృషి చేసినప్పుడు సులువుగా పరిష్కరించుకోగలుగుతాము. 'మనం వర్తమానంలో చేసిన పనులపైనే మన భవిష్యత్తు ఆధారడి ఉంటుంది' అని మహాత్మా గాంధీ అన్న మాటలను మనం సదా గుర్తుంచుకోవాలి. శాంతి, సంపద వృద్ధి, ప్రజల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు అనే లక్ష్యాలతో కూడిన ఉమ్మడి దార్శనికత స్ఫూర్తితో మనం కలసికట్టుగా కృషి చేయాలి. ప్రియమైన భారతదేశమా, నీ ఆదర ఔదార్యాలకు, వివేకానికి, అచంచల స్నేహానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ అద్భుత దేశంలో అమెరికా రాయబారిగా ఉండడం నా జీవితానికి దక్కిన సమున్నత గౌరవంగా భావిస్తున్నాను. మన ఉభయ దేశాలు కలసికట్టుగా నిర్మించే అపరూప భవిష్యత్తును చూసేందుకు నేను వేచి ఉండను. భారత్, నా హృదయంలో భారత్ సదా ఉంటూనే ఉంటుంది నిరంతరం వెలుగులు విరజిమ్ముతూనే ఉంటుంది. అనంత ధన్యవాదాలు. కలసి స్థిరంగా ముందుకు సాగుదాం.



• ఎరిక్ గార్సెట్టి
అమెరికా రాయబారి

వర్గీకరణ సమస్య—కుల నిర్మూలన దృక్పథం

రాజ్యం అందులో భాగమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి నుండి రిజర్వేషన్లను అమలు చేయడంలో గాని, వెనుకబడిన కులాలకు ఫలాలు అందించడంలో గాని పూర్తిగా విఫలమయ్యారు. కనుక అందరికీ సమాన అవకాశాలు కల్పించినా అన్ని కులాలు సమానంగా అవకాశాలను అందుకోలేదు. దీనికి పాలక కులాల దీర్ఘకాలిక నిర్లక్ష్యం తోడైంది. ఈ అణగారిన కులాలను ఓటు బ్యాంకుగా పరిగణించి, రాజకీయ స్వార్థంతో రాజ్యాంగబద్ధంగా రావలసిన వాటాలను అందించలేదు. ఉదాహరణకు రిజర్వేషన్లు ఉపయోగించుకోవడానికి విద్య అత్యంత కీలకమైనది. ఇందులో ఉన్న అన్ని కులాలకు పాఠశాల విద్య, కాలేజీ విద్య, యూనివర్సిటీ విద్య, సాంకేతిక విద్య అందించకుండా, విద్యా సంస్థలను వారికి అందుబాటులోకి తేకుండా జాగ్రత్త పడ్డారు. ఫలితంగా అత్యధికంగా వెనుకబడిన కులాలకు విద్యయే లేకుండా పోయింది. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా విద్యను కొంతమందికే గాని అందరికీ అందే విధంగా చూడకుండా దానిని ఎన్నికల స్వార్థ రాజకీయాలకు ఉపయోగపడేలా చేశారు. అంతే గాని అది ఒక రాజ్యాంగపరమైన సామాజిక న్యాయంగా పరిగణించ లేదు. ఫలితంగా మెజారిటీ కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి. అయితే ఈ అణగారిన కులాలలో చారిత్రకంగా ముందంజలో ఉన్న కొన్ని కులాలలోని కొంతమంది ఎంతో కొంత విద్యావకాశాలను, ఉద్యోగావకాశాలను పొందడం సహజం.

ఇలా కొంత ప్రయోజనం పొందినవాళ్లను స్వార్థ రాజకీయ పార్టీలు, ప్రభుత్వ రంగ సంస్థల అధిపతులు తమ స్వార్థం కోసం వాడుకొని రిజర్వేషన్లను పూర్తిగా అమలు చేయకుండా, అత్యంత వెనుకబడిన పీడిత కులాలకు చేరకుండా, ఆయా కులాలలో కూడా అత్యధికంగా వెనుకబడిన కుటుంబాలకు చేరకుండా చూశారు. ప్రభుత్వాలు ఐదేళ్ళకు ఒకసారైనా రిజర్వేషన్ల అమలు గురించి సమీక్ష జరపకుండా, రిజర్వేషన్లు పొందిన వాళ్లలో కొద్ది మందిని తమకు ఊడిగం చేసే విధంగా తయారు చేసుకున్నారు. ఫలితంగా ఫలాలు పొందిన వాళ్ళలో చాలామంది తమ సొంత ప్రయోజనాల కోసం తమ సంబంధిత కులాలనే కాకుండ తమ కులంలోని వెనుకబడిన కుటుంబాలను గాలికి వదిలేసారు.

పూలే, అంబేడ్కర్, పెరియార్ ఆలోచనల ప్రకారం రిజర్వేషన్ల విధానం కులరహిత సమాజం కోసం అన్ని రకాల అసమానతలు లేని సమసమాజం నిర్మాణ దిశగా నడవాలి. కాని పాలకులు ఈ విధానాన్ని కుల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా దిగజార్చారు. నిజానికి రిజర్వేషన్లు పొందిన వ్యక్తులు రెండు రకాల పోరాటాలు చేయవలసి ఉన్నది. ఒకటి వారు పని చేస్తున్న సంస్థలలో అణగారిన కులాలకు ప్రాతినిధ్యం, జనాభా దామాషా ప్రకారం పెంచటానికి చేయవలసిన పోరాటం. రెండవది పౌర సమాజంలో అణగారిన కులాల పైన ఆధిపత్య కులాలు సాగిస్తున్న దోపిడీ, దౌర్జన్యాలు, హత్యలకు వ్యతిరేకంగా జరపవలసిన పోరాటంలో వీలైన చోట ప్రత్యక్షంగా, కానిచోట పరోక్షంగా పాల్గొని, ఇతరులను పాల్గొనే విధంగా చైతన్య పరిచే పోరాటం. ముందు వరుసలో ఉండి రిజర్వేషన్లు పొందిన వ్యక్తులు ఈ రెండు పోరాటాలు అవసరం ఉన్నంత మేరకు చేయలేదు. కొంత మేరకు సైద్ధాంతిక, రాజకీయ పోరాటం చేసి అణగారిన కులాలను ఐక్యం చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉత్తరప్రదేశ్‌లో కూడా ఈ సమస్యను పరిష్కరించలేదు. ఆంధ్రప్రదేశ్‌లోని కారంచేడు, చుండూరు కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటం చేసి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాల్ని సాధించుకున్న దళిత ఉద్యమం కూడా ఈ సమస్యను పరిష్కరించుకోలేకపోయింది. దేశ వ్యాపితంగా పెద్ద ఎత్తున ఒక ఉద్యమంగా ఈ జమిలి పోరాటాలు చేయకపోవడం వలన ఈ అణగారిన కులాల్లో రిజర్వేషన్లు పొందటంలో కుల అసమానతలు మరింత పెరిగాయి. స్వాతంత్ర్యానంతరం రాజ్యాధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కాని తర్వాత కాలంలో కాంగ్రెస్ నాయకత్వంలో నడిచిన యూపీఏ ప్రభుత్వం కాని, భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో నడుస్తున్న ఎన్‌డిఏ ప్రభుత్వం కాని మనువాద దృక్పథంతో ఈ వ్యక్తులను జమిలి పోరాటాలు చేయకుండా చాలా జాగ్రత్త వహించి, కొద్ది మంది వ్యక్తులనే అణగారిన కులాల ప్రతినిధులుగా చిత్రీకరించి, వీరిలో అట్టడుగున ఉన్న కులాలకు రిజర్వేషన్ ఫలాలు అందకుండా చేశారు. ఈ కులాలలో అసమానతలు పెంచి, వైరుధ్యాలు సృష్టించి వాళ్ల ముందున్న కులాలను పీడకులుగా, వెనకబడ్డ కులాలను పీడితులుగా చిత్రీకరించి, పీడితులనే శత్రువులుగా చూపించి తమాషా చూస్తున్నారు. అంతే కాకుండా రిజర్వేషన్లను అంతమొందించే సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను తీసుకొచ్చిన పాలకులు వీరిని మద్దతు ఇచ్చే విధంగా తయారుచేసి పావులుగా వాడుకుంటున్నారు. ఇప్పటికైనా పీడిత కులాలు ఈ మనువాద పార్టీల కుట్రలకు, కుయుక్తులకు బలి కాకుండా ఈ సమస్యను ప్రజాస్వామికంగా, సామాజిక న్యాయ ప్రాతిపదికన పరిష్కరించుకోవాలి. ఇప్పుడు రాజ్యాంగపరంగానైనా అణగారిన కులాలు సంఘటితమై జనాభా దామాషా ప్రకారం పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని పెంచుకోవాలి. ఇది దేశవ్యాప్తంగా జరగటానికి రాజ్యాంగంలో అవసరమైన సవరణలు తీసుకురావడానికి పోరాటం చేసి మరింత సంఘటితమై రాజ్యాధికారం కోసం పోరాడాలి.

ఇప్పటివరకూ రిజర్వేషన్ల ద్వారా కొన్ని షెడ్యూల్డ్ కులాలు ఆర్థికంగా, రాజకీయంగా విద్య, ఉద్యోగ రంగాలలో ఎంతో కొంత మేరకు అభివృద్ధి చెందిన ఒక సమూహం ముందుకు వచ్చింది. కాని ఇదే అణగారిన కులాలలో చారిత్రకంగా ఎన్నో కులాలు రిజర్వేషన్లను ఉపయోగించుకోలేకపోయాయి. రాజ్యాంగపరంగా ఈ కులాలను సంక్షేమ మంత్రిత్వ శాఖల ద్వారా అభివృద్ధి చేయవలసిన బాధ్యత ఉన్నది.




అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో తలెత్తిన వర్గీకరణ సమస్య పరిష్కారానికై భేషజాలకు పోకుండా కావలసిన గణాంకాలు, సమాచారం ప్రాంతాల వారీగా నిజాయితీగా, నిష్పక్షపాతంగా సేకరించాలి. ఈ సమస్య పరిష్కారం కొరకై కొన్ని ప్రతిపాదనలు మేము చర్చ కోసం మీముందు పెడుతున్నాం.

మొదటి పద్ధతి: 1) ఇప్పటికీ బడి ముఖం చూడని, ఎటువంటి ఉద్యోగాలు పొందని అత్యంత వెనుకబడిన కులాలను ఒక ప్రత్యేక సమూహంగా లేదా గ్రూపుగా ఏర్పాటు చేసి వీరికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. 2) ఎస్సీ కులాలలో ఇప్పటికే కొద్ది తేడాలతో రిజర్వేషన్ల ప్రతిఫలాలను అనుభవిస్తున్న మాల మాదిగ కులాలను ఒక సమూహంగా లేదా గ్రూపుగా చేసి వీరికి రెండవ ప్రాధాన్యత ఇవ్వాలి. రెండవ పద్ధతి: 1) అత్యధికంగా వెనుకబడిన, మాదిగ అనుబంధ కులాలను ఒక సమూహంగా లేదా గ్రూపుగా చేసి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. 2) అలాగే అత్యధికంగా వెనుకబడిన మాల అనుబంధ కులాలను ఒక సమూహంగా లేదా గ్రూపుగా చేసి రెండవ ప్రాధాన్యత ఇవ్వాలి. 3) మాదిగ కులాన్ని ఒక గ్రూపుగా చేసి మూడవ ప్రాధాన్యత ఇవ్వాలి. 4) అలాగే మాల కులాన్ని ఒక గ్రూపుగా చేసి నాలుగవ ప్రాధాన్యత ఇవ్వాలి.

అయితే ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. అంటరానితనం, కులపీడనే రిజర్వేషన్లకు క్రైటీరియా అనేది మరిచి పోకూడదు. ఇప్పటివరకూ రిజర్వేషన్ల ద్వారా కొన్ని షెడ్యూల్డ్ కులాలు ఆర్థికంగా, రాజకీయంగా విద్య, ఉద్యోగ రంగాలలో ఎంతో కొంత మేరకు అభివృద్ధి చెందిన ఒక సమూహం ముందుకు వచ్చింది. కాని ఇదే అణగారిన కులాలలో చారిత్రకంగా ఎన్నో కులాలు రిజర్వేషన్లను ఉపయోగించుకోలేకపోయాయి. రాజ్యాంగపరంగా ఈ కులాలను సంక్షేమ మంత్రిత్వ శాఖల ద్వారా అభివృద్ధి చేయవలసిన బాధ్యత ఉన్నది. కాని ఈ శాఖలను ప్రాధాన్యత లేని శాఖలుగా పాలకులు దిగజార్చారు. ఇప్పటికైనా ఈ శాఖలను కుల నిర్మూలన దృక్పథంతో అవసరమైనన్ని నిధులను కేటాయించి విద్యా ఉద్యోగాలలో ఈ కులాలకు సామర్థ్యం, నైపుణ్యాలను పెంచి, కుల వృత్తులకు సంబంధంలేని నూతనంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఉపాధి అవకాశాలను అందుకునేలాగా చేయాలి. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను అదే కులంలో పంచుకోవడానికి, ఇంతవరకు రిజర్వేషన్లను ఉపయోగించుకోలేని ప్రస్తుతం ఉపయోగించుకునే స్థితిలో ఉన్న మొదటితరానికి తప్పకుండా అందేలా చూడాలి. ఆ తర్వాతనే క్రమానుగతంగా రెండవ తరం, ఆ తర్వాత మూడవ తరం కుటుంబాలకు అందాలి. అంతే కాని అంటరానితనం, కులపీడన ఉన్నంత వరకూ క్రీమీలేయర్ పద్ధతి ప్రవేశ పెట్టకూడదు.

అణగారిన కులాలు అన్నీ కలిసి, ప్రజాస్వామిక వాదులను కలుపుకొని ఇప్పటివరకు రిజర్వేషన్ల ఫలాలను పొందలేని, విద్యారంగంలో అత్యంత వెనుకబడిన కులాలకు, సంచార కులాలకు నాణ్యమైన విద్య అందించడానికి తక్షణమే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ స్థాయిలో ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలు, డే-కేర్ పాఠశాలలు, కాలేజీలు స్థాపించటానికి కృషి చేయాలి. అలాగే ఈ అణగారిన కులాల విద్య, ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే విద్యాప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాలి. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్టుగానే ప్రస్తుతం ఉనికిలో ఉన్న ప్రైవేటు రంగంలో కూడా అదే సామాజిక న్యాయ ప్రాతిపదికన మాదిగ, మాల, షెడ్యూల్డ్ కులాలలో అత్యంత వెనుకబడిన ఇతర కులాలకు, ఆదివాసీలకు, వెనుకబడిన తరగతులకు, స్త్రీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసే విధంగా అందరూ కలిసి పోరాడాలి.

○ ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ
ప్రొఫెసర్ కె.వై. రత్నం
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్



వీరభద్రా.. శరభ.. శరభ..





భక్తులతో కిటకిటలాడుతున్న ఐనవోలు మల్లన్న ఆలయ ప్రాంగణం

మల్లన్నా.. శరణు.. శరణు..

శిగాలూగిన ఐనవోలు జాతర 7

- మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- మహానివేదనతో ఉత్సాహంగా రథం ఊరేగింపు
- అర్ధరాత్రి కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- స్వామివారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

పూసల లాగులు.. గజ్జెల మోతలు.. డోలు శబ్దాలు.. చేతుల్లో వీర కోలు.. త్రిశూలాలు.. ఖడ్గాలు.. నుదుటిపై బండారి పసుపు.. నెత్తిపై బోనాలు వెలుగుతున్న దీపాల నడుమ ఐనవోలు మల్లికార్జున స్వామి జాతర ఘనంగా జరిగింది. ఒగ్గు పూజారుల అందమైన పిండి పట్నాలు.. ఢమరుక శబ్దాలతో శిగాలూగింది. సకల భాగ్యాలు కలిగి సంతోషాన్ని కలిగించి.. ముట్టింది ముత్యమై.. పట్టింది బంగారమై.. పాలి వాడు దగ్గరై.. పగవాడు దూరం కావాలి.. అంటూ పర్వతాల మల్లయ్య.. మా పాలిట కలిగి ఉంటూ సల్లంగా సూడు.. మళ్లీ వస్తాం.. అంటూ స్వామి వారిని వేడుకున్నారు. మకర సంక్రాంతి వేళ ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర భక్తులతో పోటెత్తింది. ముఖ్యంగా మార్నేని వంశీయుల మహానివేదన రథం ప్రదర్శన గ్రామ పురవీధుల గుండా భక్తిభావంతో సాగింది. స్వామివారిని మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే నాగరాజు, తదితరులు దర్శించుకున్నారు.

- ఐనవోలు

వైభవంగా కొత్తకొండ జాతర

- వీరభద్రుడి దర్శనానికి తరలివచ్చిన జనం
- భక్త జన సంద్రంగా మారిన పరిసరాలు
- మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే నాగరాజు
- ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల రథాలు, మేకల బండ్లు



కొత్తపల్లి నుంచి జాతరకు వస్తున్న రథాలు



కోరమీసాల స్వామి.. కోరిన కోర్కెలు తీర్చే కొత్తకొండ వీరభద్రా.. శరభ.. శరభ.. అంటూ భక్తులు తండోపతండాలు తరలివచ్చారు. గుమ్మడికాయలను నెత్తినపెట్టుకుని కోరమీసాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం మకర సంక్రాంతి పర్వదినాన కొత్తకొండ వీరభద్రస్వామి జాతర ఉత్సవంలా సాగింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కొత్తపల్లి నుంచి వచ్చిన ఎడ్లబండి రథాలు, వేలేరు నుంచి వచ్చిన మేకల బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే మంత్రి పొన్నం, ఎమ్మెల్యే నాగరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. సీపీ అంబర్ కిషోర్ ఝా నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

7

- భీమదేవరపల్లి

సంక్షేమ పథకాల అమలుకు సమష్టిగా కృషి చేయాలి

- 26వ తేదీ నుంచి నాలుగు పథకాలకు శ్రీకారం
- బల్దియా కార్యాలయంలో అధికారులతో మేయర్ సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్వినీ

వరంగల్ కార్పొరేషన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బల్దియా పరిధిలో సంక్షేమ పథకాల అమలు చేసే క్రమంలో అధికారులు సమష్టిగా పని చేయాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాలను పారదర్శకంగా అర్హులైన వారిని అందేలా చూడాలన్నారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే నాలుగు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలన్నారు. 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు దరఖాస్తులు ప్రారంభం అవుతాయన్నారు. సందేహాల నివృత్తి కోసం బల్దియా ప్రధాన కార్యాలయంలో టోల్‌ఫ్రీ నెంబర్ 18004251980, 9701999645 అందుబాటులో ఉంటాయన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహించే వార్డు సభలను పక్కాగా జరిగే విధంగా చూడాలన్నారు. డాటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు చోటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే గురువారం సాయంత్రం వరకు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ప్రత్యేక అధికారులు పుష్పలత, పన్నుల విభాగం అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ నాగేశ్వర్‌రావుతో పాటు సర్వే బృందాలు పాల్గొన్నారు.

పెద్ద బకాయి దారులపై దృష్టిపెట్టండి

బల్దియా పరిధిలో పెద్ద మొత్తంలో పన్నుల బకాయిదారులపై దృష్టి సారించి త్వరితగతిన డబ్బులు వసూళ్లు జరిగేలా అధికారులు దృష్టి సారించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం బల్దియా కార్యాలయంలో పన్నుల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లలో నిర్ధిష్ట లక్ష్యాలను చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వసూళ్లు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పెద్ద మొత్తంగా బకాయిలు ఉన్న సంస్థలు, ఇనిస్టిట్యూషన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, పన్నుల విభాగం అధికారి శ్రీనివాస్, ఆర్‌వోలు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సంక్రాంతి

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా పండుగ సంబరాలు
- ఇళ్ల ముందు శోభాయమానంగా రంగవల్లులు
- ఘుమఘుమలాడిన పిండి వంటకాలు
- గాలిపటాల ఎగురవేతతో కేరింతలు
- ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, పూజలు



పెద్ద కోవెలలో గోదా కల్యాణం



సంక్రాంతి నోముల్లో పాల్గొన్న మహిళలు

హనుమకొండ కల్చరల్ / వరంగల్ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంలో వచ్చిన సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మూడు రోజుల భోగీ, సంక్రాంతి, కనుమ పండుగలు సంబురంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఇళ్ల ముంగిట వివిధ రకాల రంగవల్లులతో.. చిన్నారులు గాలిపటాల ఎగరవేతతో.. ఇళ్లల్లో పిండి వంటల ఘుమఘుమలతో సంక్రాంతి పర్వదినాన్ని సంబురంగా జరుపుకున్నారు. సోమ నుంచి బుధవారం వరకు మూడు రోజుల పండుగ వాతావరణంతో పాటు శని, ఆదివారాల సెలవులతో ఐదు రోజుల పాటు పండుగను సంబురంగా జరుపుకున్నారు. సంక్రాంతి పర్వదినం మంగళవారం రోజున ఉదయాన్నే నిత్య కార్యక్రమాలు నిర్వహించుకొని నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి దేవత దర్శనాలు చేసుకొని కుటుంబసభ్యులతో కలిసి ఇళ్లల్లో విందు భోజనాలు, పండుగ సంబరాలను జరుపుకున్నారు. కొత్త అల్లుళ్లతో, బంధుమిత్రులతో వేడుకలు ఆచరించుకున్నారు.

ఆలయాల్లో పూజలు

పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు చారిత్రక భద్రకాళి అమ్మవారిని భక్తులు వేలాది మంది దర్శించుకున్నారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శనం చేసుకోవడంతో ఆలయం కిటకిటలాడింది. ఇదే కాకుండా వైష్ణవ ఆలయాలు, వెంకటేశ్వరస్వామి దేవాలయం, దత్తక్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. వ్రతాలను అమ్మవారి సన్నిధానంలో నిర్వహించారు. రామన్నపేటలో వాసవీ కాలనీలో 108 మంది మహిళలు ప్రత్యేకంగా సంక్రాంతి నోమును నిర్వహించుకొని బుధవారం రోజున 108 మంది మహిళలు రామన్నపేట పురవీధుల గుండా మేళతాళాలతో ఆధ్యాత్మిక వాతావరణంతో క్వింటాళ్ల కొద్ది పసుపు కుంకుమలు రేగు పండ్లు మిఠాయిలను పంచి పెట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఈ ప్రసాదాన్ని తీసుకున్నారు. వాయినంగా ఇస్తూ ఆశీర్వచనాలు అందజేశారు. ఇవే కాకుండా ఇంటింటా మహిళలు సంక్రాంతి నోములు నోచుకొని ఇరుగుపొరుగు వారికి బంధు మిత్రులకు నోము వాయినాలను అందజేశారు. హనుమకొండ పెద్ద కోవెలలో తలకోట రాఘవాచార్య, నర్సింహచార్య, శ్రీనివాసాచార్యల ఆధ్వర్యంలో నేత్రపర్వంగా నిర్వహించిన గోదా కల్యాణంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా అదాలత్ సమీపంలోని శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరాలయంలో దేశికన్ స్వామి ఆధ్వర్యంలో గోదా కల్యాణం నిర్వహించారు. హనుమకొండ కాపువాడలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. గోదా రంగనాథ స్వామ చల్లనిచూపులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి చేయూతనందిస్తానన్నారు. మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, శోభన్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక వ్రతం ఆచరణ



రుద్రేశ్వరాలయంలో గోమాత పూజలు

సాయంత్రం వేళ గోదా రంగనాయక స్వామివారి శ్రీ వ్రతాన్ని ఆచరించుకున్న మహిళలు పేరంటాలతో సందడి చేశారు. తాము నోముకున్న వస్తువులను వాయినంగా అందించుకున్నారు. తర్వాత బుధవారం సంక్రాంతి పర్వంలో భాగంగా మూడోరోజు కనుమ పండుగను సంప్రదాయంగా జరుపుకొని గోమాతలను పూజించారు. ముఖ్యంగా చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వర ఆలయప్రాంగణంలో ప్రత్యేకంగా గోమాతను తీసుకొచ్చి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు పూసి కుంకుమ బొట్లు పెట్టి గోమాతను అలంకరించారు. ఆలయ అర్చకులు మణికంఠ శర్మ, ప్రణవ్, శ్రవణ్‌ల ఆధ్వర్యంలో రుద్రేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా కనుమ వేడుకలు నిర్వహించినట్లు టీటీడీ కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని పేర్కొంటూ హైందవ ధర్మంలో గోమాతకు ప్రత్యేక స్థానం ఉందని ఆయన చెప్పారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం, వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో డాక్టర్ వెంకటేశ్వరావు గోశాలలో పెద్ద ఎత్తున గోపూజలు, కనుమ వేడుకలు నిర్వహించారు.

గాలిపటాల ఎగరవేత

చిన్నారులు యువత గాలి పటాల ఎగరవేతతో సందడిగా మారింది. భవనాలపై, ప్రధాన రహదారులపై డీజే సౌండ్స్ ఏర్పాటు చేసుకొని గాలి పటాలు ఎగరవేశారు. పండుగ ముగియడంతో దూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు విచ్చేసిన వారు రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాల ద్వారా తిరిగి వెళ్తున్నారు. దీంతో బస్టాండ్, రైల్వేస్టేషన్లు, ప్రైవేటు వాహనాల అడ్డాల వద్ద జనంతో రద్దీ కొనసాగింది.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

ఆత్మకూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహించే గ్రామసభల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై నిర్దేశించిన భూములను, మైనింగ్ భూముల వివరాలు సేకరించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కొనుగోలు చేసిన భూముల వివరాలు సూచించాలని అధికారులను ఆదేశించారు. ఆ వివరాలను గ్రామ పంచాయతీ నోటీసు బోర్డుపై ఉంచి అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. సేకరించిన వివరాలను మండలస్థాయి అధికారులకు తెలియజేయాలన్నారు. లేఔట్ మినహా, పడావు భూములను కూడా రైతు భరోసా పథకానికి అర్హులుగా గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గ్రామసభలకు ముందే ఒకరోజు ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను సేకరించి, ఉన్నతాధికారుల సలహా మేరకు తుది జాబితాను తయారు చేసి గ్రామసభలో ప్రదర్శించాలని తెలిపారు. గ్రామసభలో లబ్ధిదారులతో పాటు గ్రామస్థాయి ఇందిరమ్మ కమిటీలను కూడా ఆహ్వానించాలని కలెక్టరు సూచించారు. పెండింగ్ సర్వే ఉంటే రేపటిలోగా పూర్తి చేయాలని, సేకరించిన డేటాను పూర్తిస్థాయిలో కంప్యూటర్‌లో భద్రంగా ఉంచాలన్నారు. గ్రామస్థాయి కమిటీలు, సబ్‌కమిటీలు వారికి నిర్దేశించిన విధంగా పూర్తిస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి యు.మహేందర్ ఆర్డీవో నారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఎంఈవో విజయ్‌కుమార్, ఎంపీవో విమల, ఏపీవో రాజిరెడ్డి, ఈ సదస్సులో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్, జాతీయ ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూ కలెక్టర్ ప్రావీణ్య

ప్రభుత్వ పథకాల అమలుకు పటిష్ఠ కార్యాచరణ

సందేహాల నివృత్తి కోసం కంట్రోల్ రూమ్: కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పటిష్ఠ కార్యాచరణ చేపడుతున్నట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. ఈ విషయంలో సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నెంబరు 18004253424 ఏర్పాటు చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీకి ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే క్షేత్రస్థాయి పరిశీలనకు జిల్లా ప్రజలు సహకరించాలన్నారు. 21 నుంచి 25వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తామన్నారు. నాలుగు పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ సంధ్యారాణిని నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.



విజేతగా నిలిచిన జట్టుతో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బొద్దిరెడ్డి, నిర్వాహకులు

‘సెపక్‌తక్రా’లో ఏఐపీ హవా

- చాంపియన్‌గా ఆలిండియా పోలీసు జట్టు
- ముగిసిన జాతీయస్థాయి చాంపియన్‌షిప్ పోటీలు

7

రేపటి నుంచి పోలీసుల స్పోర్ట్స్‌మీట్ 6



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రైల్వే అధికారులు

రైల్వే క్రికెట్ పోటీలలో ఆలేరు జట్టు విజయం

కాజీపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బుధవారం రైల్వే స్టేడియంలో ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. డివిజన్ స్థాయి పోటీలను రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ చైర్మన్, సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణ సాయి, డీఎంఈ వెంకటకుమార్, మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కాలువ శ్రీనివాస్, డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్‌లు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఆలేరు ఇంజనీరింగ్ జట్టు, అమిగోస్ లోకో పైలెట్‌ల టీంలు మధ్య జరిగిన పోటీలలో ఆలేరు ఇంజనీరింగ్ .జట్టు ఐదు వికెట్‌లకు గాను 14 ఓవర్లలో 119 పరుగులతో విజయం సాధించారు. విజేతలకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 26న బహుమతులు అందజేస్తామని ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, కోశాధికారి జి. రాజేశ్వర్‌రావు తోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్ పునఃప్రారంభం

వరంగల్ వ్యవసాయం, జనవరి15 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల మార్కెట్లో గురువారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా సాగుతాయని మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల తెలిపారు. రైతులు తమ సరుకులను మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముకోవచ్చని సూచించారు. సంక్రాంతి పండగ సందర్భంగా మార్కెట్‌కు ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే.. పండుగ ముగిసిన నేపథ్యంలో గురువారం నుంచి మార్కెట్ లో లావాదేవీలు కొనసాగనున్నాయి.

ఎన్పీడీసీఎల్‌కు ఇప్పాయి అవార్డులు

రాంనగర్, జనవరి15 (ఆంధ్రజ్యోతి): వివిధ కేటగిరీల్లో ఎన్పీడీసీఎల్‌కు ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఇప్పాయి) అవార్డులు వరించాయి. ఈ నెల 11న కర్ణాటకలోని బెల్గామ్‌లో జరిగిన 25వ రెగ్యులేటరీ అండ్ పాలసీ మేకర్స్ రిట్రీట్ కార్యక్రమంలో ఇన్నోవేషన్ కేటగిరీ కింద ఇప్పాయి నాలుగు అవార్డులను ప్రకటించింది. ఈ అవార్డులను ఆపరేషన్ సీజీఎం రాజుచౌహాన్ కె.రాజు అందుకోగా, బుధవారం నాలుగు అవార్డులను సీఎండీ వరుణ్‌రెడ్డికి సీజీఎంలు అందజేశారు. నాలుగు అవార్డుల్లో 1. అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ అండర్ ది బెస్ట్ పెర్ఫార్మింగ్ డిస్ట్రిబ్యూషన్, 2. డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ జనరేషన్ ఇన్ ఎన్పీడీసీఎల్, 3. ఎరెక్షన్ ఆఫ్ 2 బై 1 యంవిఏఆర్ కెపాసిటర్ బ్యాంక్స్ అండ్ కేవీఏఆర్ లైన్ కెపాసిటర్స్, 4. ఐఆర్‌డీఏ జీపీఆర్ఎస్ ఎనేబుల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పాట్ బిల్లింగ్ కేటగిరీలు ఉన్నాయి.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో కుమారస్వామికి డాక్టరేట్



కుమారస్వామి

కేయూ క్యాంపస్ జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం పరిశోధకుడు ఎస్.కుమారస్వామి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ కుమారస్వామికి డాక్టరేట్ ప్రకటించారు. 'ఏ స్టడీ ఆన్ ఎఫెక్ట్ ఆఫ్ ప్లేయోమెట్రిక్ ట్రైనింగ్ ఆన్ సెలెక్టెడ్ మోటర్ ఫిట్‌నెస్ అండ్ సైకాలజికల్ వెరియబుల్ ఆఫ్ కబడ్డీ ప్లేయర్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ లభించింది. హనుమకొండ కిట్స్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి పర్యవేక్షణలో కుమారస్వామి డాక్టరేట్ పూర్తి చేశారు. హనుమకొండలోని మడికొండ ప్రాంతానికి చెందిన కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ విధులు పనిచేస్తున్నారు. రాష్ట్రపతి నుంచి అనేక అవార్డులు, రివార్డులు పొందారు. ఉస్మానియా, ద్రవిడ వర్సిటీలను ఎంపీఈడీ, ఎంఫిల్ డిగ్రీలు సాధించారు. వరంగల్, హనుమకొండ డిస్ట్రిక్ట్ కబడ్డీ అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. డాక్టరేట్ సాధించిన కుమారస్వామి ని పలువురు అభినందించారు.

రెండు గ్రామాల్లో చోరీ

- బంగారు అభరణాలు, నగదు అపహరణ
- సంఘటన ఇండ్లను పరిశీలించిన ఏసీపీ తిరుపతి



అపర్ణకాలనీలో క్లూస్ టీమ్ ద్వారా సాక్ష్యాధారాలను సేకరిస్తున్న ఏసీపీ తిరుపతి, సీఐమహేందర్

గీసుగొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అపర్ణ కాలనీ, పోతరాజుపల్లి గ్రామాల్లో ఈ నెల 14న చోరీ ఘటనలు జరిగి బంగారు అభరణాలు, నగదును దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెకుంట శివారులోని అపర్ణ కాలనీలో ఉంటున్న మిట్టపల్లి సాంబయ్య భార్య పరమేశ్వరి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 13న స్వగ్రామం ములుగు జిల్లా గోవిందరావుపేటకు సంక్రాంతి పండుగకు వెళ్లారు. కాగా, 14 సాంబయ్య ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం చూసి ఇంటి పక్కవారు వారికి సమాచారం అందించారు. సాంబయ్య కుటుంబ సభ్యులు వెంటనే వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా తాళాలు పగులగొట్టి అందులోని 35గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, బొడ్డుచింతలపల్లి గ్రామానికి చెందిన గంప రవి తన భార్యపిల్లలతో కలిసి దుగ్గొండి మండలం గిర్నిబావిలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి ఈ నెల 13న వెళ్లారు. అనంతరం 14న తిరిగి వారు ఇంటికి రాగా, ఇంటి తాళాలు పగుటగొట్టి ఉండటంతో ఆందోళన చెంది, ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా పగులగొట్టి 54గ్రాములు బంగారు ఆభరణాలు, 23 తులాల వెండి పట్టీలు, రూ.31వేల నగదును దొంగలు దోచుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సంఘటన ఇండ్లను మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ మహేందర్‌లు సందర్శించి క్లూస్ టీంలను రప్పించి సాక్ష్యాధారాలను సేకరించారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ఇందిరమ్మకాలనీలో

దొంగల హల్‌చల్

నగదు, నాలుగన్నర తులాల బంగారం చోరీ



చోరీ జరిగిన ఇంట్లో దృశ్యాలు

వరంగల్‌సిటీ, జనవరి15 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల ఇందిరమ్మకాలనీ ఫేస్-2లో సోమవారం రాత్రి రెండిళ్లలో దొంగతనం జరిగింది. సంక్రాంతి పండగ సందర్భంగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇందిరమ్మ కాలనీకి చెందిన మద్దూరి వినోద కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి సుమారు 4.5 తులాల బంగారు అభరణాలు, 25 తులాల వెండి ఆభరణాలతో పాటు కొంత నగదును ఎత్తుకెళ్లారు. అదే విధంగా పక్కనే ఉన్న అన్నారపు రాజేందర్ కిరాణాషాపులో చొరబడి రూ.5500ల నగదు దొంగిలించారు. సమాచారం అందుకున్న ఏనుమాముల పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. క్లూస్ టీంను రంగంలోకి దింపడంతో పాటు, అలాగే ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

దామెర మండలంలో పలు చోట్ల చోరీలు

- సుమారు రూ.7.50 లక్షల సొత్తు అపహరణ
- పరిశీలించిన ఏసీపీ సతీష్‌బాబు

దామెర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : దామెర మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పలు చోట్ల చోరీలకు పాల్పడ్డారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని చోరీలకు గురైన బాధితుల ఇళ్లను ఏసీపీ సతీష్‌బాబుతో పాటు సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్‌లు మంగళవారం, బుధవారాల్లో పరిశీలించారు. ఇందులో భాగంగా దామెర ఎస్సై కొంక అశోక్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దామెర గ్రామంలో మాదారపు విజయ ఇంట్లో ఎవరూ లేని సయంలో కిరాణా దుకాణానికి ఉన్న తాళాలు, బీరువా తాళాలు పగుల గొట్టి 7 తులాల బంగారు ఆభరణాలతో పాటు 13 తులాల పట్టగొలుసులు పట్టుకెళ్లారు. అలాగే ఒగ్లాపూర్‌లోని కనుకుంట్ల జ్ఞానేశ్వర్‌రావు ఇంటి తాళాలు, బీరువా తాళాలను పగులగొట్టి రూ. లక్ష నగదుతో పాటు 15 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ముస్త్యాలపల్లిలో శాతరాశి మౌనాకర్ ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగులగొట్టి రూ. 50 వేల నగదుతో పాటు రెండు తులాల బంగారు నెక్లెస్‌ను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. అంతే కాకుండా ఒగ్లాపూర్‌లో పసునూటి విజేందర్ ఇంటి తాళాలు, బీరువా తాళాలను పగుల గొట్టి అందులోని వస్త్రాలను చెల్లాచెదురుగా పడేశారు. తక్కళ్లపహాడ్‌లోని కొత్తపెల్లి రాజు, మామిడి ఈశ్వరయ్యల ఇంటి తాళాలు, బీరువా తాళాలను కూడా పగుల గొట్టి అందులోని వస్త్రాలను చెల్లాచెదురుగా పడేశారు. కాగా, చోరీకి పాల్పడిన దుండగులను పట్టుకునేందుకు పోలీసులు క్లూస్ టీంతో గాలిస్తున్నారు. కాగా, దుండగులు అపహరించిన సొత్తు విలువ సుమారు రూ.7.50 లక్షలు ఉంటుందని ఎస్ఐ అశోక్ తెలిపారు.



ఒగ్లాపూర్‌లో సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న ఏసీపీ సతీష్‌బాబు, సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్



ఒగ్లాపూర్‌లోని పసునూటి విజేందర్ ఇంట్లో చెల్లా చెదురుగా పడి ఉన్న బట్టలు

మరిచిపోయిన సూట్‌కేసు అప్పగింత



ప్రయాణీకురాలికి సూట్‌కేసును అప్పగించిన జీఆర్‌పీ ఎస్సై మొహినుద్దీన్

బ్యాగులో 5 తులాల బంగారు అభరణాలు

గిర్మాజీపేట, జనవరి15 (ఆంధ్రజ్యోతి): పండుగకు తల్లిగారి ఇంటికి వచ్చిన సంతోషంలో ఓ ప్రయాణికురాలు రైలులో మరిచిపోయిన సూట్‌కేసును వరంగల్ రైల్వే పోలీసులు తిరిగి అప్పగించారు. జీఆర్‌పీ సీఐ వి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన భూక్య శిల్ప, భర్త అజ్మీర వెంకటేష్‌తో కలిసి న్యూఢిల్లీలో నివాసం ఉంటోంది. సంక్రాంతి పండుగకు సోదరుడు శరత్, భర్త వెంకటేష్‌తో కలిసి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం రాత్రి 8 గంటలకు వరంగల్‌కు చేరుకుంది. చాలాకాలం తరువాత తల్లిగారింటికి వచ్చిన శిల్ప.. ఆ సంతోషంలో తన బ్యాగ్ మర్చిపోయి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆ సూట్‌కేసు స్టేషన్‌లో భద్రపరిచారు. మంగళవారం ఉదయం తన బ్యాగ్ పోయిందన్న విషయం గమనించిన శిల్ప.. వెంటనే స్టేషన్‌కు వెళ్లి రైల్వే పోలీసులకు జరిగిన విషయం చెప్పింది. వారు తమ వద్ద ఉన్న సూట్‌కేసును చూపించగా తనదేనని చెప్పడంతో ఆమెకు అప్పగించారు. కాగా, అందులో 5 తులాల బంగారు అభరణాలు, నూతన వస్త్రాలు, కొన్ని వన్‌గ్రామ్ బంగారు అభరణాలు ఉన్నాయని బాధితురాలు తెలిపింది. కార్యక్రమంలో ఎస్సై మొహినుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ వేణు, కానిస్టేబుల్స్ ఫయాజ్, సుమలత పాల్గొన్నారు.

నాగేంద్రుడికి సంక్రాంతి హరితశోభ

- సూర్యా, ఆదిత్యా ఆరాధనలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



నాగమయ్య ఆలయంలో స్వామివారికి అలంకరించిన మకర సంక్రాంతి శోభ

గీసుగొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడిని హరితమయంగా, గంగిరెద్దుల చిత్ర పటాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా స్వామివారి ఆలయ ప్రాంగణంలో వెయ్యి చెరుకు మొక్కలతో ప్రత్యేక అలంకరణలు చేసి సూర్యా, ఆదిత్యా ఆరాధనలు చేశారు. పల్లెసీమల పండుగ ప్రాశస్త్యానికి అద్దం పట్టేలా పాలపొంగిలి, సంక్రాంతి సిరులు, గంగిరెద్దుల బసవన్నల భక్తిప్రపత్తులు ఆలయ ప్రాంగణంలో వెల్లివెరిశాయి. కన్నుల పండువగా జరిగిన వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. సంవత్సర కాలంలో వివిధ రాశుల్లో భ్రమించే సూర్య భగవానుడు మకర రాశిలో ప్రవేశించి తన కాంతిని జీవకోటి మనుగడకు అందించటం వల్ల మకర సంక్రాంతిగా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు సంక్రాంతి ప్రాశస్త్యాన్ని వివరించారు. సూర్యుడు మకరరాశి సంక్రమణంతో ఉత్తరాయణ పుణ్యకాలం మొదలవుతుందని చెప్పారు. మకర సంక్రాంతి వరకు రైతులకు పంటలు చేతికి వచ్చిన సందర్భంగా ప్రజలు సంతోషంగా సంబరాలు జరుపుకోవడమే మకర సంక్రాతి ప్రాశస్త్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు శ్రీహర్షచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మాచినపెల్లి బాబురావు, కొత్తగట్టు రాజేందర్, భక్తులు పాల్గొన్నారు.



దహనమైన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీ

జల్లిలో కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీ దహనం

చెన్నారావుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామ శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో సగం కాలిపోయింది. బుధవారం తెల్లవారుజామున చూసిన స్థానిక కాంగ్రెస్ నాయకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎస్సై రాజేష్‌రెడ్డి చేరుకొని ఫ్లెక్సీని పరిశీలించారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

కాజీపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫామ్‌లో మంగళవారం వందేభారత్ రైలు తగిలి గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికుల సమాచారం మేరకు అతడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి వయస్సు 60నుంచి 65సంవత్సరాలు ఉంటాయి. ఎత్తు 5.5 ఎరుపు రంగు బట్టతల, తెల్లగడ్డం, బ్లూ కలర్ హాఫ్ షర్ట్, గీతల లుంగి ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌లో, 87126 58609, 87125 69496 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రేపటి నుంచి వరంగల్ కమిషనరేట్ పోలీసుల స్పోర్ట్స్‌మీట్

వరంగల్ క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బందికి వివిధ విభాగాల్లో క్రీడలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్‌తో పాటు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఏఆర్ విభాగం అధికారులు తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్‌జోన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో పాల్గొనవచ్చని, ప్రతిభచూపిన పోలీస్ క్రీడాకారులు కరీంనగర్‌లో జరిగే స్టేట్ లేవల్ స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొంటారన్నారు.

జూన్ 1న ఎడ్‌సెట్-2015 ప్రవేశాల పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం 2025-26 ఏడాదికి వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నేతృత్వంలో నిర్వహించనున్న టీజీ ఎడ్‌సెట్ ప్రవేశాల పరీక్షల షెడ్యూల్‌ను బుధవారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులు ప్రకటించారు. జూన్1న టీజీ ఎడ్‌సెట్-2025 ప్రవేశాల పరీక్షలు నిర్వహించనున్నట్లు షెడ్యూల్‌లో ప్రకటించారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి ఎడ్‌సెట్ కన్వీనర్‌గా నియమితులు కావడంతో తగిన ఏర్పాట్లను కాకతీయ యూనివర్సిటీ చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు సూచనల మేరకు ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో కంటే ఈ దఫా మరింత ఎక్కువ మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు సమాచారం. వరంగల్‌లో నాలుగైదు పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే అన్ని ప్రవేశాల పరీక్షల (సెట్స్) మీటింగ్ నిర్వహించి కన్వీనర్ నేతృత్వంలో టీజీ ఎడ్‌సెట్-2015 ఏర్పాట్ల వివరాలను వెల్లడించనున్నారు.

ఘనంగా సువర్ణ పుష్పార్చన

భారీగా తరలివచ్చిన భక్తులు



స్వామి వారి పాదాలకు అలంకరించే సువర్ణ పుష్పాలకు పూజలు చేయిస్తున్న దేవస్థానం అధికారులు

చిలుపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న దేవాలయంలో మంగళవారం నిర్వహించిన సువర్ణ పుష్పార్చన కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. స్వామి వారి పాదాలకు అలంకరించే రూ.40 లక్షల విలువ గల 108 స్వర్ణాల(బంగారం)కు దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు రత్నాకర్‌రెడ్డి, గోలి రాజశేఖర్‌ల సమక్షంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ వెస్ట్‌లింగ్ మహిళ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

కేయూ క్యాంపస్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జనవరి 14 నుంచి 17 వరకు పంజాబ్ భంటిండాలోని గురుకాశీ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడలకు కేయూ మహిళల వెస్ట్‌లింగ్ (ఫ్రీ స్టైల్) జట్టును 2024-25 ఏడాదికి బుధవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో సుమయ తాబసూమ్, బి. పావని (కిట్స్ కళాశాల, వరంగల్), శ్రీజా మహెవీన్ (త్రివేణి డిగ్రీ కళాశాల, భద్రాచలం), జె. చిన్ని(కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), కె.రేణుక (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, (వుమెన్స్) కొత్తగూడెం) కె.కారుణ్య (వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, బొల్లికుంట), జె.మాధురి, (కిట్స్ కళాశాల, వరంగల్), కె.నిహారిక (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా వరంగల్ వెస్ట్ టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ (వుమెన్స్) కళాశాల, ఫిజికల్ డైరెక్టర్ బి.జ్యోతి వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

మహానివేదనతో దేవుడి రథం

మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న మహానివేదన దేవుడి రథాన్ని టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు స్వగృహంలో సుందరంగా పూలు, విద్యుత్తు లైట్లలతో అలంకరించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కొబ్బరికాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. మహానివేదనతో బయలు దేరిన రథం.. గ్రామ పురవీధుల గుండా ఆలయానికి చేరుకొని మూడుసార్లు ప్రదక్షణ చేసింది. మంగళ హారతులతో రథానికి మహిళలు స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రభబండ్లు రథాన్ని అనుసరించాయి. దేవుడి రథ ప్రదర్శన సాయంత్రం 7గంటల నుంచి తెల్లవారువరకు కొనసాగింది. రథంతో వచ్చిన టిస్కాబ్ చైర్మన్ దంపతులు మార్నేని మధుమతి - రవీందర్‌రావు దంపతులను ఈవో నాగేశ్వర్‌రావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కమ్మగొని ప్రభాకర్ గౌడ్ తదితరులు సంప్రదాయ పద్ధతిలో రథానికి ఎదురెళ్లి సన్మానించారు.


భక్తజనసంద్రమైన ఆలయ పరిసరాలు

లక్షల మంది భక్తుల దర్శనం

ఎప్పుడూ లేని విధంగా ధ్వజరోహణం ముందు ఈ నెల 11 నుంచే వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భోగి, సంక్రాంతి రెండు రోజుల్లో భక్తులు లక్షల్లో పాల్గొన్నట్లు దేవాదాయశాఖ అధికారుకు అంచనా వేశారు. 16న సంప్రోక్షణ క్రతువు తర్వాత ఉగాది వరకు జరిగే వారాంతపు జాతరలు ప్రతీ ఆది, బుధ 11వారాలపాటు లక్షల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి దర్శనం చేసుకుంటారు.

దర్శించుకున్న ప్రముఖులు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ఎండోమెంట్ డీసీ సంధ్యారాణి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు స్వాగతం పలికి శేషవస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు.


మహానివేదనను తీసుకువచ్చిన పెద్దరథం ముందు మార్నేని దంపతులను సన్మానిస్తున్న ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులు

మల్లన్న.. శరణు.. శరణు..

శిగాలూగిన ఐనవోలు జాతర • మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


భక్తిపారవశ్యంతో మూకుమ్మడి నృత్యాలు, (ఇన్‌సెట్‌లో) బోనాలతో నృత్యాలు

ఐనవోలు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి మహాజాతరలో భక్తులు పోటెత్తారు. సంస్కృతి, సంప్రదాయాలు, జానపదులకు ప్రతీకగా బండారితో ఐలోని క్షేత్రం మల్లన్న నామస్మరణంతో మారుమోగింది. మంగళవారం సంక్రాంతి పర్వదినం రోజున రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి మొదలైన భక్తుల రాక.. అర్ధరాత్రి వరకు రద్దీగా కొనసాగింది. ఐలోని మల్లన్న.. అంటూ స్వామి వారిని కీర్తిస్తూ పరవశించిపోయారు. జానపద గేయాలతో నృత్యాలు చేస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి తన్మయం చెందారు. ఆలయంలో అర్చకులు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, బిల్వార్చన మహానివేదన నీరాజన పుణ్యాహవాచనము పూజలు జరిపారు. మల్లికార్జునస్వామికి వెండి కిరీటం, కవచం, సుగంధాలు వెదజల్లే పుష్పమాలతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి తెల్లవారువరకు అభిషేకాలు దర్శనాలు జరిగాయి.


స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, బీఆర్ఎస్ నాయకులు

అధికారుల సేవలు

జాతరలో పోలీసులు సేవలు అందించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి నేతృత్వంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాల నిఘా నీడన జాతర బందోబస్తును డీసీపీ, ఏసీపీలు పరిశీలించారు. ఆయ ప్రాంతాలకు చెందిన సీఐలు, ఎస్సైలు సుమారు 400 మంది విధులు నిర్వహించారు. జాతర నోడల్ అధికారి తహసీల్దార్ విక్రమ్‌కుమార్ జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వసతులు కల్పించారు. ఎంపీవో రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో 4 మండలాల పారిశుధ్య సిబ్బంది, 4 రోజులపాటు నిర్విరామంగా విధులు నిర్వహించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈసారి జీడబ్ల్యూఎంసీ పారిశుధ్య సిబ్బంది తక్కువగా హాజరుకావడమే కాకుండా అంతంత మాత్రంగానే సేవలందించారని అధికారులు గుర్తించారు. రహదారులను శుభ్రం చేసే వాహనాలను పంపించలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈ రవీందర్, ఏఈ రవికుమార్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నీటి కొరతలేకుండా సరఫరా చేశారు. విద్యుత్తు లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జాతరలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తులైట్లు సరిగా వెలగకపోవడంతో చీకటిగా మారింది. కుడా అధికారులు విద్యుత్తు లైట్ల మరమ్మతులను విస్మరించారని ఎండోమెంట్ అధికారులు చెబుతున్నారు. ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్‌ఫేర్, చైల్డ్‌లైన్ శాఖల ఆధ్వర్యంలో 1098 ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీసుల ఆధ్వర్యంలో తప్పిపోయిన పిల్లలు, వృద్ధుల కోసం సహాయ శిబిరాన్ని నిర్వహించారు. వరంగల్ - ఐనవోలు - కొమురవెల్లి - ఆర్టీసీబస్సులు ద్వారా భక్తులను చేరవేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు వైద్యసేవలు అందించారు. రెవెన్యూ ఆర్ఐ మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ హెచ్ఐవీ అవగాహన కల్పించారు. పర్యాటకశాఖ బుక్‌లెట్ల ద్వారా ప్రచారం నిర్వహించగా, పౌరసంబంధాల శాఖ పత్తాకు కనిపించలేదు. ఎక్సైజ్‌శాఖ అధికారులు జాతరలో ప్రత్యేక నిఘా పెట్టారు. రెండు రోజులు ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచారు. అలాగే మంగళవారం అర్ధరాత్రి పంథిని, స్టేషన్‌ఘన్‌పూర్ గ్రామాల యువకుల మధ్య కొట్లాట జరుగగా, రాకేష్ అనే యువకుడి తలకు తీవ్రగాయాలు అయ్యాయి.

సెపక్‌తక్రాలో ఏఐపీ హవా

చాంపియన్‌గా ఆలిండియా పోలీసు జట్టు

ముగిసిన జాతీయస్థాయి సెపక్‌తక్రా చాంపియన్ షిప్

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పురుషుల, మహిళల విభాగాల్లో ఆలిండియా పోలీసు (ఏఐపీ) జట్ల క్రీడాకారులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించి ముందు వరుసలో నిలిచారు. తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జేఎన్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 34వ జాతీయస్థాయి సీనియర్ పురుషుల, మహిళల సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. టీమ్ ఈవెంట్, డబుల్స్ రెగో, క్వాడ్ నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో.. ఆల్ ఇండియా పోలీసు (ఏఐపీ) పురుషుల, మహిళ క్రీడాకారులు డబుల్స్ రెగో, క్వాడ్ విభాగాల్లో మూడింటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు వేటలో ముందు వరుసలో దూసుకుపోయారు. కాగా, పురుషుల డబుల్స్‌లో మణిపూర్ జట్టు, మహిళల విభాగంలో ఎస్ఎస్‌బీ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచాయి. అదే విధంగా మహిళల డబుల్స్‌లో ఆతిథ్య తెలంగాణ రాష్ట్ర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజతం పతకం సాధించగా పురుషుల డబుల్స్‌లో తృతీయ స్థానంలో నిలిచి నిరుత్సాహపరిచింది. జేఎన్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ముందు వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారుల మధ్య నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

విశిష్ట అతిథిగా తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై పలు విభాగాల్లో పతకాలు సాధించి విజేతగా నిలిచిన జట్లకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. హనుమకొండలో జాతీయస్థాయి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ క్రీడలు నిర్వహించడం ద్వారా జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంపొందుతాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసిన సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా, రాష్ట్ర బాధ్యులను ఆయన అభినందించారు. తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెక్కల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జేఎన్ ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి సీనియర్ పురుషుల, మహిళల సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో 28 రాష్ట్రాలు, మహిళల విభాగంలో 22 రాష్ట్రాల క్రీడాకారులతో పాటు ఆలిండియా పోలీసు, ఎస్ఎస్‌బీ జట్లు, 50 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారన్నారు. ఇక్కడ జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జపాన్‌లో జరుగనున్న ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యోగేందర్ సింగ్ దయ, సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్ ప్రధాన కార్యదర్శి వీరాగౌడ్, కోశాధికారి నరేష్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గాదెపాక అయోధ్య, ప్రధాన కార్యదర్శి జితేంద్రనాథ్, ఉపాధ్యక్షుడు గొర్రె రవీందర్, క్రీడా పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.ధన్‌రాజ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది శ్రీరాం కిరణ్‌కుమార్, టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలు, పీఈటీలు, కోచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

- **టీమ్ ఈవెంట్ పురుషుల విభాగంలో.. :** మణిపూర్ రాష్ట్ర జట్టు ప్రథమ స్థానం (స్వర్ణం), ఢిల్లీ ద్వితీయ స్థానం (రజతం), ఎస్ఎస్‌బీ, అస్సాం జట్లు తృతీయ స్థానం (కాంస్యం)
- **మహిళల విభాగంలో.. :** ఎస్ఎస్‌బీ ప్రథమ స్థానం (స్వర్ణం), నాగాలాండ్ ద్వితీయ (రజతం), మణిపూర్, ఉత్తరప్రదేశ్ తృతీయ స్థానం (కాంస్యం).
- **డబుల్స్ ఈవెంట్ పురుషుల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), బిహార్ ద్వితీయ (రజతం), హరియానా, తెలంగాణ తృతీయ (కాంస్యం).
- **మహిళల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), తెలంగాణ ద్వితీయ (రజతం), ఢిల్లీ, కేరళ తృతీయ (కాంస్యం).
- **రెగో పురుషుల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), ఢిల్లీ ద్వితీయ (రజతం), మణిపూర్, రాజస్థాన్ తృతీయ (కాంస్యం).
- **మహిళల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), హరియానా ద్వితీయ (రజతం), నాగాలాండ్, ఎస్ఎస్‌బీ తృతీయ (కాంస్యం).
- **క్వాడ్ పురుషుల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం (స్వర్ణం), ఎస్ఎస్‌బీ ద్వితీయ, (రజతం), మణిపూర్, బీహార్ తృతీయ (కాంస్యం).
- **మహిళల విభాగంలో.. :** ఆలిండియా పోలీసు ప్రథమ స్థానం(స్వర్ణం), మణిపూర్ ద్వితీయ (రజతం), ఎస్ఎస్‌బీ, నాగాల్యాండ్ తృతీయ స్థానాల్లో నిలిచి కాంస్య పతకం సాధించింది.


మహిళల డబుల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన తెలంగాణ మహిళల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు


వీరభద్రా.. శరభ.. శరభ..


భక్తులతో రద్దీగా ఆలయ ప్రాంగణం

వైభవంగా కొత్తకొండ జాతర

- వీరభద్రస్వామికి పెద్ద ఎత్తున మొక్కులు
- భక్త జన సంద్రంగా మారిన పరిసరాలు




కొత్తకొండ కొండపై ఉన్న స్వయంభూ ఆత్మలింగం

ప్రత్యేక పూజలు

సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి మంగళవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. స్వామివారికి కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి ఆలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా పూజలు నిర్వహిస్తే సమస్త పీడల నుంచి విముక్తి కలిగి భోగభాగ్యాలు ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో లక్షలాదిమంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు. బుధవారం నాగవెల్లి, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నల్లపూసలను అలంకరింపజేశారు. అనంతరం పుష్పోత్సవం నిర్వహించారు. కొత్తకొండ కొండపై ఉన్న స్వయంభూ లింగేశ్వరస్వామికి అభిషేకం నిర్వహించారు. యేడాదిలో రెండు సార్లు మాత్రమే స్వయంభూ లింగేశ్వర స్వామికి అభిషేకం చేస్తారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఒకనాడు, రెండోది శ్రావణ అమావాస్య నాడు స్వయంభూ లింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తారు. కనుమ పండుగను పురస్కరించుకొని ఆలయం ముందు ఉన్న నందీశ్వరస్వామికి పెద్దఎత్తున పూజలు నిర్వహించారు.

తరలివచ్చిన లక్షలాది మంది భక్తులు

కొత్తకొండ దేవాలయంలో మకర సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని మంగళ, బుధవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తాలు తెలిపారు. మకర సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో భక్తులతో ఆలయం మొత్తం కిటకిటలాడగా క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో రాత్రి వేళల్లోనే జాతర ఎక్కువ సాగేది. అలాంటిది ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


గుమ్మడికాయ, కోడె మొక్కులు చెల్లిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్


మొక్కులు చెల్లించేందుకు వస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

భీమదేవరపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తకొండ భక్త జనజాతరగా మారింది. ఎటు చూసినా క్యూలైన్లలో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుడి నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపోయింది. మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగనాడు లక్షలాది మంది వీరభద్రస్వామిని భక్తులు దర్శించుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కుమార్, వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, యువ ఐపీఎస్ పత్తిపాక సాయికుమార్, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఈవో కిషన్‌రావు, కాజీపేట ఏసీపీ తిరుమల్, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్, వంగర ఎస్ఐలు సాయిబాబు, దివ్యలు, మాజీ ప్రజాప్రతినిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ దేవాదాయ శాఖ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్‌రావు, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తాలు ఆలయానికి వచ్చిన అతిథులు, భక్తులకు స్వాగతం పలికారు. ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన 50మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో విశిష్టమైన సేవలందించారు. హనుమ కొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగామ, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. హుజూరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్ధిపేట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపడం, ప్రైవేట్ వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈనెల 14న మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ఎడ్లబండ్లు తిరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన భక్తులతో జాతర మొత్తం కిటకిటలాంది. భక్తుల రద్దీతో కొత్తకొండ వీధులన్నీ భక్త జనంతో నిండిపోయాయి. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారిని దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ సలీమా, ఏసీపీ తిరుమల్, సీఐ పులి రమేష్, ఎస్ఐలు సాయిబాబు, దివ్యల ఆధ్వర్యంలో సుమారు 600మంది పోలీసులు జాతరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరను విజయవంతంగా పూర్తి చేశారు.


ఆలయం ఎదుట ఉన్న నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు


వేలేరు నుంచి వచ్చిన మేకల రథం

ప్రత్యేక ఆకర్షణగా కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు

కొత్తకొండ జాతరకే కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తపల్లి గ్రామం నుంచి 64 ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు. మూడు రోజులుగా రైతులు కష్టపడి తమ ఎడ్లబండ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది జాతరకు తీసుకొచ్చారు. 64 ఎండ్ల బండ్ల రథాలను మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఇంటికి వెళ్లిపోయాయి. అందమైన ఎడ్లబండ్లను చూసేందుకు జాతరకు వచ్చిన భక్తులు ఆసక్తిగా చూశారు. ముల్కనూరులో మహిళలు రథాల ముందు నీళ్లు పోసి, మంగళహారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. వీటితో పాటు వేలాది ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశాయి. వేలేరు గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు ఆకట్టుకున్నాయి. కొన్నేళ్లుగా మేకలబండ్లు వేలేరు నుంచి రావడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం అర్ధరాత్రి మేకల బండ్లు రావడంతో ఆలయ అధికారులు వాటిని ఆలయం ముందుకు తీసుకవచ్చారు. ఆలయ ఈవో కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామాల సునీతలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారిశుధ్యం

కొత్తకొండ జాతరలో పారిశుధ్య సేవలు వేగంగా జరిగాయి. డీపీవో లక్ష్మీరమాకాంత్, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవోలు నాగరాజు, రవి పర్యవేక్షణలో పారిశుధ్య సేవలు రాత్రి పగళ్లు అందించారు. సుమారు 40మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు, 200మంది కార్మికుల సిబ్బందితో ఆలయం చుట్టూ, పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుధ్య కార్మికులు 24గంటలు చెత్తను తొలగించారు. ప్రతీ దుకాణం ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. జాతరలో చెత్తా చెదారం, చెడిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు.


పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆదర్శనగర్ కాలనీ పరిశీలన

హసన్‌పర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తిలో 'దొంగల హల్‌చల్' అనే కథనం ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కాజీపేట సర్కిల్ ఏసీపీ తిరుమల్, స్థానిక ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు, పోలీసు సిబ్బందితో కలిసి హసన్‌పర్తి ఆదర్శకాలనీని మంగళవారం సందర్శించారు. తాళం వేసి ఉన్న ఇండ్లనే లక్ష్యంగా చేసుకొని తాళాలు పగులగొట్టి దొంగతనానికి యత్నించిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తుల వివరాలను సీసీ టీవీ ఫుటేజీల ద్వారా సేకరించారు. స్థానిక కాలనీవాసులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరిస్తేనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు.

కాలనీలో దొంగతనానికి పాల్పడిన వారిని అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి పట్టుకుంటామని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ఏసీపీ తిరుమల్ స్థానికులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ చేరాలుతో పాటు ఎస్సైలు దేవేందర్, రాజు, సిద్ధయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

పార్కుల్లో జిమ్ పరికరాలు ఏర్పాటు చేయండి

అధికారులతో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయల పరిధిలోని రెండు పార్కులలో ఓపెన్ జిమ్ పరికరాలతోపాటు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బల్దియా హార్టికల్చర్, ఎలక్ట్రికల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పరికరాల ఏర్పాటుకు కావలసిన ఎస్టిమేషన్ నమూనా, కావలసిన బడ్జెను లెటర్ ద్వారా తనకు అందించాలన్నారు. ఇంకా వీధి దీపాలతో పాటు వాహనాల మరమ్మతుకు కావలసిన నిధుల వివరాలను అందించాలన్నారు. ఈ సమావేశంలో హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, ఎలక్ట్రికల్ అధికారి సిరిమిల్ల సారంగం, ఏఈలు సరిత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన యువకుడిపై కేసు

హసన్‌పర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారణమైన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన చెన్నూరి రాజమౌళి ఈ నెల 12న ఉదయం హసన్‌పర్తి రేణుకా ఎల్లమ్మ దేవాలయం ప్రాంతం కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారిపై సైకిల్ నడుపుకుంటూ రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఇనుగాల విఘ్నేష్ అనే వ్యక్తి రాజమౌళి నడుపుతున్న సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో రాజమౌళి రెండు కాళ్లు చేతులు విరిగి తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలిసిన బాధితుడి కుమారుడు చెన్నూరి రవి ఘటనాస్థలానికి చేరుకొని రాజమౌళిని 108లో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రెండు రోజులుగా కోమాలో ఉన్న రాజమౌళి చికిత్స పొందుతూ ఈనెల 14న మంగళవారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. బాధితుడి కుమారుడి చెన్నూరి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు రాజమౌళి నేత్రాలను దానం చేశారు.

మృతుడి కుటుంబానికి పలువురు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజమౌళి కుటుంబాన్ని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, హసన్‌పర్తి మీడియా పాయింట్ ప్రతినిధులు కందుకూరి సంజీవ్, సయ్యద్ అహ్మద్, ఎలుకరాజు సదానందం, దండుగుడుం రాజుకుమార్‌తో పాటు పలువురు రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

9 మందిపై కేసు నమోదు

హసన్‌పర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కథనం ప్రకారం.. ఈ నెల 13న కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి యాదవనగర్ కెనాల్ కట్టపై వివిధ ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవిస్తున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ వెల్లడించారు.

ముచ్చర్లలో నేత్రదానం

హసన్‌పర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చర్లలో బజెగం సాంబయ్య అనా రోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ఎల్‌వీ ప్రసాద్ నేత్ర నిపుణులు నరేందర్ ద్వారా నేత్రాలను సేకరించినట్లు తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా గవర్నర్ బండ సాయిరెడ్డి తెలిపారు. నేత్రదానానికి సహకరించిన మృతుడి కుటుంబ సభ్యులను అభినందించి నేత్రదాన సర్టిఫికెట్ అందజేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

వరంగల్ మెడికల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం ఐఎన్‌టీయూసీ స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్‌గౌడ్ మెయిల్ ద్వారా కోరారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ కార్మిక, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ప్రకటించి, పీఆర్‌సీ 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులు వారు కోరుకున్న చోటికి వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని మెయిల్‌లో ఆయన కోరారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబాబాద్ శివారు ఇంద్రకాలనీలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన బుడెల్లి రాజు(37) కొన్నేళ్లుగా ఇంద్రనగర్ కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్దినెలలుగా రాజు మద్యానికి బానిసై పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో రాజు మద్యం తాగేందుకు భార్య సుమలతను డబ్బులు అడుగగా ఆమె ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన రాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మేడారంలో బస్వరాజు మంత్రాంగం

తూర్పు నియోజకవర్గంపై అనుచరులతో ఎమ్మెల్సీ సారయ్య చర్చలు

4 బస్సులు, 20 కార్లలో తరలి వెళ్లిన శ్రేణులు

కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశం

వరంగల్‌సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బస్వరాజు సారయ్య బుధవారం మేడారం సమ్మక్క - సారలమ్మల సన్నిధిలో అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశమైంది. 4 బస్సులు, 20 కార్లలో తూర్పు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యులు, కార్యకర్తలు సుమారు మూడు వందల మంది వరకు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సారయ్య వారితో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరు శ్రమించాలని, నియోజకవర్గంలో గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను, ముఖ్యంగా ఈ మధ్య కాలంలో వరంగల్ అభివృద్ధి కోసం ప్రభుత్వం వేల కోట్లను మంజూరు చేసిన విషయాలను ప్రస్తావిస్తూ ప్రజలను చైతన్యపరుచాలని చెప్పినట్లు తెలిసింది. పార్టీ పేరు చెప్పుకుని పైరవీలు చేసే వారిని నిలదీయాలని, సంక్షేమ పథకాలను పేదలకు అందేలా చూడాలని శ్రేణులకు పిలుపునిచ్చినట్లు సమాచారం. తూర్పు నియోజకవర్గంలో కొందరు ఇప్పటికే భూకబ్జాలకు పాల్పడుతున్నారని, అలాంటివారికే పార్టీలో పెద్దపీట వేస్తున్నారని ఆ విషయాలన్నీ ఇప్పటికే పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన శ్రేణులకు చెప్పినట్లు తెలిసింది.



మేడారంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కొండా వ్యతిరేకవర్గంగా ముద్ర

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒకటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావు దంపతుల వర్గం కాగా, రెండోది ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అనుచరుల వర్గంగా ప్రజల్లో ముద్ర పడింది. పీసీసీ పిలుపునిస్తే ఒకే సెంటర్‌లో ఈ రెండు వర్గాలు విడివిడిగా కార్యక్రమాలు చేపట్టడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని కొండా దంపతులు గుర్తించడంలేదని, రౌడీలను, కబ్జాదారులను ప్రోత్సహిస్తున్నారని కొండా వ్యతిరేకవర్గం ఆరోపిస్తోంది. కార్పొరేటర్లను లెక్క చేయకుండా వారి అనుచర వర్గంతో డివిజన్లలో పెత్తనం చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అనుచర వర్గాన్ని పెంచడం కోసమేనా..!?

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మేడారం దైవ దర్శనం, దావత్ వెనుక అసలు కారణం నియోజకవర్గంలో తన అనుచరవర్గాన్ని పెంచి పోషించేందుకేనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు మేడారంలో సమావేశం పెట్టాల్సిన అవసరం ఏముందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో తన వర్గానికి చెందిన వారికి అవకాశాలను ఇప్పించుకోవడంతో పాటు వారిని గెలిపించుకుని తన సత్తా చాటాలనే ప్రణాళికలో భాగంగానే ఈ దావత్ ఏర్పాటు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వడ్డెపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో సంక్రాంతి పర్వదిన వేడుకలు అంబరాన్నంటాయి. సంక్రాంతిని పురస్కరించుకొని దేవాలయాల్లో భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్ల ముందు మహిళలు వేసిన ముగ్గులు ఎంతగానో అలరించాయి. హనుమకొండ వడ్డెపల్లి టీచర్స్ కాలనీ- 1, ఎస్‌బీహెచ్ కాలనీలో మహిళలు రంగురంగుల ముత్యాల ముగ్గులను వేశారు. మహిళలు వేసిన రంగవల్లులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రేటర్ 57వ డివిజన్‌లోని టీవీ టవర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ నల్లా స్వరూపరాణి తన ఇంటి గుమ్మం ముందు ముగ్గులు వేశారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: మండల కేంద్రంలోని పాతమార్కెట్ శ్రీరాజ రాజేశ్వరస్వామి దేవాలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో అత్యంత ప్రతిభను కనబర్చిన ముగ్గురితో పాటు మరో 15 మందికి బహుమతులను అందిజేసినట్లు ఆలయ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ తెలిపారు. కార్యక్రమంలో రమేష్ యాదవ్, ఆలయ కమిటీ డైరెక్టర్ కందుకూరి శేషవేణి, పూజారి సుమనాచార్యులు, భక్తులు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కలిసిన ఐఎంఏ నాయకులు

వరంగల్ మెడికల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని వరంగల్ జిల్లా ఐఎంఏ నూతన కార్యవర్గం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి, కార్యదర్శి డాక్టర్ అజిత్ మహ్మద్, కోశాధికారి డాక్టర్ శిరీష్ కుమార్, ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ మన్మోహన్‌రాజ్, టీజీఎంసీ సభ్యులు, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నరేశ్ కుమార్, ఐఎంఏ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఐఎంఏ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

హసన్‌పర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు ఎంపీడీవో ప్రవీణ్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాల సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేష్ మాట్లాడుతూ.. జనవరి 26 నుంచి నాలుగు పథకాల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జనవరి 16 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, జనవరి 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే గ్రామ, వార్డు సభలు నిర్వహించాలన్నారు.

రైతు భరోసా పథకానికి ఎటువంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్యమైన ప్రతీ ఎకరాకు రూ.12వేల పెట్టుబడి సాయం, భూమి లేని రైతు కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అందిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ద్వారా సొంత భూమి ఉండి ఇండ్లు లేని కుటుంబాల జాబితాను సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చల్ల ప్రసాద్, ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు రహీం, ఎంఈవో ఈసరి రవిందర్, ఏపీవో విజయలక్ష్మీ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్, శ్వేతతో పాటు పంచాయతీ స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొత్తకొండ జాతరకు తరలిన ఎడ్ల బండ్లు



కొత్తకొండ జాతరకు ఎడ్లబండ్లపై వెళ్తున్న భక్తులు

మడికొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరకు మంగళవారం మడికొండ నుంచి భక్తులు భారీగా తరలివెళ్లారు. సుమారు 30 ఎండ్ల బండ్లలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఎడ్ల బండ్ల జాతరకు బంధుమిత్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో సాగ నంపారు.

ప్రధాన గేట్లను ఇరుకు గల్లీలో ఏర్పాటు చేయొద్దు



ధర్నా చేస్తున్న ఎస్‌డీడీ కాలనీ వాసులు

వడ్డెపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ - కేయూ వంద అడుగుల రోడ్డులోని శ్యామల దుర్గాదాస్ (ఎస్‌డీడీ) కాలనీలో హరిహర పూర్ణోదయ అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రధాన గేట్లను ఇరుకు గల్లీలలో ఏర్పాటు చేయవద్దని ఎస్‌డీడీ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నల్లాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్‌డీడీ కాలనీలో ప్రధాన గేట్లు ఏర్పాటు చేయవద్దని బుధవారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇరుకు గల్లీలలో భారీ అపార్ట్‌మెంట్లను నిర్మించడం వల్ల డ్రెయినేజీ వాటర్‌తో గ్రౌండ్ వాటర్ కలుషితమయ్యే ప్రమాదం ఉందని అన్నారు. మహా నగర పాలక సంస్థ అధికారులకు ఈ విషయంపై ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు.

ఈ ధర్నాలో ఎస్‌డీడీ కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పొన్నోజు వీరబ్రహ్మచారి, బొద్దిరెడ్డి శ్రీరాంరెడ్డి, తంగళ్లపల్లి శంకరాచారి, రొయ్యల సత్యం, గూడూరు రవీందర్‌రెడ్డి, కటకం శివప్రసాద్, నల్లా ప్రసాద్, రాంపల్లి రాజాప్రభు, చెన్నూరు బాపురావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

శ్రీరామ కథా సుధ కావ్యం ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లుకు చెందిన ప్రముఖ కవి అష్టావధాని, ఆధ్యాత్మిక రచయిత కోవెల సుప్రసన్నాచార్య విరచిత తాజా కావ్యం శ్రీరామకథా సుధ కావ్యం ఆవిష్కరణ బుధవారం హనుమకొండలో జరిగింది. వృద్ధాప్యంలో కళ్లు సరిగా కనిపించకున్నా ఆశువుగా చెబుతుంటే డాక్టర్ పాతూరి రఘురామయ్య వాటిని రాసుకోగా నగరంలోని సృజన లోకం దానికి కావ్య రూపం కల్పించడం విశేషం. సంక్రాంతి పర్వదిన వేళ ఆచార్య సుప్రసన్న డాక్టర్ పాతూరి రఘురామయ్య, ప్రొఫెసర్ రామా చంద్రమౌళి, పొట్లపల్లి శ్రీనివాసరావు, తెలుగు పరిశోధకురాలు డాక్టర్ కోవెల శ్రీలత శ్రీరామ సుధ కావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య సుప్రసన్న మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక సాహితీ సంపద కలిగి ఉన్న జిల్లాగా వరంగల్‌కు ప్రథమ స్థాన ఖ్యాతి దక్కుతుందని పేర్కొన్నారు. రెండు దశాబ్దాల సాహితీ చరిత్రను వెలికి తీసి రికార్డు చేస్తే ఓరుగల్లు చరిత్ర రెండు వేల పేజీలైనా సరిపోవని పేర్కొన్నారు. పరిశోధకులు ఇలాంటి బాధ్యతలను స్వీకరించాలని సుప్రసన్న పిలుపు నిచ్చారు. తన కావ్యాన్ని ప్రచురించిన ఓరుగల్లు సృజన లోకం నిర్వాహకుల కృషి అభినందనీయమన్నారు.


సమన్వికి జగత్ విఖ్యాత అవార్డు



సమన్విని సత్కరిస్తున్న స్వరమాధురీ కల్చరల్ అకాడమీ నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణానికి చెందిన బొలినేని సమన్వి జగత్ విఖ్యాత అవార్డును అందుకున్నారు. ఖమ్మంలోని భక్త రామదాసు ఆడిటోరియంలో స్వరమాధురి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి జాతీయ ఉత్సవాల్లో పాల్గొని అద్భుతంగా నృత్య ప్రదర్శన ఇచ్చినందుకు సమన్విని నిర్వాహ కులు ఈ అవార్డుతో సత్కరించారు. సమన్వి తల్లిదండ్రులు బొలినేని సాగర్‌రావు, మమత. నృత్యగురువు నాని మాస్టర్. సమన్వి జగత్ విఖ్యాత అవార్డును అందుకున్నందుకు కార్యక్రమ నిర్వాహకులు ఇసనపల్లి నగేష్, వేల్పుల వెంకటేష్, పలువురు కవులు, కళాకారులు అభినందించారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో



ఐనవోలు జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అప్పయ్య

వరంగల్ మెడికల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఐనవోలులో 50 మంది, కొత్తకొండలో 40 మంది వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎన్‌ఓలు, ఆశా కార్యకర్తలు షిఫ్టుల వారిగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జాతరలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, ముల్కనూరు వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చైనా మాంజా స్వాధీనం

మడికొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని భట్టుపల్లిలో ప్రభుత్వ నిషేధిత మాంజాను విక్రయిసున్నారనే సమాచారం మేరకు బుధవారం టాస్క్‌ఫోర్స్ బృందం, స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వరంగంటి విజయ్‌భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా పతంగుల మాంజా విక్రయిస్తున్నట్లు తెలుసుకొని అతడి వద్ద రూ. 8 వేల విలువైన మాంజాను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మాంజాతో పోలీసులు

కళ్లకు విశ్రాంతి ఇలా...

శీతాకాలంలో వీచే చలిగాలుల వల్ల కళ్లలో తేమ తగ్గిపోతుంటుంది. కళ్లు ఒత్తిడికి గురై పొడిబారుతుంటాయి. దీంతో కళ్లు ఎర్రగా మారి గుచ్చుకుంటున్నట్లుగా అనిపిస్తాయి. కళ్లు త్వరగా అలసిపోతాయి కూడా. వైద్యుల సలహా మేరకు కంటి చుక్కలు వాడడంతోపాటు కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్యల నుంచి సులభంగా బయటపడవచ్చు.

ఏకాగ్రతగా చూడడం

ఇది యోగాభ్యాసంలో ఒక ప్రక్రియ. స్థిరంగా చూపు నిలపడమే దీని ఉద్దేశం. మీ నుంచి మూడు అడుగుల దూరంలో ఒక కొవ్వొత్తిని ఉంచి వెలిగించండి. యథాస్థానంలో నిలబడి కొవ్వొత్తి మంటను అయిదు నుంచి పది నిమిషాలపాటు రెప్పవేయకుండా తదేకంగా చూడండి. ఇలా ప్రతిరోజూ చేస్తూ ఉంటే కళ్లలో నీరు సహజంగా ఉత్పత్తి అవుతుంది. తేమ శాతం పెరిగి కళ్లు పొడిబారే సమస్య తగ్గుతుంది. ఏకాగ్రతతోపాటు కంటి చూపు మెరుగుపడుతుంది.

అరచేతులతో వేడి అద్దడం

ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల ముందు పనిచేసేవాళ్లకి; చదువుకునే పిల్లలకు కళ్లు ఒత్తిడికి గురై అలసిపోతూ ఉంటాయి. ఈ సమస్య చలికాలంలో మరింత అధికంగా ఉంటుంది. ఇలాంటపుడు కళ్లకి విశ్రాంతి అవసరం. అరచేతులను ఒకదానిపై మరొదానిని చేర్చి వేగంగా రుద్దాలి. రెండు అరచేతులు వేడిగా అయిన తరవాత వాటిని మూసిన కళ్లమీద అద్దాలి. రెండు నిమిషాలు వేడి తగ్గే వరకు అలాగే ఉంచాలి. గట్టిగా గాలి పీల్చాలి. ఇలా వరుసగా నాలుగుసార్లు చేయాలి. అరచేతుల వేడికి కళ్లలోని కండరాలు సడలి విశ్రాంతి పొందుతాయి. కళ్లకు రక్తప్రసరణ జరిగి అలసట తగ్గుతుంది.

కళ్లు గుండ్రంగా తిప్పడం

కుర్చీలో కూర్చుని వీపుని నిటారుగా ఉంచాలి. కళ్లను గుండ్రంగా సవ్య దిశలో తరవాత అపసవ్య దిశలో తిప్పాలి. ఇలా పది నిమిషాలు చేయాలి.



దీనివల్ల కంటి చూట్టూ ఉన్న కండరాలపై ఒత్తిడి తగ్గుతుంది. దృష్టిని కేంద్రీకరించే సామర్థ్యం పెరుగుతుంది. కళ్లలో ఎరుపుదనం తగ్గి ప్రకాశవంతంగా మెరుస్తాయి.

వేగంగా రెప్ప వేయడం

రెప్పవేసే ప్రక్రియ ద్వారానే కళ్లు ద్రవాన్ని ఉత్పత్తి చేసుకుంటాయి. తరచుగా రెప్పవేస్తూ ఉంటేనే కళ్లు తేమగా ఉంటాయి. కంప్యూటర్ల ముందు పనిచేసేవారు, తదేక దృష్టితో చూస్తూ చదివే పిల్లలు చాలా సమయం వరకూ రెప్ప వేయరు. దీనికి చలిగాలులు తోడైతే కళ్లలో తేమ శాతం పూర్తిగా తగ్గుతుంది. అందుకే వీలుదొరికినపుడల్లా కనీసం ఇరవై సెకన్ల పాటు వేగంగా కళ్లు ఆర్పుతూ ఉండాలి. తరవాత అర నిమిషం కళ్లు మూసుకుని ఉండాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే కళ్లు పొడిబారే సమస్య తలెత్తదు.

నీళ్లు చిలకరించడం

ఇది కళ్లను శుభ్రం చేసేందుకు ఉపయోగించే ప్రక్రియ. దోసిలి నిండా నీళ్లను తీసుకుని ముఖానికి దగ్గరగా పెట్టుకుని మెల్లగా కళ్లమీదికి చల్లాలి. గోరువెచ్చని లేదంటే చల్లని నీళ్లను ఇలా చిలకరించుకోవచ్చు. దీనివల్ల కళ్లలోని దుమ్ము, ధూళి తొలగిపోతాయి. ఎండ, గాలి వల్ల కలిగే ఒత్తిడి, అలసట తగ్గి కళ్లు ప్రశాంతంగా కనిపిస్తాయి. త్రిఫల చూర్ణం కలిపి వడకట్టిన నీళ్లు లేదా గులాబీ నీళ్లను చిలకరించుకున్నా కూడా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

వారియర్



ఓఆర్‌ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్)కు... ఓఆర్‌ఎస్-ఎల్‌కు మధ్య తేడా తెలుసా? తెలుసుకోకుండా మార్కెట్‌లో లభ్యమయ్యే రకరకాల పొడర్లు, పానీయాలను ఉపయోగిస్తే ప్రాణాలకే ప్రమాదం కలగవచ్చు అంటున్నారు **డాక్టర్ శివరంజని సంతోష్.** ఈ అంశంపై ఆమె పోరాటం కూడా చేస్తున్నారు. ఆ వివరాలను 'నవ్య'తో పంచుకున్నారు

అందుకే ఈ పోరాటం!

డయేరియాతో బాధపడుతూ, ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన పిల్లలను తల్లితండ్రులు నా దగ్గరకు తీసుకొచ్చేవారు. వాళ్లను ఆరా తీస్తే, మందుల షాపుల్లో, రెడీమేడ్ టెట్రాప్యాక్‌లో దొరికే ఓఆర్‌ఎస్ పానీయాలను పిల్లలకు ఇస్తున్నట్టు తెలిసింది. వాటిని తెప్పించుకుని చూస్తే, అవి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన అసలైన ఓఆర్‌ఎస్‌లు కావనీ, చక్కెర మోతాదులు ఎక్కువగా కలిగి ఉన్న ఓఆర్‌ఎస్ మారు రూపాలనీ, వాటి వల్లే పిల్లల్లో డీహైడ్రేషన్ పెరిగి, ఆరోగ్యం క్షీణిస్తోందనీ కనిపెట్టాను. అధిక చక్కెర వల్ల విరోచనాలు మరింత పెరిగి, డీహైడ్రేషన్ రెట్టింపై, పిల్లల్లో ప్రాణాంతక పరిస్థితి తలెత్తుతుంది. ఈ రకమైన మోసాన్ని నేను భరించలేకపోయాను. అన్ని మందుల షాపుల్లో, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇవి అందుబాటులో ఉంటున్నాయి. తీయగా ఉండడంతో పిల్లలూ, పెద్దలూ వీటిని తాగుతున్నారు. కలరాతో పాటు ఎండదెబ్బకు గురైన సందర్భాల్లో, వ్యాధుల నుంచి కోలుకునే సమయాల్లో, నీరసాన్ని దూరం చేసుకోవడం కోసం వీటి మీదే ఆధారపడుతున్నారు. ఇది ప్రమాదకరం. అందుకే గత ఆరేళ్లుగా ఓఆర్‌ఎస్‌ల మీద ఉద్యమం చేస్తున్నాను.

ప్రజలు తప్పుదోవలో...

ఓఆర్‌ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్)ను ఒక ఔషధంగా వర్గీకరించడం జరిగింది. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా దీన్ని తయారుచేయాలి. కానీ కొన్ని కంపెనీలు ఆ ప్రమాణాలకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఫార్ములాకు భిన్నంగా ఓఆర్‌ఎస్‌ను ఇష్టారాజ్యంగా తయారు చేసి మార్కెట్లో ప్రవేశపెడుతూ ఉండడంతో, వాటికి అడ్డుకట్ట వేయాలని, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్‌కు ఉత్తరం రాశాను. వాళ్లు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయమని అన్నారు. దాంతో ఆ సంస్థకు పలుమార్లు ఫిర్యాదు చేసిన తర్వాత, 2022లో టెట్రాప్యాక్‌ల మీద ఓఆర్‌ఎస్ అక్షరాలను ఉపయోగించకుండా నిషేధిస్తూ సంస్థ, ఉత్తర్వులు జారీ చేసింది. కానీ రెండు నెలల తర్వాత ఓఆర్‌ఎస్'ఎల్' అనే మరొక పదంతో, ఎనర్జీ డ్రింక్‌ల పేరుతో ఈ ఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తాయి. నిజానికి మన దేశంలోని ఔషధ చట్టాల్లో, ప్రజల్ని తప్పుదోవ పట్టించే లేబుల్స్ వాడకూడదనే నియమం ఉంది. ఈ నియమాన్ని ఖాతరు చేయకుండా, ఎన్నో ఓఆర్ ఎస్‌ఎల్ పానీయాలు రూపొందుతూనే ఉన్నాయి. నియమాల ఉల్లంఘన నెపాన్ని తప్పించుకోవడం కోసం... 'డయేరియా సమయంలో వాడకూడదు' అనే సూచనను చిన్న అక్షరాల్లో ముద్రించి ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తూనే ఉన్నాయి. దాంతో ఓఆర్‌ఎస్‌కూ, ఓఆర్‌ఎస్‌ఎల్‌కూ మధ్య తేడాను కనిపెట్టలేని వినియోగదారులు వీటిని విరివిగా కొని వాడుకుంటున్నారు. దీని వల్ల తల్లితండ్రులు మోసపోవడం, పిల్లలు ఆరోగ్యాన్ని నష్టపోవడం పరిపాటిగా మారుతోంది. కాబట్టి ఎవరో ఒకరు ఈ ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే, మున్ముందు మరెంతో మంది పిల్లల విలువైన ప్రాణాలను నష్టపోవలసి వస్తుంది. ఇలాంటి పానీయాలకు చోటు

> **నేను తణుకులో పుట్టాను. విజయవాడలో పెరిగి హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. పాండిచ్చేరి జిప్‌మర్‌లో ఎమ్‌బిబిఎస్, ఎమ్‌డి చదివాను. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. ఆల్ ఇండియా జిప్‌మర్‌లో మూడవ ర్యాంకు సాధించాను. ఎమ్‌డి పీడియాట్రిక్స్ పూర్తి చేసిన తర్వాత మొదట చండీఘడ్‌లో వైద్యవృత్తి మొదలుపెట్టాను. తర్వాత హైదరాబాద్‌లో అపోలో, బర్త్‌ప్లేస్‌లో పని చేశాను. ఇప్పుడు మా సొంత మ్యాగ్నా సెంటర్స్‌లో సేవలందిస్తున్నాను. పాప అదితి సంతోష్ 12వ తరగతి చదువుతోంది. తనకు టాల్ అండ్ ఆల్ అనే సొంత వస్త్ర బ్రాండ్ ఉంది.**





కల్పించవద్దని అన్ని కార్పొరేట్ ఆస్పత్రులకూ, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకూ ఉత్తరాలు రాయబోతున్నాను. 2022లో తెలంగాణా హైకోర్టులో నకిలీ ఓఆర్‌ఎస్‌లకు వ్యతిరేకంగా ఒక పిల్ కూడా వేశాను. ప్రస్తుతం ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా, విమెన్ పీడియాట్రిక్ ఫోరం మద్దతుతో నా పోరాటాన్ని మరింత ముమ్మరం చేయబోతున్నాను.

సామాజిక మాధ్యమాల ద్వారా...

అంతర్జాలంలో లెక్కలేనంత తప్పుడు సమాచారం అందరికీ అందుబాటులో ఉంటోంది. దాన్ని గుడ్డిగా అనుసరించి, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వాళ్లూ ఉంటున్నారు. అలాగే మనలో చాలా మందికి ప్రాథమిక చికిత్సల పట్ల కూడా అవగాహన ఉండడం లేదు. గొంతులో ఆహారం అడ్డుపడడం మూలంగా ప్రాణాలకు ముప్పు వాటిల్లే హఠాత్పరిణామాల్లో ఎలా వ్యవహరించాలో తెలియదు. నిజానికి ఈ పరిస్థితి నాక్కూడా ఎదురైంది. ఎమ్‌డి చదివే రోజుల్లో రేగి పండు నా గొంతులో విరుక్కుపోయి, ఊపిరి అందక ఎంతో సతమతమైపోయాను. ఆ సమయంలో తోటి ఇంటర్న్ హౌస్ సర్జన్, అరుణ్ వెంటనే స్పందించి, సహాయపడడంతో ప్రాణాలతో బయటపడ్డాను. కాబట్టి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల ద్వారా ఓఆర్‌ఎస్, ఫస్ట్‌ఎయిడ్, సిపిఆర్, అపోహల పట్ల కూడా అవగాహన కల్పిస్తున్నాను. మా అమ్మాయి అదితితో కలిసి, ఇప్పటివరకూ 20 వేల మందికి ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్‌లలో శిక్షణ ఇచ్చాను. తెలుగు సినీ కథానాయకుడు నాని కూడా నా దగ్గర సిపిఆర్ శిక్షణ తీసుకుని, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు.

● గోగుమళ్ల కవిత

సలహా

నెలసరితో అదుపు తప్పే భావోద్వేగాలు

డాక్టర్! మా అమ్మాయికి 18 ఏళ్లు. నెలసరి సమయంలో చిత్రంగా ప్రవర్తిస్తూ ఉంటుంది. విపరీతమైన కోపం, ప్రతి చిన్న విషయానికీ చిరాకు పడిపోతూ ఉంటుంది. నెలసరి సమయంలో ఈ మార్పు ఎందుకు? ఈ భావోద్వేగాలను ఎలా అదుపు చేయాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

సాధారణంగా పెరిగే వయసుతోపాటు ప్రీమెన్‌స్ట్రువల్ సిండ్రోమ్(పి.ఎం.ఎస్) తగ్గుముఖం పడుతుంది. కానీ అరుదుగా కొందరిలో అది ఎంతకీ అదుపులోకి రాదు. పెళ్లై, పిల్లలున్న కొందరు మహిళలను కూడా ఈ సమస్య వేధిస్తూ ఉంటుంది. అయితే తొలి నెలసరి కనిపించే 13 ఏళ్ల వయసు నుంచీ 20 - 25 ఏళ్ల వయసువరకూ ఈ రకమైన 'మూడ్ స్వింగ్స్' సర్వసాధారణం. ఈ మార్పులన్నిటికీ నెలసరి సమయంలో శరీరంలో చోటుచేసుకునే హార్మోన్ల హెచ్చుతగ్గులే కారణం. ఈ విషయాన్ని తల్లులతోపాటు, పిల్లలూ అర్థం



చేసుకోవాలి. తల్లులు పిల్లలకు ఇదంతా సహజమైనవనే భరోసా కల్పించాలి.

అప్పుడేం చేయాలంటే?

అలాగే ఆ భావోద్వేగాలను అదుపు చేయడం కోసం యోగా, లేదంటే క్రమం తప్పక వ్యాయామం చేయించాలి. పీరియడ్స్‌కి రెండు రోజుల ముందు నుంచీ ఆహారంలో ఉప్పు తగ్గించాలి. ఒకవేళ ఈ లక్షణాలు నెలసరికి 10 రోజుల ముందు నుంచీ మొదలై, నెలసరి పూర్తయిన తర్వాత కూడా కొనసాగుతూ, లక్షణాలు మరీ తీవ్రంగా ఉంటే తప్పనిసరిగా వైద్యులను కలవాలి. ఈ సమస్యకు క్యాప్సూల్ రూపంలోని విటమిన్ ఇ, ఈవినింగ్ ప్రైమ్ రోజ్ ఆయిల్ వాడితే ఫలితం ఉంటుంది.

డాక్టర్ కీర్తి,
స్త్రీల నిపుణులు, హైదరాబాద్.

అద్దం మెరిసేలా...

మనం రోజూ అద్దంలో ముఖం చూసుకుంటూ ఉంటాం. ఈ క్రమంలో అద్దాన్ని చేతులతో పట్టుకున్నపుడు దాని మీద వేలి ముద్రలు పడుతుంటాయి. డ్రెస్సింగ్ మిర్రర్ మీదయితే దుమ్ము ధూళి పేరుకుపోతుంటాయి. ఇలాంటపుడు అద్దంలో ముఖం సరిగా కనిపించదు. వీటన్నింటినీ పోగొడుతూ అద్దాన్ని ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం!

- ప్రతిరోజూ అద్దాన్ని కాగితంతో గట్టిగా తుడవాలి. దీనివల్ల అద్దం మీద ఉన్న చేతి గుర్తులు, దుమ్ము తొలగిపోతాయి. అద్దం మసకగా కనిపిస్తుంటే దానిమీద రెండు నీటి చుక్కలు చల్లి మరో కాగితంతో రుద్ది తుడవాలి. అద్దం పూర్తిగా శుభ్రమవుతుంది.
- అద్దం మీద మరకలు ఎక్కువగా ఉంటే రెండు చుక్కల వైట్ వెనిగర్ వేసి సన్నని వస్త్రం లేదా కాగితంతో తుడవాలి.
- అద్దం లేదంటే డ్రెస్సింగ్ మిర్రర్ మీద కొద్దిగా టాల్కం పౌడర్ చల్లాలి. రెండు నిమిషాలు



అలాగే ఉంచాలి. తరవాత పేపర్ నాప్‌కిన్ లేదా చిన్న రుమాలుతో తుడిచేస్తే అద్దం చక్కగా మెరుస్తుంది

- ఒక కప్పు నీళ్లలో రెండు చెంచాల నిమ్మరసం వేసి కలపాలి. ఈ నీటిని ఓ స్ప్రే బాటిల్‌లో పోసి అద్దం మీద చిలకరించాలి. తరవాత చిన్న తువాలుతో తుడిచేస్తే అద్దం తళతళలాడుతుంది.
- ఒక గ్లాసు నీళ్లలో ఒక చెంచా ఉప్పు వేసి కరగించండి. దీనిలో చేతిరుమాలు ముంచి నీటిని పిండి దానితో అద్దాన్ని తుడిస్తే ఎలాంటి మొండి మరకలైనా శుభ్రంగా పోతాయి. అద్దం కొత్తదానిలా మెరుస్తుంది.
- అద్దం మీద మురికి ఎక్కువగా ఉంటే గోరువెచ్చని నీళ్లు చల్లి మెత్తని బట్టతో తుడిచేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- అద్దం మీదికి వేడి నీటి ఆవిరి పడేలా చేయాలి. తరవాత కాగితంతో తుడిచేస్తే మరకలన్నీ పోయి అద్దం శుభ్రంగా ఉంటుంది.

కల నిజమైన రోజు

సెలబ్ టాక్



వెండితెరపై తారగా మెరిసిపోవాలన్నది ఆమె చిన్ననాటి కల. కానీ మనసులో మాట చెబితే అందరూ చులకన చేస్తారనే భయం. 'అనుష్కలాగానో... ప్రియాంకలానో నువ్వు లేవు' అంటారేమోననే సందేహం. ఇన్ని మానసిక సంఘర్షణలను దాటి... తన ఇష్టాన్ని తనలోనే దాచిపెట్టి... పట్టుదలగా ప్రయత్నించింది. సహనంతో... దృఢ సంకల్పంతో అడుగు ముందుకు వేసింది. ఒక మంచి సినిమాతో బాలీవుడ్‌లోకి ప్రవేశించింది.
ఆమే అర్చితా అగర్వాల్.

"చిన్నప్పుడు ఎన్నో కలలు కంటాం. చదువు కోసమనో... పరిస్థితుల ప్రభావంతోనో అవన్నీ మరుగున పడిపోతుంటాయి. కానీ నేను కన్నది ఒకే ఒక్క కల. చిత్ర పరిశ్రమలో స్థిరపడాలని. అదీ నటిగా. ఆ కల నాతోపాటే పెరుగుతూ వచ్చింది. ఎక్కడ ఉన్నా... ఏంచేస్తున్నా... నా ఆలోచనల నుంచి ఎన్నడూ అది పక్కకు పోలేదు. ఎలాగైనా సాధించి తీరాలన్న పట్టుదల, అవకాశం వచ్చేవరకు వేచి చూసేంత సహనం... ఇవే నన్ను ఇవాళ నటిని చేశాయి. కమర్షియల్ సినిమా కాకపోయినా... 'డిస్పాచ్'తో తొలి చిత్రంలోనే మనోజ్ బాజ్‌పాయ్ లాంటి మంచి నటుడితో కలిసి పని చేయడం నాకు లభించిన అద్భుత అవకాశం.

చెప్పాలంటే భయం...

అసోంలోని ఓ మధ్యతరగతి కుటుంబం మాది. ఊహ తెలిసినప్పటి నుంచీ సినిమా అంటే ఇష్టం. ఆ ఇష్టం ప్రేమగా మారింది. కొన్నాళ్లకు నటించాలన్న తపన... తెరపై నన్ను నేను చూసుకోవాలన్న కోరిక మొదలైంది. అయితే ఎవరితోనైనా చెబితే ఎక్కడ ఆట పట్టిస్తారోననే భయం. 'నువ్వేమన్నా అనుష్కా లాగా ఉన్నావా? ప్రియాంకతో సరిపోతావా' లాంటి వ్యాఖ్యలతో నిరుత్సాహపరుస్తారనే సందేహం. దాంతో చాలా ఏళ్లు నా ఇష్టాన్ని నాలోనే దాచుకున్నా. ఇలా ఎంతోమంది తమను తాము తక్కువ చేసుకొని... కలలను చంపేసుకొంటున్నారు. వారిలా నేనూ మిగిలిపోవాలని అనుకోలేదు.

కాలేజీకి వెళ్లాక...

పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. కాలేజీలో చేరాను. అప్పుడు నా స్నేహితులకు చెప్పడం మొదలుపెట్టాను... 'నేను నటిని కావాలని అనుకొంటున్నా' అని. చాలామంది నేనేదో సరదాగా మాట్లాడుతున్నానని పట్టించుకోలేదు. నవ్వేసి వెళ్లిపోయేవారు. సన్నిహితులు, బంధువులు అయితే 'సినిమాలంటే కురచ డ్రెస్సులు వేసుకోవాలి. అలాంటివి మన ఇంటికి సరిపడవు' అనేవారు. వేరొకరైతే ప్రయత్నాలు అప్పటితోనే ఆపేసేవారేమో! కానీ ఆ మాటలు నాలో మరింత పట్టుదలను పెంచాయి. ఎలాగైనా నటిని అయ్యి చూపించాలని నిశ్చయించుకున్నాను. అసోం వదిలి ముంబయికి వచ్చేశాను. నాకు తెలుసు... నేను అనుష్కా అంతటి అందగత్తెను కాదని. అలాగని ప్రయత్నం ఆపదలచుకోలేదు.

తొమ్మిదేళ్ల ప్రయత్నం...

నటి కావాలన్న బలమైన ఆకాంక్ష మినహా పరిశ్రమ గురించి నాకు ఏమీ తెలియదు. ఎవరిని కలవాలనే కనీస అవగాహన లేదు. ఎంతో ప్రయత్నిస్తే ఒక చిన్న అవకాశం వచ్చింది.. కాస్ట్యూమ్ డిజైనర్ అసిస్టెంట్‌గా. ఎలాగో పరిశ్రమలోకి అడుగు పెట్టాను. 'బంగిస్తాన్, పికు, రయీస్' చిత్రాలకు పని చేశాను. అది నా కెరీర్‌కు ఏ విధంగానూ ఉపయోగపడలేదు. దాంతో మళ్లీ ఆలోచనలో పడ్డాను. అదే సమయంలో 'అనుపమ్ ఖేర్ యాక్టింగ్ స్కూల్ నిర్వహించిన వర్క్‌షాప్‌కు వెళ్లాను. ఆ తరువాత చాలా వర్క్‌షాప్‌లకు హాజరయ్యాను. ఇవన్నీ నటిగా ఎదగడానికి, నాలో ఆత్మవిశ్వాసం పెంపొందడానికి ఎంతో దోహదపడ్డాయి. ఐదేళ్ల ప్రయత్నం తరువాత 2020లో ఒక సినిమాలో అవకాశం లభించింది. ఆడిషన్స్‌కు వెళితే నిరాశే ఎదురైంది. అయితే మొదట వద్దన్నవారే మళ్లీ రమ్మన్నారు. నాలుగేళ్ల అనంతరం ఆ చిత్రం గత నెల విడుదల అయింది. అదే 'డిస్పాచ్'. మనోజ్‌బాజ్‌పాయ్‌తో కలిసి పని చేయడం వల్ల నటన పరంగానే కాకుండా చాలా విషయాలు నేర్చుకున్నాను. అంత స్టార్ అయినా ఆయనలో ఆ దర్పం కనిపించదు. నాలాంటి జూనియర్లతో కూడా సరదాగా ఉంటారు. అవసరమైనచోట సలహాలు ఇస్తారు. దర్శకుడి పనిని దర్శకుడికే వదిలేస్తారు. పాత్రలోకి ఒదిగిపోయాక దాన్ని పండించడానికి వంద శాతం కష్టపడతారు. అదే ఆయన్ను ప్రత్యేకంగా నిలిపిందని అనుకొంటున్నాను.

> ### పెద్ద బ్రేక్...
> సినిమాల మీద ప్రేమతో ముంబయి వచ్చినా... చదువు మానేయలేదు. ఒక పక్క చదువు కొంటూనే సినిమా ప్రయత్నాలు చేశాను. 'అనుపమ్ ఖేర్ యాక్టింగ్ స్కూల్‌కు వెళ్లాక కూడా రకరకాల ప్రాజెక్టులు ఒప్పుకున్నాను. ఏడెనిమిది లఘుచిత్రాల్లో, పలు బ్రాండ్ల ప్రకటనల్లో నటించాను. కొన్ని యూట్యూబ్ సిరీస్‌లో చేశాను. వీటన్నిటి నేపథ్యంలోనే 'డిస్పాచ్' రూపంలో నాకు పెద్ద బ్రేక్ వచ్చింది. దీని తరువాత చాలామంది కాస్టింగ్ డైరెక్టర్లను కలిశాను. వాళ్ల కాల్ కోసం చూస్తున్నాను. అలాగే ఒక అస్సామీ చిత్రంలో నటిస్తున్నాను.

నాన్నను చూసి నేర్చుకున్నా...

తెరపై కనిపించాలని వచ్చిన నాకు నటి కావడానికి తొమ్మిదేళ్లు పట్టింది. ఈ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు. అడుగడుగునా సవాళ్లు. కానీ ఏ రోజూ వెనక్కి వెళ్లిపోవాలని అనుకోలేదు. ఈ పట్టుదల, మనం చేసే పనిపై విశ్వాసం మా నాన్నను చూసి నేర్చుకున్నా. ఆయన వ్యాపారవేత్త. బాగా డబ్బు సంపాదించారు. పోగొట్టుకున్నారు. తిరిగి సంపాదించాలని ఇప్పటికీ కష్టపడుతున్నారు. ఈ వయసులోనూ ఆయన పట్టు వదలని ప్రయత్నం చేస్తున్నారు. అలాంటిది నేనెందుకు చేయలేను? నిజాయతీగా ప్రయత్నిస్తే ఎప్పటికైన సత్ఫలితం వస్తుంది. అలా నాన్నను ప్రేరణగా తీసుకొని అడుగులు వేశాను."

దోశలు అంటుకోకుండా రావాలంటే...

ఒక్కోసారి దోశలు వేసినపుడు అవి పెనానికి అతుక్కుపోతుంటాయి. వాటిని పెనం నుంచి తీయడానికి ఇబ్బందిగా అనిపిస్తుంటుంది. అలాగని నాన్‌స్టిక్ పాన్‌లను ఉపయోగించడం.... ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. దోశలు పెనానికి అంటుకోకుండా మంచి రంగులో క్రిస్పీగా రావాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం!

- ముందుగా పెనాన్ని జిడ్డు లేకుండా నున్నగా శుభ్రం చేసుకోవాలి. తరవాత స్టవ్ మీద పెట్టి చిన్న మంట మీద వేడి చేయాలి. పెనం మీద నీళ్లు చల్లితే చిటపటమంటూ వెంటనే ఆవిరైపోవాలి. అప్పుడే దోశ వేయడానికి పెనం అనుకూలంగా ఉంటుంది. ఒక పెద్ద ఉల్లిపాయను మధ్యకు కోసి దానితో పెనమంతా రుద్దాలి. తరవాత ఒక గంటెతో దోశ పిండిని పెనం మధ్యలో వేసి గుండ్రంగా వేగంగా రుద్దుతూ పెనమంతా పరచాలి. ఈ దోశ మీద కొన్ని నూనె చుక్కలు వేయాలి. మంట మధ్య స్థాయిలో ఉండేలా చూసుకుంటే ఒక నిమిషంలో చుట్టూ ఎర్రగా కాలి దోశ సులభంగా పెనం నుంచి విడివడుతుంది.



- ఒక గిన్నెలో గ్లాసు నీళ్లు తీసుకుని మూడు చెంచాల నూనె వేసి బాగా కలపండి. చిన్న గుడ్డ ముక్కను గుండ్రంగా మడిచి ఈ మిశ్రమంలో ముంచి దానితో వేడిగా ఉన్న పెనం మీద రుద్దాలి. తరవాత దోశ వేస్తే పెనానికి అంటుకోకుండా ఉంటుంది.
- పెనం వేడెక్కిన తరవాత దానిమీద అర చెంచా నూనె వేయాలి. ఒక బంగాళదుంపను తీసుకుని మధ్యకు కోసి ఒక భాగం మీద చాకుతో గాట్లు పెట్టి దానితో పెనమంతా నూనె అంటుకునేలా రుద్దాలి. తరవాత దోశ వేస్తే చక్కగా వేగి పెనం నుంచి సులువుగా వచ్చేస్తుంది.
- పెనాన్ని ఉపయోగించడానికి ముందు దాని మీద కొంచెం ఉప్పు వేసి ఐస్ ముక్కతో బాగా రుద్దాలి. దీనివల్ల పెనం పూర్తిగా శుభ్రమై పిండి అంటుకోకుండా దోశలు చక్కగా వస్తాయి.
- దోశల పిండిలో చిటికెడు పంచదార కలిపితే దోశలు ఎరుపు రంగులో వేగి పెనానికి అంటుకోవు. దోశల పిండి కోసం పప్పు, బియ్యం నానబెట్టేటపుడే అందులో ఒక చెంచా మెంతులు కలపడం వల్ల కూడా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
వరంగల్ ● గురువారం 16 జనవరి 2025

పండగవేళ... సరికొత్త లుక్కులు




సంక్రాంతి సందర్భంగా స్టార్ హీరోల నుంచి చిన్న హీరోలు నటిస్తున్న సినిమాల వరకు కొత్త పోస్టర్స్ విడుదలయ్యాయి. ఈ ప్రచార చిత్రాలతో ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.

'రాజాసాబ్' నుంచి ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నారీ నారీ నడుమ మురారీ' టైటిల్‌ను ప్రకటించారు. విశ్వక్‌సేన్ నటిస్తున్న 'లైలా'లో ఫిమేల్ లుక్‌ను రివీల్ చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'బ్రహ్మ ఆనందం' నుంచి కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్ జంటగా తెరకెక్కుతున్న 'దిల్‌రూబా' వచ్చే నెల 14న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిసున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

తారల సంక్రాంతి సంబరాలు







తారలు సంక్రాంతిని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి ట్రెడిషనల్ లుక్‌లో కనువిందు చేశారు. రామ్‌చరణ్ తన సతీమణి ఉపాసన, కూతురు క్లీంకారతో కలసి ఫొటో దిగారు. అల్లు అర్జున్ తన సతీమణి స్నేహా రెడ్డి, కూతురు అర్హ, తనయుడు అయాన్‌తో కలసి పిక్ తీసుకున్నారు. మోహన్‌బాబు దంపతులు, తనయుడు విష్ణు ఫ్యామిలీతో తిరుపతిలో కలసి ఫొటోలు దిగారు. వరుణ్‌తేజ్ తన సతీమణి లావణ్యతో కలసి గాలిపటాలు ఎగరేస్తూ ఫొటోలకు ఫోజిచ్చారు. నూతన దంపతులు నాగచైతన్య, శోభితా ధూళిపాళతో సంప్రదాయ దుస్తుల్లో పిక్ తీసుకున్నారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన కీర్తి సురేశ్, ఆంటోని తట్టిల్ జంటగా పండగ వేడుకల్లో తీసుకున్న ఫొటోలను షేర్ చేశారు. అలాగే విఘ్నేష్ నయనతార దంపతులు పిల్లలతో కలసి దిగిన పండగ ఫొటోను షేర్ చేశారు.






నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్


వెంకటేశ్

'మా సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, అభిమానులకు ధన్యవాదాలు. మేం మంచి ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనే ఆలోచనతో సంక్రాంతికి వస్తున్నాం అని చెప్పాం. నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు అనిల్‌కు థాంక్స్' అని అన్నారు విక్టరీ వెంకటేశ్. ఆయన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదలై విజయం సాధించిన నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ 'సాధారణంగా బెనిఫిట్ షోలకు ఫ్యాన్స్ యూత్ వెళుతుంటారు. కానీ తొలిసారి ఉదయం నాలుగున్నర షోకి ఫ్యామిలీ ఆడియన్స్ రావడం చాలా ఆనందం కలిగించింది' అన్నారు. సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు నిర్మాత దిల్ రాజు ధన్యవాదాలు తెలిపారు. పైరసీని ఎంకరేజ్ చేయకుండా థియేటర్లలోనే సినిమా చూడాలని ఆయన కోరారు.

అందమైన ప్రేమకథ




'బేబీ' కలయిక మరోసారి రిపీట్ అవుతోంది. ఆ సినిమాతో సూపర్ హిట్ కొట్టిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవిచైతన్య జంటగా మరో చిత్రం తెరకెక్కనుంది. '90స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య హసన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మేరకు 'యాన్ అన్‌ఫినిష్డ్ స్టోరీ' పేరుతో ఓ అనౌన్స్‌మెంట్ వీడియో విడుదల చేశారు. 'మీరు చూసిన మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా '90స్'లోంచి పుట్టిన అందమైన ప్రేమకథ ఇది. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా చిత్రం తెరకెక్కనుంది" అని పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు. ఈ సినిమాకు ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రాఫర్: అజీమ్ మహమ్మద్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్.

ఆస్కార్ వేడుక రద్దు అవుతుందా?



అమెరికాలోని లాస్‌ఏంజిల్స్ ప్రాంతాన్ని కార్చిచ్చు చుట్టుముట్టి, ఎంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలిగించిన ఫలితం ఇప్పుడు ఆస్కార్ అవార్డుల వేడుకలపై కూడా ప్రభావం చూపుతోందా?. టామ్ హాంక్స్, ఎమ్మా స్టోన్, మెల్ గిబ్సన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ వంటి హాలీవుడ్ ప్రముఖులు ఈ అగ్ని ప్రమాదంతో ఇళ్లు కోల్పోయారు. అలాగే ఆస్కార్ కమిటీలోని నలుగురు సభ్యులు కూడా ఈ కార్చిచ్చు వల్ల ఇళ్లు కోల్పోవడంతో మార్చి రెండున జరగాల్సిన ఆస్కార్ వేడుక రద్దు కావచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే.. 96 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో అవార్డుల వేడుక రద్దు కావడం ఇదే తొలిసారి అవుతుంది. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా ఆస్కార్ కమిటీ వేడుకని వాయిదా వేసింది తప్ప రద్దు చేయలేదు. ఇప్పుడు కూడా అలాగే చేయవచ్చని కొంతమంది అంటున్నారు. కనీ వినీ ఎరుగని రీతిలో ఇలా కార్చిచ్చు వ్యాపించి లాస్ ఏంజిల్స్‌ను బూడిద కుప్పగా మార్చడంతో ఈ నెల 23న జరగాల్సిన నామినేషన్స్ ప్రకటన వాయిదా వేశారు. పరిస్థితిని గమనిస్తున్న ఆస్కార్ కమిటీ అవార్డుల వేడుక జరిగే తేదీలో ఏదన్నా మార్పు ఉంటే త్వరలో ప్రకటిస్తుందని అంటున్నారు.





చాంపియన్స్ ట్రోఫీకి బుమ్రా దూరం?

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు పెద్ద ఎదురు దెబ్బ తగిలేలా ఉంది. జట్టు ప్రధాన పేసర్ బుమ్రా ఆ టోర్నమెంట్‌కు అందుబాటులో ఉండే అవకాశాలు కనిపించడంలేదు. ఇటీవలి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ చివరి టెస్ట్ సందర్భంగా బుమ్రా వెన్ను నొప్పితో బాధపడిన విషయం తెలిసిందే. ఈక్రమంలో.. స్వదేశం తిరిగొచ్చాక అతడు గతంలో వెన్ను నొప్పికి చికిత్స చేయించుకున్న న్యూజిలాండ్ డాక్టర్‌నూ సంప్రదించాడు. ఇక..వెన్ను నొప్పి నుంచి కోలుకొనేందుకుగాను బుమ్రా బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి వెళ్లాల్సి ఉంది. కానీ ప్రస్తుతం అతడు ఎన్‌సీఏకి వెళ్లడంపై సందిగ్ధం ఏర్పడింది. 'వచ్చే వారం బుమ్రా ఎన్‌సీఏలో చేరాలి. కానీ ఈ విషయంలో ఇంకా స్పష్టత రాలేదు' అని బీసీసీఐ అధికారి తెలిపారు.

ఏడేళ్ల తర్వాత.. రంజీ బరిలో పంత్

న్యూఢిల్లీ: స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ ఏడు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత రంజీ ట్రోఫీ బరిలో దిగుతున్నాడు. ఈనెల 23 నుంచి రాజ్‌కోట్‌లో సౌరాష్ట్రతో జరిగే మ్యాచ్‌లో ఢిల్లీకి ఆడనున్నట్టు పంత్ స్వయంగా తెలిపాడట. ఈ విషయాన్ని ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం కార్యదర్శి అశోక్ శర్మ బుధవారం వెల్లడించాడు. 2017-18 సీజన్‌లో పంత్ చివరిసారి రంజీ మ్యాచ్ ఆడాడు. అయితే మరో స్టార్ విరాట్ కోహ్లీ రంజీ మ్యాచ్‌లో ఆడే విషయమై స్పష్టత లేదని అలోక్ తెలిపాడు. ఇక..యువ ఆటగాడు యశస్వీ జైస్వాల్ ముంబై తరపున రంజీ మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఈమేరకు అతడు జట్టులో చేరాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్..మంగళవారంనాడు వాంఖడే స్టేడియంలో ముంబై జట్టుతో కలిసి సాధనలో పాల్గొన్నాడు. కానీ అతడు రంజీ మ్యాచ్ బరిలో దిగుతాడా..లేదా..అన్నది మాత్రం తెలియరాలేదు. భారత జట్టు మరో బ్యాటర్ గిల్..పంజాబ్ తుదుపరి రంజీ మ్యాచ్‌లో పాల్గొననున్నట్టు ఇప్పటికే ప్రకటించాడు.

సింధు, అనుపమ ముందంజ

● ఇండియా ఓపెన్‌లో ప్రణయ్, లక్ష్యకు నిరాశ

న్యూఢిల్లీ: సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత సింగిల్స్ స్టార్లు లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ ఆరంభ రౌండ్లోనే కంగుతిన్నారు. మహిళల్లో పీవీ సింధు, అనుపమ ఉపాధ్యాయ శుభారంభం చేశారు. సింధు 21-14, 22-20తో సంగ్ షూయన్ (తైవాన్)పై, అనుపమ 21-17, 21-18తో భారత్‌కే చెందిన రక్షితపై గెలిచి రెండో రౌండ్ చేరారు. ప్రణయ్ 21-16, 18-21, 12-21తో సూ లి యాంగ్ (తైపీ) చేతిలో, లక్ష్య 15-21, 10-21తో చున్ యి లిన్ (తైపీ) చేతిలో చిత్తయ్యారు. కాగా, కిరణ్ జార్జ్ 21-19, 14-21, 27-25తో యుషి తనక (జపాన్)పై గెలిచి పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక భారత షట్లర్‌గా నిలిచాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప/తనీషా జంట 21-11, 21-12తో సహచర ద్వయం కావ్య/రాధికను ఓడించి రెండో రౌండ్లో ప్రవేశించింది. మరో భారత జంట గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ 21-23, 19-21తో జపాన్ జోడీ హిగషినో/సకురమొటో చేతిలో ఓటమిపాలైంది.

మంధాన, ప్రతిక శతక జోరు
రికార్డుల హోరు

ఆఖరి వన్డేలో 304 పరుగులతో భారత్ గెలుపు
0-3తో ఐర్లాండ్ చిత్తు


ప్రతికా రావల్ (154)

రాజ్‌కోట్: సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు స్మృతీ మంధాన (80 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లతో 135), ప్రతికా రావల్ (129 బంతుల్లో 20 ఫోర్లు, సిక్సర్‌తో 154) సెంచరీలతో కదం తొక్కారు. ఫలితంగా పరుగులు వెల్లువెత్తాయి. రికార్డులపై రికార్డులు నమోదయ్యాయి. దాంతో భారత్‌తో బుధవారం జరిగిన ఆఖరి వన్డేలో ఐర్లాండ్ అమ్మాయిలు ఏకంగా 304 పరుగులతో చిత్తయ్యారు. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను స్మృతి సేన 0-3తో దక్కించుకుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 435/5 స్కోరు చేసింది. కీపర్ రిచా ఘోష్ (42 బంతుల్లో 10 ఫోర్లు, సిక్సర్‌తో 59) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. ప్రెండెర్‌గాస్ట్ రెండు వికెట్లు పడగొట్టింది. అత్యంత భారీ లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 31.4 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. సారా ఫోర్బ్స్ (41), ప్రెండెర్‌గాస్ట్ (36) మాత్రమే భారత బౌలర్లను ఒకింత అడ్డుకున్నారు. దీప్తీ శర్మ మూడు, తనూజా కన్వర్ రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్'గా ప్రతికా రావల్ నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 435/5 (ప్రతిక 154, మంధాన 135, రిచా 59, తేజల్ 28, ప్రెండెర్‌గాస్ట్ 2/71).
ఐర్లాండ్: 31.4 ఓవర్లలో 131 ఆలౌట్ (సారా 41, ప్రెండెర్‌గాస్ట్ 36, దీప్తి 3/27, కన్వర్ 2/31).

ఎన్ని రికార్డులో ..

కెప్టెన్ మంధాన, ప్రతికా రావల్ సూపర్ షోతో మ్యాచ్ పలు రికార్డులకు వేదికైంది.

● 435/5.. భారత మహిళలు, పురుషల జట్టుకు వన్డేలలో అత్యధిక స్కోరు. పురుషల జట్టు అత్యధిక స్కోరు 418/5, 2011లో వెస్టిండీస్‌పై ఇండోర్‌లో సాధించింది. ఇక మహిళల జట్టు గత అత్యధిక స్కోరు 370/5ను ఈ సిరీస్ రెండో వన్డేలో చేసింది.

● 304 పరుగుల తేడా.. వన్డేలలో భారత మహిళలకు అతి భారీ విజయం. 2017లో సౌతాఫ్రికాలో ఐర్లాండ్‌పైనే 248 రన్స్ గెలుపు గత అత్యుత్తమం.

● మంధాన, రావల్ 233 పరుగుల భాగస్వామ్యం.. మహిళల వన్డేలలో భారత్ తరపున నాలుగో ద్విశతక భాగస్వామ్యం.

● భారత ఓపెనర్లు ఇద్దరూ శతకాలు సాధించడం ఇది మూడోసారి. గతంలో రేష్మ, మిథాలి (1999, 258, ఐర్లాండ్‌పై), దీప్తీ శర్మ, పూనమ్ రౌత్ (2017, 320 పరుగులు, ఐర్లాండ్‌పై) ఈ ఫీట్ నమోదు చేశారు.

స్మృతీ మంధాన 70 బంతుల్లోనే..

స్మృతీ మంధాన 70 బంతుల్లోనే సెంచరీ చేసి అదరహో అనిపించింది. ఈ క్రమంలో ఆమె వన్డేల్లో వేగవంతమైన శతకం చేసిన భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కింది. దీంతో నిరుడు దక్షిణాఫ్రికాపై హర్మన్‌ప్రీత్ చేసిన 87 బంతుల రికార్డు తుడిచి పెట్టుకుపోయింది.



క్వార్టర్స్‌లో భారత్

ఖోఖో ప్రపంచ కప్

న్యూఢిల్లీ: భారత పురుషుల, మహిళల జట్లు అదిరే ఆటతో ఖోఖో ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకు పోయాయి. గ్రూప్-ఎలో తలపడుతున్న మహిళల జట్టు బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో 100-16 పాయింట్ల తేడాతో ఇరాన్‌ని చిత్తు చేసింది. మొదటి టర్న్‌లోని ఏకంగా 50 పాయింట్లు సాధించిన మన మహిళలు ఆ జోరును మిగిలిన మూడు టర్న్‌లలోనూ కొనసాగించారు. అంతకుముందు..మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 175-18 పాయింట్ల తేడాతో దక్షిణ కొరియాపై అద్భుత విజయంతో శుభారంభం అందుకుంది. నాలుగు జట్ల గ్రూప్-ఎలో మహిళల జట్టు రెండు విజయాలతో అగ్ర స్థానంలో కొనసాగుతోంది. ఇక..పురుషుల జట్టు హ్యాట్రిక్ కొట్టింది. బుధవారం జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో మనోళ్లు 70-38తో పెరూపై నెగ్గారు. తెలుగు ఆటగాడు పోతిరెడ్డి శివారెడ్డి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఇక..పోటీల తొలి రోజు నేపాల్‌ను ఓడించిన పురుషుల జట్టు మంగళవారం రెండో మ్యాచ్‌లో 64-34 స్కోరుతో బ్రెజిల్‌ను చిత్తు చేసింది. ఐదు జట్ల గ్రూపులో మొత్తం ఆరు పాయింట్లతో టాప్‌లో నిలిచింది.

'నార్వే చెస్' బరిలో హంపి

స్టావెంజర్ (నార్వే): తెలుగు గ్రాండ్‌మాస్టర్, వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్ కోనేరు హంపి ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో పోటీపడనుంది. ప్రస్తుతం మహిళల క్లాసికల్ చెస్‌లో ప్రపంచ ఆరో ర్యాంకులో ఉన్న హంపి తమ టోర్నీలో ఆడడం చాలా సంతోషంగా ఉందని నార్వే చెస్ నిర్వాహకులు వెల్లడించారు. ఈ టోర్నీ ఈ ఏడాది మే నెలలో జరగనుంది.

ఒలింపిక్ చాంపియన్‌కు షాక్

● కిన్వెన్ జెంగ్, రూడ్ అవుట్
● ఫెడరర్‌ను దాటేసిన జొకో
● అల్కారజ్ సబలెంక, ఒసాక, గాఫ్ ముందంజ
● ఆస్ట్రేలియన్ ఓపెన్


కిన్వెన్


లారా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాలుగో రోజు కొందరు స్టార్లకు చుక్కెదురైంది. మహిళల సింగిల్స్‌లో గతేడాది ఫైనలిస్టు, పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ కిన్వెన్ జెంగ్, ఆరో సీడ్ కాస్పర్ రూడ్ రెండో రౌండ్లోనే వెనుదిరిగారు. ఇక, 25వ గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న నొవాక్ జొకోవిచ్ వరుసగా రెండో విజయంతో మూడో రౌండ్‌లో ప్రవేశించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-7(4), 6-3, 6-2తో పోర్చుగల్ క్వాలిఫయర్ జేమీ ఫరియాను ఓడించాడు. 37 ఏళ్ల జొకోవిచ్‌కు ఇది గ్రాండ్‌స్లామ్స్‌లో 430వ మ్యాచ్ కావడం విశేషం. ఈ క్రమంలో జొకో.. ఓపెన్ ఎరాలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌లాడిన ఆటలాడిగా దిగ్గజం రోజర్ ఫెడరర్ (429) రికార్డును అధిగమించాడు. దీంతో నొవాక్ గ్రాండ్‌స్లామ్స్‌లో తన గెలుపోటముల రికార్డును 379-51కి పెంచుకున్నాడు. విగతా ఫేవరెట్ ఆటగాళ్లలో మూడో సీడ్ అల్కారజ్ 6-0, 6-1, 6-4తో నిషిఓకపై, రెండో సీడ్ జ్వెరేవ్ 6-1, 6-4, 6-1తో మార్టినెజ్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 6-7(7), 6-0, 6-3, 6-1తో నిషికొరిపై, 15వ సీడ్ డ్రేపర్ 6-7(7), 6-3, 3-6, 7-5, 6-3తో కొకినాకిస్‌పై గెలిచి మూడో రౌండ్ చేరారు. ఆరో సీడ్, 2022 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్టు కాస్పర్ రూడ్ 2-6, 6-3, 1-6, 4-6తో జాకుబ్ మెన్సిచ్ (చెక్ రిపబ్లిక్) చేతిలో కంగుతిన్నాడు. గతేడాది పారిస్ విశ్వక్రీడల్లో మహిళల విజేతగా నిలిచి రికార్డుకెక్కిన చైనా స్టార్, ఐదో సీడ్ కిన్వెన్ జెంగ్‌కు జర్మనీకి చెందిన 36 ఏళ్ల లారా సిగెమండ్ షాకిచ్చి సంచలనం సృష్టించింది. లారా 7-6(3), 6-3తో 22 ఏళ్ల జెంగ్‌ను చిత్తుచేసింది. మిగతా స్టార్ క్రీడాకారిణుల్లో టాప్ సీడ్ సబలెంక 6-3, 7-5తో బౌజాస్‌పై, మూడో సీడ్ గాఫ్ 6-3, 7-5తో బురేజ్‌పై, ఏడో సీడ్ పెగులా 6-4, 6-2తో మెర్టెన్స్‌పై, మాజీ నెంబర్‌వన్ నవోమి ఒసాక 1-6, 6-1, 6-3తో ముచోవాపై గెలిచి మూడో రౌండ్లో ప్రవేశించారు.

డబుల్స్‌లో భారత్‌కు నిరాశ: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లు రోహన్ బోపన్న, యుకీ భాంబ్రీలకు నిరాశ ఎదురైంది. ఆరంభ రౌండ్లో బోపన్న/నికోలస్ ద్వయం 5-7, 6-7(5)తో మార్టినెజ్/మునార్ జోడీ చేతిలో ఓడగా.. భాంబ్రీ/అల్బానో ఒలివెట్టి జోడీ 2-6, 6-7(7)తో ట్రిస్టన్/ఆడమ్ చేతిలో పరాజయం పాలైంది.

పారిస్ పతకాల నాణ్యతపై విమర్శలు

● నాసిరకంగా ఉన్నాయన్న భాకర్, అమన్ ● కొత్తవి ఇస్తామన్న ఐఓసీ



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో విజేతలకు అందించిన పతకాలు నాసిరకంగా ఉన్నాయంటూ అథ్లెట్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది పారిస్ క్రీడల్లో రెండు కాంస్య పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన పిస్టల్ షూటర్ మనూ భాకర్, కంచు మోత మోగించిన యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది అథ్లెట్లు పతకాల నాణ్యతపై విమర్శలు గుప్పిస్తున్నారు. 'కాంస్య పతకంపైనున్న పూత తొలగిపోతోంది. ఒలింపిక్స్‌లో దక్కిన పతకంలా ఇది అనిపించడం లేదు' అని భాకర్ పేర్కొంది. తన పతకం కూడా నాణ్యమైనదిగా లేదని రెజ్లర్ అమన్ వ్యాఖ్యానించాడు. మరో ఇద్దరు షూటర్లు స్వప్నిల్, సరబ్‌జోత్‌ల పతకాలు కూడా మసకబారినట్టు సమాచారం. కాగా, పతకాలు లోపభూయిష్టంగా ఉన్నాయంటూ ప్రపంచవ్యాప్తంగా 100 మంది దాకా అథ్లెట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి వెనక్కిచ్చినట్టు తెలుస్తోంది. పతకాల నాణ్యతపై విమర్శలు వస్తుండడంతో ఐఓసీ స్పందించింది. వీటి స్థానంలో కొత్తవి అందజేస్తామని ప్రకటించింది.

'హజారే' ఫైనల్లో కర్ణాటక

వడోదర: విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో కర్ణాటక 5 వికెట్లతో హరియాణాను ఓడించింది. మొదట హరియాణా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 237 పరుగులు చేసింది. కెప్టెన్ అంకిత్ కుమార్ 48 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అభిలాష్ శెట్టి 4 వికెట్లు తీశాడు. ఛేదనలో కర్ణాటక.. దేవ్‌దత్ పడిక్కళ్ (86), రవిచంద్రన్ స్మరణ్ (76) అర్ధ సెంచరీలతో సత్తా చాటడంతో 47.2 ఓవర్లలోనే 238/5 స్కోరు చేసి గెలిచింది. గురువారం విదర్భ, మహారాష్ట్ర జట్ల మధ్య రెండో సెమీస్ జరగనుంది.

హ్యాండ్‌బాల్ విజేత తెలంగాణ



మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయ హ్యాండ్‌బాల్ టోర్నీ బాలురు, బాలికల విభాగాల్లో తెలంగాణ విజేతగా నిలిచింది. మంగళవారం ఇక్కడ జరిగిన బాలుర ఫైనల్లో తెలంగాణ 18-7తో ఏపీపై గెలిచింది. బాలికల టైటిల్ పోరులో రాష్ట్ర జట్టు 19-9తో రాజస్థాన్‌ను ఓడించింది.

బిజినెస్

ఎగుమతులు మళ్లీ డీలా

డిసెంబరులో రూ.3.27 లక్షల కోట్లకు పరిమితం
వాణిజ్య లోటు రూ.1.89 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: భారత వస్తు ఎగుమతులు వరుసగా రెండో నెలలోనూ క్షీణించాయి. గత డిసెంబరులో ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన ఒక శాతం తగ్గి 3,801 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.3.27 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి. అంతర్జాతీయ వాణిజ్య మార్కెట్లో అనిశ్చితుల నేపథ్యంలో పెట్రోలియం, వజ్రాభరణాలు, రసాయనాల ఎగుమతులు క్షీణించడం ఇందుకు కారణం. కాగా, గత నెలకు దిగుమతులు 5 శాతం పెరిగి 5,995 కోట్ల డాలర్లకు (సుమారు రూ.5.16 లక్షల కోట్లు) చేరాయి. దాంతో వాణిజ్య లోటు 2,194 కోట్ల డాలర్లుగా (రూ.1.89 లక్షల కోట్లు) నమోదైంది. గత ఏడాది నవంబరులోనైతే వాణిజ్యలోటు ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయికి పెరిగింది. ఎగుమతులు క్షీణించడంతోపాటు బంగారం, వెండి, వంటనూనెలు, ఎరువుల దిగుమతులు భారీగా పెరగడం ఇందుకు దోహదపడింది. కాగా, గతనెలకు సేవల ఎగుమతులు 3,266 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2.81 లక్షల కోట్లు) పెరిగి ఉండవచ్చని వాణిజ్య శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది.

నవంబరు గణాంకాల్లో సవరణ

కేంద్ర వాణిజ్య శాఖ 2024 నవంబరు వాణిజ్య గణాంకాలను సవరించింది. ఎగుమతులను 5.06 శాతం తగ్గుదలతో 3,203 కోట్ల డాలర్లకు, దిగుమతులను 16 శాతం పెరుగుదలతో 6,386 కోట్ల డాలర్లకు కుదించింది. తద్వారా వాణిజ్య లోటు 3,183 కోట్ల డాలర్లకు తగ్గింది. పసిడి దిగుమతుల లెక్కింపులో తప్పిదం ఇందుకు కారణమైనట్టు తెలిపింది. నవంబరులో పసిడి దిగుమతులు సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి 1,486 కోట్ల డాలర్లకు పెరిగాయని తొలుత వెల్లడించిన కేంద్రం.. తన తప్పిదాన్ని సరిదిద్దుకుంది. పసిడి దిగుమతులను 500 కోట్ల డాలర్ల మేర తగ్గించి 984 కోట్ల డాలర్లకు కుదించింది.

ఏప్రిల్-డిసెంబరు కాలానికి..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన 9 నెలల కాలానికి ఎగుమతులు 1.6 శాతం వృద్ధితో 32,171 కోట్ల డాలర్లకు చేరగా.. దిగుమతులు 5.15 శాతం పెరుగుదలతో 53,248 కోట్ల డాలర్లకు ఎగబాకాయి. దాంతో వాణిజ్య లోటు 21,077 కోట్ల డాలర్లుగా నమోదైంది.

రెండేళ్ల గరిష్ఠానికి ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు

గత నెలలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు 35.11 శాతంవృద్ధితో 358 కోట్ల డాలర్లకు (రూ.30,788 కోట్లు) పెరిగాయని వాణిజ్య శాఖ వెల్లడించింది. ఇది రెండేళ్ల గరిష్ఠ స్థాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రోత్సాహకాలతో దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ బాగా పుంజుకుందనడానికిదే నిదర్శనమని సునీల్ భరత్‌వాల్ అన్నారు. గత నవంబరులో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 347 కోట్ల డాలర్లుగా, అక్టోబరులో 343 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

వాణిజ్య గణాంకాల కోసం డేటా అనలిటిక్స్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి

ఎగుమతి, దిగుమతి వాణిజ్య గణాంకాల్లో మెరుగైన అంతర్దృష్టి కోసం కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత మద్దతుతో డేటా అనలిటిక్స్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయనున్నట్టు వాణిజ్య కార్యదర్శి భరత్‌వాల్ వెల్లడించారు. త్వరలోనే దీన్ని ప్రారంభించనున్నట్టు ఆయన చెప్పారు.

3 భారతీయ సంస్థలపై అమెరికా ఆంక్షల తొలగింపు

న్యూయార్క్: అమెరికాకు చెందిన బ్యూరో ఆఫ్ ఇండస్ట్రీ అండ్ సెక్యూరిటీ(బీఐఎస్) తన ఆంక్షల జాబితా నుంచి 3 భారతీయ అణు రంగ సంస్థల పేర్లను తొలగించింది. అమెరికా జాతీయ భద్రత, విదేశీ విధాన ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయన్న కారణంగా 11 చైనా కంపెనీలను కొత్తగా ఈ లిస్ట్‌లో చేర్చింది. అమెరికా ఆంక్షల జాబితా నుంచి తొలగించిన భారత సంస్థల్లో ఇండియన్ రేర్ ఎర్త్, ఇందిరా గాంధీ ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(ఐజీసీఏఆర్), బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్) ఉన్నాయి. భారత్-అమెరికా మధ్య అణు సహకారానికి ఉన్న అవరోధాలను తొలగించే దిశగా చర్యలు చేపట్టబోతున్నట్లు అమెరికా జాతీయ భద్రత సలహాదారు(ఎన్ఎస్ఏ) జేక్ సుల్లివన్ వ్యాఖ్యానించిన వారం రోజులకే ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. 16 ఏళ్ల క్రితం భారత్‌తో అమెరికా కుదుర్చుకున్న పౌర అణు ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రయత్నంగా అమెరికా తాజా చర్యను చూడవచ్చు. అగ్రరాజ్యం తాజా నిర్ణయంతో అణు రంగంలో భారత్-అమెరికా పరస్పరం సహకరించుకోవడంతోపాటు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

వారసుడిని ప్రకటించిన బఫెట్

న్యూయార్క్: ప్రపంచ ప్రముఖ స్టాక్ ఇన్వెస్టర్, బెర్క్‌షైర్ హాత్‌వే చైర్మన్, సీఈఓ వారెన్ బఫెట్ తన కుమారుడు హోవర్డ్ బఫెట్‌ను వారసుడిగా ఎంచుకున్నారు. లక్ష కోట్ల డాలర్లకు పైగా విలువ చేసే బెర్క్‌షైర్ హాత్‌వేకు భవిష్యత్ చైర్మన్‌గా వ్యవహరించబోయేదీ హోవర్డేనని వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. వారెన్ బఫెట్ వయసు 94 ఏళ్లు. ఆయనకు ముగ్గురు సంతానం. ఒక కూతురు, ఇద్దరు కుమారులు. అందులో పెద్ద కుమారుడైన హోవర్డ్ బఫెట్‌కు ప్రస్తుతం 70 ఏళ్లు. బెర్క్‌షైర్ హాత్‌వే బోర్డులో 30 ఏళ్లుగా డైరెక్టర్‌గా ఉన్నారు.

అదానీ గూటికి ఎమార్ ఇండియా!?

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫాను నిర్మించిన ఎమార్ గ్రూప్‌నకు చెందిన భారత వ్యాపారంలో మెజారిటీ వాటా కొనుగోలుకు గౌతమ్ అదానీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఎమార్ ఇండియాలో 70-100 శాతం వరకు వాటా కొనుగోలు చేయవచ్చని.. డీల్ విలువ రూ.4,000-5,000 కోట్ల స్థాయిలో ఉండే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గౌతమ్ అదానీ తన అన్‌లిస్టెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీ అదానీ రియల్టీ ద్వారా ఈ కొనుగోలు జరుపనున్నారని.. ఈ డీల్‌కు అవసరమైన నిధులను కుటుంబ సంపద నుంచి సమకూర్చనున్నట్లు వారు వెల్లడించారు. అదానీ రియల్టీకి ఇదే అతిపెద్ద కొనుగోలు కానుంది.

'మెటా'లో మరో 3,600 మంది ఔట్

వాషింగ్టన్: అమెరికా టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. తాజాగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, థ్రెడ్స్ మాతృ సంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్ ఉద్యోగాల కోతకు దిగింది. తన ఉద్యోగుల్లో ఐదు శాతం మందిని పనితీరు బాగోలేదనే పేరుతో ఇంటికి పంపిస్తోంది. తాజా గణాంకాల ప్రకారం మెటాలో ప్రపంచ వ్యాప్తంగా 72,000 మంది పని చేస్తున్నారు. వీరిలో ఐదు శాతం అంటే 3,600 మంది త్వరలో ఉద్యోగాలు కోల్పోనున్నారు. అమెరికాలోని ఉద్యోగులకు ఈ నెల 10వ తేదీనే ఈ విషయం తెలిపారు. ఇతర దేశాల్లోని ఉద్యోగులకూ త్వరలోనే ఈ వార్త అందనుంది.

మార్కెట్లో రిలీఫ్ ర్యాలీ

200 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా పలు ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ముడిచమురు సెగలు, విదేశీ పెట్టుబడులు ఉపసంహరణ వంటి అంశాలు మాత్రం లాభాలను పరిమితం చేశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 491.42 పాయింట్లు ఎగబాకినప్పటికీ, చివరికి 224.45 పాయింట్ల లాభంతో 76,724.08 వద్ద ముగిసింది. నిఫ్టీ 37.15 పాయింట్ల వృద్ధితో 23,213.20 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.34 శాతం వరకు పెరిగాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 169.62 పాయింట్లు, నిఫ్టీ 90.10 పాయింట్లు లాభపడ్డాయి.

● భారత్ కరెన్సీ కూడా వరుసగా రెండో రోజూ బలపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 13 పైసలు పెరిగి రూ.86.40 వద్ద ముగిసింది. మంగళవారం సెషన్‌లోనూ రూపాయి మారకం విలువ 17 పైసలు పెరిగింది.

● లక్ష్మీ డెంటల్ పబ్లిక్ ఆఫరింగ్‌కు భారీ స్పందన లభించింది. బుధవారంతో ముగిసిన ఈ రూ.698 కోట్ల ఆఫర్‌కు ఏకంగా 113.97 రెట్ల బిడ్లు వచ్చాయి.

వేదాంత రిసోర్సెస్ 110 కోట్ల డాలర్ల సమీకరణ: రెండు విడతల బాండ్ల జారీ ద్వారా వేదాంత రిసోర్సెస్ 110 కోట్ల డాలర్లు సమీకరించింది. ప్రస్తుత రుణభారాన్ని తగ్గించుకునేందుకు ఈ నిధులను వినియోగించుకోనుంది. 2024 సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు బాండ్ల జారీ ద్వారా కంపెనీ 310 కోట్ల డాలర్లు సేకరించింది.

ఆదిత్య బిర్లా ఫ్యాషన్స్ రూ.4,789 కోట్ల సేకరణ: ప్రమోటర్లకు ప్రిఫరెన్షియల్ ఇష్యూతో పాటు క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా మొత్తం రూ.4,789 కోట్లు సమీకరించనున్నట్లు ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్ (ఏబీఎఫ్ఆర్ఎల్) వెల్లడించింది. వ్యాపార వృద్ధి కోసం ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు కంపెనీ తెలిపింది.

పన్నుల భారం తగ్గించాలి

ఇక్రా బడ్జెట్ విన్నపం



న్యూఢిల్లీ: వచ్చే కేంద్ర బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) భారం తగ్గించక తప్పదని ప్రముఖ రేటింగ్ సంస్థ ఇక్రా స్పష్టం చేసింది. ఈ భారం తగ్గితే తప్ప వినియోగ వ్యయం పెరిగి జీడీపీ వృద్ధి రేటు పుంజుకునే అవకాశం లేదని పేర్కొంది. గత సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయి 5.4 శాతానికి పడిపోయిన నేపథ్యంలో ఇక్రా ఈ హెచ్చరిక చేసింది. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మూలధన పెట్టుబడులు కూడా రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండాలని సూచించింది.

రూ.1.4 లక్షల కోట్ల లోటు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.11.11 లక్షల కోట్ల మూలధన పెట్టుబడుల్లో రూ.1.4 లక్షల కోట్లు లోటు ఏర్పడే అవకాశం ఉందని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ చెప్పారు. గత ఏడాది ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో మొత్తం మూలధన పెట్టుబడుల్లో 46 శాతం (రూ.5.13 లక్షల కోట్లు) మాత్రమే ఖర్చు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఆర్థిక సంవత్సరానికి రుణ సేకరణను నియంత్రిస్తూ మూలధన పెట్టుబడులు రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చర్యలు తీసుకోవాలన్నారు.

4.5 శాతం ద్రవ్య లోటు సాధ్యమే : ఆదాయ వృద్ధిరేటును పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ద్రవ్యలోటును జీడీపీలో 4.5 శాతం వద్ద కట్టడి చేయడం పెద్ద కష్టమేమీ కాదని నాయర్ స్పష్టం చేశారు. అపుడు మూలధన పెట్టుబడుల కోసం రూ.11 లక్షల కోట్లు కేటాయించడం సాధ్యమవుతుందన్నారు.

దిగుమతులు కట్టడి చేయాలి : ఈవై

పడిపోతున్న రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై సూచించింది. ఇందుకోసం దిగుమతులపై సుంకాలు పెంచాలని కోరింది. ఇలా చేయడం వల్ల డాలర్లకు గిరాకీ తగ్గి, రూపాయి మారకం రేటు కుదు టపడుతుందని తెలిపింది.

పన్నుపోటు తగ్గించండి: క్రెడాయ్

అందుబాటు ధరల (అఫర్డబుల్) గృహ ప్రాజెక్టులపై ఆదాయ పన్ను 15 శాతానికి కుదించాలని రియల్ ఎస్టేట్ రంగం కోరింది. అలాగే ఈ తరహా ప్రాజెక్టులు చేపట్టే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరింది. అలాగే అందుబాటు ధరల గృహ నిర్వచనాన్నీ ప్రస్తుతం రూ.45 లక్షల నుంచి మరింత పెంచాలని విజ్ఞప్తి చేసింది.

టూ వీలర్లపై జీఎస్‌టీ తగ్గించాలి : హీరో మోటోకార్ప్

కనీసం 125 సీసీ వరకు సామర్థ్యం ఉన్న ద్విచక్ర వాహనాలపై జీఎస్‌టీని 28% నుంచి 18% స్థాయికి కుదించాలని హీరో మోటోకార్ప్ కోరింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,080 ▲	73,410 ▲	1,01,000 ▼
విజయవాడ	80,900 ▼	76,500 ▲	92,000 ▼
విశాఖపట్నం	78,840 ▲	72,270 ▲	91,250 ▲
రాజమండ్రి	80,070 ▲	73,400 ▲	91,200 ▼
ప్రొద్దుటూరు	79,700 ▼	73,800 ▼	91,500 ▼
ముంబై	78,420 ▲	71,840 ▲	89,550 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	515
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	523	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	131
వరంగల్	117	గుంటూరు	130
కరీంనగర్	117	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	100
కర్నూలు	117	నెల్లూరు	105
విశాఖపట్నం	127	అనంతపురం	105
గోదావరి	131		

సౌదీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఘనస్వాగతం

» తెలుగు ప్రవాసీలతో సరదాగా గడిపిన కేంద్రమంత్రి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)


కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న తెలుగు ప్రవాసీలు

ఖనిజ భవిష్యత్తుపై సౌదీ అరేబియాలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి తెలుగు ప్రవాసీలు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం రియాద్‌లో ప్రవాసీలు ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కీలక అరబ్బు దేశమైన సౌదీ అరేబియాలో ఉపాధి కోసం వచ్చిన భారతీయులు ప్రత్యేకంగా తెలుగు ప్రవాసీలు వాణిజ్య, పరిశ్రమ రంగాల్లోనూ ఎదుగుతుండటం సంతోషకరమని అన్నారు. కుటుంబ సమేతంగా ఢిల్లీలోని తన ఇంట్లో జరిగిన సంక్రాంతి సంబురాలకు భారత ప్రధాని మోదీ, కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయెల్ వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా వారు తనతో మాట్లాడుతూ.. భారత్-సౌదీ సంబంధాల పటిష్ఠతలో తన సౌదీ పర్యటన ఎంతో కీలకమని చెప్పారని కిషన్ రెడ్డి తెలిపారు. దీంతో తాను పండుగ మధ్యలోనే సౌదీకి వచ్చినట్లు చెప్పారు. సౌదీలోని ప్రముఖ తెలుగు ప్రవాసీ సంఘం సాటా సెంట్రల్‌తో పాటు.. తెలుగు కళాక్షేత్రం, తాసా, హైదరాబాద్ నగరానికి చెందిన ఇతర ప్రవాసీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 20 నిమిషాల పాటు కిషన్ రెడ్డి ప్రసంగించి వెళ్లిపోతారని నిర్వాహకులు ప్రకటించినా.. తెలుగు వారి ఆప్యాయతతో రెండు గంటల పాటు ఆయన అందరితో కలిసి గడిపారు. ప్రప్రథమంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన ఒక కేంద్ర మంత్రి సౌదీకి వచ్చి ఆత్మీయంగా గడపడం ఆనందం కలిగించిందని అనేక మంది తెలుగు ప్రవాసీలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆమె కేంద్ర మంత్రి కూతురా?

సౌదీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒక యువతి కొందరు తెలుగు ప్రవాసీ మహిళలతో కలిసి కూర్చొంది. అందరితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఆమె.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూతురు వైష్ణవి అని తెలిసి ప్రవాసీలు ఆశ్చర్యపోయారు. సాదాసీదాగా అందరితో కలుపుగోలుగా మాట్లాడిన వైష్ణవి తీరును అందరూ మెచ్చుకోవడం కనిపించింది.

కేటీఆర్‌కు అటు గోడ దెబ్బ ఇటు చెంపదెబ్బ

» సుప్రీం తీర్పుపై ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ రేసు అంశంలో కేటీఆర్‌కు హైకోర్టులోనే కాదు సుప్రీం కోర్టులోనూ చుక్కెదురైందని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. సుప్రీం తీర్పుతో కేటీఆర్‌కు ఒకవైపు గోడ దెబ్బ, ఇంకో వైపు చెంప దెబ్బ పడిందని బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ప్రజల సొమ్ముదోచుకొని కుంభకోణం.. లంబకోణం లేదని అంటావా? అని ప్రశ్నించారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన వాళ్లపై చర్యలు తీసుకుంటే అక్రమ కేసులు అంటున్నారని విమర్శించారు.

ప్రభుత్వ భూమి అక్రమ పట్టాల అప్పగింత

సిరిసిల్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్ భూముల అక్రమ పట్టాలను తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. గతంలో ఇద్దరు భూములను అప్పగించగా తాజాగా మరో ఇద్దరు ముందుకు వచ్చారు. జిల్లాలోని తంగళ్లపల్లి మండలం సారంపెల్లికి చెందిన కూనవేని నర్సయ్య, మండెపల్లి గ్రామానికి చెందిన బుస్స లింగం పట్టా చేసుకున్న భూమిని తిరిగి ప్రభుత్వానికి ఇస్తున్నట్లు బుధవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌కు లేఖ అందజేశారు. కూనవేని నర్సయ్య గ్రామంలోని సర్వే నంబరు 464/4లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని, బుస్స లింగం గ్రామంలోని సర్వే నంబరు 365లో ఎకరం ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వంలో అక్రమ పట్టా చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదరు భూవిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఆ భూములను పేదల కోసం వినియోగిస్తామని తెలిపారు.

నారాయణపేట-కొడంగల్ పథకం వివరాలివ్వండి

» తెలంగాణకు సీడబ్ల్యూసీ లేఖ

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు వివరాలు సమర్పించాలని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) తెలంగాణను కోరింది. ఈ మేరకు తెలంగాణ ఈఎన్‌సీ (జనరల్)కి సీడబ్ల్యూసీ ప్రాజెక్టు అప్రైజల్(దక్షిణాది) విభాగం సంచాలకుడు లేఖ రాశారు. రూ.4350 కోట్ల వ్యయంతో 10 మండలాల్లోని లక్ష ఎకరాలకు సాగు, తాగునీటిని అందించడానికి వీలుగా ఈ ప్రాజెక్టును తెలంగాణ చేపడుతోందని అభ్యంతరాలు తెలుపుతూ కేంద్ర జలశక్తిశాఖ, కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ కార్యదర్శులు, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్, కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)లకు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేఖ రాసిన విషయం విదితమే.

గోదావరి బోర్డు చైర్మన్‌గా అతుల్‌జైన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్‌గా కృష్ణాబోర్డు చైర్మన్ అతుల్ జైన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెడుతూ బుధవారం కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) నిర్ణయం తీసుకుంది. గోదావరి చైర్మన్‌గా పనిచేస్తున్న డాక్టర్ ముకేశ్ కుమార్ సిన్హా సీడబ్ల్యూసీ చైర్మన్‌గా నియమితులవడంతో గోదావరి బోర్డు బాధ్యతలు అతుల్‌జైన్ స్వీకరించారు.


కూనంనేనిపై ఎన్నికల పిటిషన్ కొట్టివేతకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు బుధవారం సుప్రీంకోర్టులో నిరాశ ఎదురయింది. తనపై తెలంగాణ హైకోర్టులో నమోదైన ఎన్నికల పిటిషన్‌ను కొట్టి వేయాలంటూ ఆయన చేసిన వినతిని సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అఫిడవిట్‌లో సమగ్ర వివరాలు వెల్లడించలేదని పేర్కొంటూ కొత్తగూడెంకు చెందిన నందూలాల్ అగర్వాల్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని కొట్టివేయాలని కోరుతూ ఆయన తొలుత హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని హైకోర్టు నిరాకరించడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం.. వాదనలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేస్తూ దాన్ని కొట్టివేసింది.

జల్లికట్టు క్రీడలో విషాదం.. ఎద్దు పొడిచి యువకుడి మృతి

చెన్నై, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తమిళుల సాహసక్రీడ జల్లికట్టు పోటీల్లో విషాదం చోటుచేసుకుంది. మదురై జిల్లా అవనియాపురం వద్ద జరిగిన జల్లికట్టు క్రీడలో ఓ ఎద్దు కొమ్ములతో దాడి జరపటంతో దానిని అణచివేసేందుకు ప్రయత్నించిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ జల్లికట్టు క్రీడలో ఎద్దులను అణిచివేసేందుకు ప్రయత్నించిన సుమారు 150 మంది గాయపడ్డారు. సంక్రాంతి సందర్భంగా తమిళనాడులోని దక్షిణాది జిల్లాల్లో జల్లికట్టు క్రీడలు నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం అవనియాపురంలో జరిగిన జల్లికట్టు క్రీడలో మదురై సమీపం విలాంగుడి ప్రాంతానికి చెందిన నవీన్ అనే యువకుడు ఎద్దు పొడవటంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం ఉదయం పాలమేడులో జరిగిన జల్లికట్టు క్రీడల్లో 92 మంది గాయపడ్డారు. ఈ పోటీల్లో పార్తీబన్ అనే యువకుడు 14 ఎద్దులను అణచి విజేతగా నిలిచాడు. అతడికి తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పంపిన లగ్జరీ కారును బహుమానంగా అందజేశారు. ఈ పోటీల్లో తంగపాండ్యన్ అనే రైతుకు చెందిన ఎద్దు విజేతగా నిలిచింది.

స్కిల్ కేసులో చంద్రబాబుకు ఊరట



బెయిల్ రద్దు కోరుతూ గత వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

» ఇంటర్‌లొక్యూటరీ దరఖాస్తు వేసిన జర్నలిస్టుపై న్యాయమూర్తి ఆగ్రహం

» ఈ కేసుతో మీకేం సంబంధమని ప్రశ్న

న్యూఢిల్లీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ.. గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇప్పటికే చార్జిషీటు దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవలసిన అవసరం లేదని జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేతో కూడిన ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. ఇప్పటికే చార్జిషీటు దాఖలైన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చంద్రబాబుకు హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సమర్థించిన ధర్మాసనం.. దానిని రద్దు చేసేందుకు నిరాకరించింది. అవసరమైన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సూచించింది. ఇంకోవైపు.. ఆయనకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని స్వర్ణాంధ్ర పత్రిక విలేకరి బాలగంగాధర తిలక్ దాఖలు చేసిన ఇంటర్‌లొక్యూటరీ దరఖాస్తును కూడా సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. అసలీ కేసులో మీరెవరు.. మీకేం సంబంధమని జస్టిస్ బేలా త్రివేది ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ దరఖాస్తు వేసేందుకు మీకున్న అర్హత ఏమిటి? బెయిల్ వ్యవహారాల్లో మూడో పక్షం ప్రమేయం ఎందుకు? సంబంధంలేని బెయిల్ వ్యవహారాల్లో ఎలా దరఖాస్తు వేస్తారు? ఇంకోసారి ఇలా జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయి' అని తిలక్‌ను హెచ్చరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును 2023 సెప్టెంబరు 9వ తేదీ అర్ధరాత్రి నంద్యాలలో సీఐడీ పోలీసులు అరెస్టుచేశారు. మర్నాడు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఆ ఏడాది అక్టోబరు 31న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆయనకు తొలుత మధ్యంతర బెయిల్ ఇచ్చింది. అదే ఏడాది నవంబరు 20న పూర్తిస్థాయి రెగ్యులర్ బెయిల్ కూడా మంజూరు చేసింది. అయితే ఆ బెయిల్ రద్దు చేయాలంటూ ఆ మర్నాడే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

అరెస్టు చేస్తారా?



(మొదటిపేజీ తరువాయి)

నిరాకరించడంతో ఎదురుదెబ్బ తగిలినట్లయింది. సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను కూడా కేటీఆర్ తరఫు న్యాయవాదులు వెనక్కి తీసుకోవడంతో.. అసలు ఏం జరగబోతోందన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది. పైగా, ఏసీబీ మరోసారి కేటీఆర్‌ను ప్రశ్నించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుండడంతో.. ఈడీ, ఏసీబీ ఎటువంటి చర్యలు తీసుకుంటాయన్న ఆందోళన నెలకొంది. ఈడీ విచారణ తర్వాత అరెస్టు చేస్తారా? ఫార్ములా-ఈ కేసు నుంచి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బయట పడతారా? లేదా? అన్న చర్చ గులాబీ శ్రేణుల్లో జరుగుతోంది. హెచ్ఎండీఏ నిధులను కేటీఆర్ సొంతానికేమీ వాడుకోలేదని, ఫార్ములా-ఈ వ్యవహారంలో అవినీతే జరగలేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. ఈ కేసు నుంచి ఆయన బయటపడతారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. విచారణకు న్యాయవాదితో వస్తానంటూ కేటీఆర్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని ఈడీ వర్గాలు తెలిపాయి.

డిస్మిస్ చేయలేదు: బీఆర్ఎస్ లీగల్ సెల్

కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఆర్‌పై సుప్రీంకోర్టులో వేసిన క్వాష్ పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేయలేదని బీఆర్ఎస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి సోమ భరత్‌కుమార్ తెలిపారు. న్యాయనిపుణుల సూచన మేరకు పిటిషన్‌ను కేటీఆర్ తరఫు న్యాయవాది వెనక్కి తీసుకున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై దుష్ప్రచారం తగదన్నారు. హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచేందుకే కేటీఆర్ ఫార్ములా-ఈ రేసు నిర్వహించారని, కానీ.. ఆయనపై రాజకీయ కక్షతో బూటకపు కేసు పెట్టారని ఆరోపించారు. తమకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని, అందుకే విచారణను కేటీఆర్ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు.

కేసుపై ఈడీకి ఇప్పటికే అవగాహన!

ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు గతనెలలో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత.. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదు చేశారు. కేటీఆర్ తదితరులపై ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ)తో పాటు ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) కింద ఈడీ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. హెచ్ఎండీఏ జనరల్ ఖాతా నుంచి విదేశీ కంపెనీ అయిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు రెండు విడతలుగా దాదాపు రూ.46 కోట్లను విదేశీ కరెన్సీ రూపంలో చెల్లించడంపై ఈ దర్యాప్తు జరుగుతోంది. ఈ చెల్లింపులకు సంబంధించిన ఇన్వాయి‌స్‌లు ఎఫ్ఈవో నుంచి అందిన తర్వాత అర్వింద్‌కుమార్, కేటీఆర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తాను ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చానని బీఎల్ఎన్ రెడ్డి ఇప్పటికే ఈడీ విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే ఏదైనా విదేశీ కంపెనీకి విదేశీ కరెన్సీలో డబ్బు పంపించాలన్నప్పుడు రిజర్వ్ బ్యాంకు నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ, ఇలాంటి అనుమతులేవీ పొందకుండా, క్యాబినెట్ నుంచి, ఆర్థికశాఖ నుంచి అనుమతులు లేకుండా నిధుల బదిలీ జరిగిందనే విషయంలో ఎవరెవరి పాత్ర ఎంత అనే కోణంలో ఈడీ అధికారులు ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం.

కేటీఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు!

ఫార్ములా-ఈ కేసులో క్వాష్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఈడీ, ఏసీబీ విచారణకు హాజరు కావాల్సిందేనన్న హైకోర్టు ఆదేశాల విషయంలో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ కేసులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ కేటీఆర్ చేసిన అభ్యర్థనకు హైకోర్టు నిరాకరించడం, దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. అయితే ప్రస్తుత దశలో తాము జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పీబీ వర్లేతో కూడిన ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. దీంతో కేటీఆర్ తన క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. అంతకు ముందు కేటీఆర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13.1ఏ వర్తించదని, కేటీఆర్ ఒక్క రూపాయి అయినా తీసుకున్నారంటూ ఎవరూ ఆరోపించలేదని అన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ లో పేర్కొన్న అంశాలు విధానపరమైన లోపాలకు సంబంధించినవని వారు చెప్పారు. ఇది పూర్తిగా రాజకీయంగా కక్షసాధింపు కేసుగా అభివర్ణించారు. ఫార్ములా-ఈ రేసుల ద్వారా రాష్ట్ర గత ఏడాది రూ.700 కోట్లు ఆర్జించినట్లు తెలిపారు. ఈ రేసులను కొనసాగించేందుకే కేటీఆర్ ప్రయత్నించారని చెప్పారు. అయితే విచారణ జరుగుతున్న ఈ దశలో కోర్టు జోక్యం చేసుకోవడం సరికాదని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ అన్నారు. ఈ అభిప్రాయంతో సుప్రీంకోర్టు కూడా ఏకీభవించింది. అసలు అధికారులు అవినీతికి పాల్పడరంటే నమ్మే పరిస్థితి ఉందా? అని జస్టిస్ బేలా త్రివేది వ్యాఖ్యానించారు. కాగా, న్యాయపరమైన సలహాకు అనుగుణంగా తాము పిటిషన్‌ను ఉపసంహరించుకున్నామని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది మోహిత్‌రావు తెలిపారు. ఈ కేసులో ఏ కోర్టులోనైనా అప్పీలు చేసుకునే అవకాశం తమకు ఉందన్నారు.

కౌశిక్‌రెడ్డికి బెయిల్



కరీంనగర్ క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంగళవారం ఉదయం బెయిల్ మంజూరైంది. ఆయనను కరీంనగర్ పోలీసులు సోమవారం రాత్రి హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. అదేరోజు కరీంనగర్‌కు తరలించి రాత్రంతా త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. మంగళవారం ఉదయం కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ రెండో అదనపు మెజిస్ట్రేట్ ఎం. హేమలత ఎదుట హాజరుపరచగా.. ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. కౌశిక్ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు కావడంతో కరీంనగర్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.

ఆయనే నాపై దాడి చేశారు: కౌశిక్ రెడ్డి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): "వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని సంజయ్ కుమార్.. బీఆర్ఎస్ తరపున కారు గుర్తు, కేసీఆర్ బొమ్మతో ఎమ్మెల్యే అయ్యాడు. డబ్బులకు అమ్ముడుపోయి కాంగ్రెస్‌లో చేరాడు" అని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కరీంనగర్ డీఆర్‌సీ సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ తనను రెచ్చగొట్టేలా మాట్లాడారని, ఆయనే మొదట తనపై దాడి చేశారని ఆరోపించారు. రైతు భరోసా కోసం ప్రశ్నించానని, రైతు రుణమాఫీ పూర్తి చేయాలని అడిగానని.. అందులో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. కాగా, బంజారాహిల్స్ సీఐ విధులు అడ్డుకున్న వ్యవహారంపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై రెండు నెలల క్రితం బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ కేసు విచారణను మాసబ్‌ట్యాంక్ పోలీసులు చేపట్టారు. ఈనెల 16న విచారణకు రావాలని పోలీసులు బుధవారం కౌశిక్ రెడ్డి నోటీసులు జారీ చేశారు. అయితే తాను 17న హాజరవుతానని కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు.

'నాగార్జున సాగర్' ప్రధాన అజెండాగా 21న కేఆర్ఎంబీ భేటీ

» ప్రాజెక్టు నిర్వహణ, నీటి పంపకాలపై.. 2025-26 బడ్జెట్ ఆమోదంపైనా చర్చ!

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు కీలకమైన నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలే ప్రధాన అజెండాగా కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ఈ నెల 21న సమావేశం కానుంది. వేర్వేరు కారణాల వల్ల ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన కేఆర్ఎంబీ సమావేశం హైదరాబాద్‌లోని జలసౌధలో వచ్చే మంగళవారం జరగనుంది. ఏపీ విజ్ఞప్తితో సమావేశ అజెండాలో కొన్ని కొత్త అంశాలను ఇది వరకే చేర్చిన అధికారులు.. 2025-26కు సంబంధించి రూ.23.31 కోట్ల బోర్డు బడ్జెట్ ఆమోదం అంశాన్నీ కూడా తాజాగా చేర్చారు. ఇదికాక, నాగార్జున సాగర్‌కు సంబంధించిన కీలక అంశాలపైనా ఈ భేటీలో చర్చ జరగనుంది. సాగర్ బాధ్యతలన్నీ తమకే ఇవ్వాలని తెలంగాణ చేసిన ప్రతిపాదనను అజెండాలో చేర్చారు. మరోపక్క, సాగర్ జలాశయం నీటి పంపకాలపై ఇరు రాష్ట్రాల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో 2024-25 వాటర్ ఇయర్‌కు సంబంధించిన నీటి పంపకాల అంశాన్ని కూడా 21న జరిగే భేటీలో చర్చించనున్నారు. సాగర్ స్పిల్‌వే ఓగి(గేట్ల నుంచి నీరు జారే ప్రాంతం)పై గుంతల మరమ్మతులకు ఐఐటీ రూర్కీ సహకారం తీసుకోవాలని తెలంగాణ ఇటీవల చేసిన ప్రతిపాదనపై కూడా సమావేశంలో చర్చించనున్నారు.

ప్రాజెక్టులవారీ కేటాయింపులు ఉండాల్సిందే!

» కృష్ణా ట్రైబ్యునల్ ముందు నేడు ఏపీ వాదనలు

అమరావతి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు వేసిన రెండేసి కేసులపై వాదనలను విడివిడిగా వినాలని కృష్ణా జలవివాదాల (బ్రిజేశ్‌కుమార్) ట్రైబ్యునల్‌ను ఏపీప్రభుత్వం కోరనుంది. గురువారం ట్రైబ్యునల్ ముందు రెండు రాష్ట్రాలు తమ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యాయి. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89లో పేర్కొన్న విధంగా ప్రాజెక్టుల వారీ నీటి కేటాయింపులను యథాతథంగా కొనసాగించాలని.. కృష్ణా జలాల్లో తమ వాటా 512 టీఎంసీలను కొనసాగించాలని.. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదిపై నిర్మించిన జలాశయాలను, ఎత్తిపోతల పథకాలను అక్రమ కట్టడాలుగా గుర్తించాలంటూ తాము వేసిన కేసును ప్రత్యేకంగా వినాలని ఏపీ కోరనుంది. రెండు రాష్ట్రాల నడుమ కొత్తగా నీటి కేటాయింపులపై సమీక్షించాలంటూ 2023లో కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్సును, బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ కాలపరిమితిని పొడిగించడాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ట్రైబ్యునల్ ముందు వాదనలు వినిపించేందుకు వీలుగా బుధవారం ఢిల్లీలో న్యాయవాదులు గుప్తా, ఉమాపతి, జలవనరుల శాఖ అంతర్రాష్ట్ర విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజేశ్వరి, రిటైర్డ్ సీఈలు గంగాధర్, గిరిధర్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, సీఈ సుగుణకరరావుల బృందం మంత్రి నిమ్మల రామానాయుడుతో జూమ్ కాన్ఫరెన్సులో సమావేశమైంది.

పసుపు రైతులకు మంచి రోజులు

» బండి సంజయ్, అర్వింద్ పట్టుబట్టి బోర్డు సాధించారు: గోయెల్

» నిజామాబాద్‌లో పసుపు బోర్డును వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి


కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌కు పసుపు కొమ్ముల దండ వేసి సన్మానిస్తున్న ఎంపీ అర్వింద్

న్యూఢిల్లీ/హైదరాబాద్/నిజామాబాద్, జనవరి15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు శుభ పరిణామమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ అన్నారు. బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు మంచి రోజులు వచ్చాయని.. ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. మంగళవారం ఢిల్లీలోని వాణిజ్యభవన్ నుంచి గోయెల్ పసుపు బోర్డు కార్యకలాపాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కేంద్రమంత్రితో బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, కరీంనగర్ నుంచి వర్చువల్‌గా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోయెల్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి సంజయ్, ఎంపీ అర్వింద్ కోరిక మేరకు సంక్రాంతి రోజున పసుపు బోర్డును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బోర్డు ఏర్పాటు కోసం బండి సంజయ్, అర్వింద్ తీవ్ర ప్రయత్నాలు చేసి విజయం సాధించారన్నారు. కుంభమేళా రోజున బోర్డు ఏర్పాటు చేయడం రైతులకు కలిసి వస్తుందని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణలో నాణ్యమైన పసుపును సాగు చేస్తున్నారని.. అందుకే పసుపు బోర్డును ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటుతో పరిశోధనలు జరుగుతాయని.. కొత్త వంగడాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. పసుపు ఉత్పత్తిలోనూ నాణ్యత పెరుగుతుందని.. సరైన గిట్టుబాటు కూడా వస్తుందని ఆయన చెప్పారు.

మోదీతోనే రైతులకు మేలు: సంజయ్

రైతుల కోసం పనిచేసే ప్రభుత్వం ఏదైనా ఉంటే అది మోదీ ప్రభుత్వమేనని.. సంక్రాంతి రోజున పసుపు బోర్డు ఏర్పాటుతో మోదీ రైతులకు మేలు చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నిజామాబాద్ ఎంపీలుగా గతంలో చాలా మంది పనిచేసినా అర్వింద్ ఒక్కరే బాండ్ పేపర్ మీద రాసిచ్చిన తన హామీని నెరవేర్చుకున్నారని చెప్పారు. బోర్డు ఏర్పాటు వల్ల రైతులకు మెరుగైన ధర లభిస్తుందని ఎంపీ అర్వింద్ అన్నారు. లక్షలాది మంది పసుపు రైతుల కల నెరవేర్చిన ప్రధాని మోదీకి పాదాభివందనాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

స్వాగతిస్తున్నాం: జీవన్ రెడ్డి

నిజామాబాద్‌లో చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉమ్మడి నిజామాబాద్ ప్రాంతంలో పసుపు పంట బాగా పండుతున్నందున పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. రైతుల రెండు దశాబ్దాల పోరాటం ఫలించిందని హర్షం వ్యక్తం చేశారు. 2022లో కేంద్రం పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ప్రధానికి లేఖ రాసినట్లు గుర్తు చేశారు. కాగా, సంప్రదాయ, పాత పద్ధతుల్లో పసుపు రైతులు వ్యవసాయం చేయటంవల్ల ఇబ్బందులు పడుతున్నారని, పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు, కూలీల కొరతను అధిగమించేందుకు ఆధునిక యంత్రాలు, పనిముట్లు రాయితీపై సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి.. వ్యవసాయ మంత్రి తుమ్మలకు బుధవారం లేఖ రాశారు.

రైతులకు మేలు: చిన్నారెడ్డి

పసుపు బోర్డును నిజామాబాద్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షణీయమని, పసుపు బోర్డు ద్వారా రైతులకు మేలు జరుగుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి అన్నారు. బోర్డు ఏర్పాటు చేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి బుధవారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

తుమ్మల X ధర్మపురి

(మొదటిపేజీ తరువాయి)

ఓ బహిరంగ లేఖలో పేర్కొన్నారు. ఇంత దిగజారుడు భాషనా..? ఇది సభ్యత కాదంటూ ఫైర్ అయ్యారు. తన రాజకీయ జీవితం, వ్యక్తిత్వం గురించి బీజేపీ సీనియర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. పరిపక్వత లేని మాటలు మాట్లాడకుండా కాస్త సహనంతో రాజకీయ పరిజ్ఞానంతో మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.

నా జీవితం తెరిచిన పుస్తకం: తుమ్మల

'1983 నుంచి ఇప్పటివరకు నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవుల కోసం, పార్టీ టికెట్ల కోసం ఏనాడు కూడా ఏ నాయకుడి వద్దకెళ్లి నేను మోకరిల్లింది లేదు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రతిక్షణం ప్రజాహితం కోసమే పనిచేశాను. ఎన్టీఆర్ నుంచి రేవంత్‌రెడ్డి వరకు.. ఏ సీఎం క్యాబినెట్‌లో పనిచేసినా.. రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, పేదల కోసం పనిచేయటమే తప్ప మరో ఎజెండాతో పనిచేయలేదు. నేను ఏ పార్టీ గుమ్మం ముందు, ఏ నాయకుడి వద్ద సాగిలపడలేదు. ఉమ్మడి రాష్ట్రంలో అయినా, తెలంగాణలో అయినా ఏ మూలకు వెళ్లినా అక్కడి అభివృద్ధి ఆనవాళ్లలో నా గుర్తులు కనిపిస్తాయి. మీరు (అర్వింద్) పుట్టి పెరిగిన నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులు కౌలాస్‌నాలా నుంచి గుత్ప లిఫ్ట్ ఎత్తిపోతల వరకు.. ఉమ్మడి రాష్ట్రంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు జరిగినవే. ఆ సమయంలో మీ నాన్న డీఎస్ ఉన్నారు.. మీరు ఎక్కడ, ఏ పార్టీలో ఉన్నారో కూడా నాకు తెలియదు. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణమైన, నిర్మాణంలో ఉన్న ఏ జాతీయ రహదారిని తీసుకున్నా వాటి మంజూరులో, నిర్మాణంలో నా ప్రయత్నం, ప్రమేయముంది. బీజేపీ పార్టీ నుంచి కేంద్రమంత్రులుగా పనిచేస్తున్న నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డిలను అడిగితే వారే చెబుతారు. నా రాజకీయ జీవితం, వ్యక్తిత్వం గురించి మీ పార్టీ సీనియర్లు సీహెచ్ విద్యాసాగర్‌రావు, బండారు దత్తాత్రేయ, కె.లక్ష్మణ్‌లను అడిగి తెలుసుకోండి. మీరు మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేసినపుడు ప్రజలకు రాసిచ్చిన బాండ్ పేపరు గురించి నేనెక్కడా ప్రస్తావించలేదు. జాతీయ పసుపు బోర్డు సాధనకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా నేను కేంద్రంపై ఒత్తిడి తెస్తూ వచ్చాను. పసుపు బోర్డు ప్రకటించిన తర్వాత ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపాను. దీంట్లో మీకున్న అభ్యంతరమేంటి? బోర్డు ప్రకటన, ఏర్పాటులో మీరు సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించలేదు. అయినా రైతుల ప్రయోజనాల దృష్ట్యా సంయమనం పాటించాం. అర్వింద్ తన స్థాయిని దిగజార్చుకొని మాట్లాడుతున్నారు.. ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా.' అని తుమ్మల పేర్కొన్నారు.

తుమ్మల వయసుకు తగ్గట్లు ప్రవర్తించాలి: అర్వింద్

తుమ్మలకు వయసు మీద పడిన చిలిపి చేష్టలు పోలేదని అంతకుముందు ఎంపీ అర్వింద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం పసుపు బోర్డును కేంద్ర మంత్రి ప్రారంభించిన అనంతరం ఎంపీ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ప్రభుత్వం లేఖలు రాయటం వల్లే పసుపు బోర్డు వచ్చిందని తుమ్మల ప్రకటన చేయటాన్ని విలేకరులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. అర్వింద్ బదులిస్తూ.. ఎడ్లబండి వెళ్తున్నప్పుడు తుమ్మల అనే ఈగ వాలి తానే చక్రాలను తిప్పుతున్నట్లు భావిస్తుందని ఎద్దేవా చేశారు. వయసు మీదపడ్డ తుమ్మల పార్టీలు మారుతూనే ఉన్నారని.. ఆయన వయసుకు తగ్గట్లు ప్రవర్తించాలన్నారు. 'తుమ్మల కంటే ముందు మహబూబ్‌నగర్‌కు చెందిన నిరంజన్‌రెడ్డి వ్యవసాయ మంత్రిగా ఉండేటోడు. వీళ్లకు సొంత భూములున్నాయి. వీళ్ల మినీ కేసీఆర్‌లు.. సిల్లీ కామెంట్స్.. సిల్లీ ఫెలోస్..' అని మండిపడ్డారు.

పదవులకు వన్నె తెచ్చిన నేత జైపాల్‌రెడ్డి

» కేంద్ర మాజీ మంత్రికి సీఎం రేవంత్ నివాళి

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతి(గురువారం)ని పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్ రెడ్డి పాత్రను ప్రజలెప్పుడూ మరిచిపోరని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలను కేంద్రానికి వివరించడంలో సఫలీకృతుడయ్యారని, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పల్లె నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన అరుదైన రాజకీయ నాయకుడని, తాను చేపట్టిన అన్ని పదవులకు వన్నె తెచ్చారని మెచ్చుకున్నారు.

26 నుంచి మరో నాలుగు పథకాలు

» పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి: సీఎస్

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రారంభించనున్న మరో నాలుగు పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని సీఎస్ శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాలు ఈనెల 21 నుంచి నిర్వహించే గ్రామ సభలలో ఆమోదం పొందాలని చెప్పారు. ఈ నెల 26న ప్రారంభించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై బుధవారం ఆమె సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అపోహలకు తావివ్వకూడదని, నిజమైన అర్హులకే దక్కేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుభరోసా కింద సాగు యోగ్యం కాని భూములను క్షేత్రస్థాయిలో గుర్తించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున, ఎంపిక విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధానకార్యదర్శి సూచించారు.

ఫైర్ ఎన్‌వోసీ లేని కాలేజీలకు అనుమతి!

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక విభాగం నుంచి ఎన్‌వోసీ(నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోకుండా మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ కాలేజీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఆయా కాలేజీల్లో చదువుతున్న వేల మంది విద్యార్థులు.. మార్చిలో జరిగే వార్షిక పరీక్షలను రాయడానికి వీలు కలిగింది. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ అంటే.. ఒకే భవనంలో కాలేజీతోపాటు ఇతర వాణిజ్య కార్యాలయాలు ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కాలేజీలు సుమారు 350 వరకు ఉన్నట్లు అంచనా. ఈ కాలేజీలన్నీ తప్పని సరిగా ఫైర్ సర్వీసెస్ విభాగం నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలని, అప్పుడే అనుమతి ఇస్తామని గతంలో ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. అయితే, ఏటా ఈ ఎన్‌వోసీ లేకుండానే కాలేజీలకు అనుమతి ఇస్తున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా ఈ ఒక్క ఏడాదికే మినహాయింపు ఇస్తున్నట్టు తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

ఇన్‌సర్వీసు వైద్యులకు సుప్రీంలో ఊరట

» పీజీలో చేరేందుకు అవకాశమిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన తెలంగాణ ఇన్‌సర్వీస్ వైద్యులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. వీరికి పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో అవకాశం కల్పించాలంటూ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ఏపీలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా కేవలం తెలంగాణలో చదువుకున్న వారికి మాత్రమే ఇన్‌సర్వీస్ పీజీకి అవకాశం ఉండేది. దీనిపై సర్వీస్‌లో ఉన్న వైద్యులు గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చేసినా.. పదేళ్లుగా రాష్ట్రంలో సేవలు అందిస్తున్నామని, తమను అనర్హులుగా ప్రకటించడం సరికాదని పేర్కొన్నారు. దీనిపై విచారించిన సుప్రీంకోర్టు.. ఇన్‌సర్వీస్ పీజీలో అవకాశం కల్పించాలని ఉత్తర్వులు ఇచ్చింది.

వచ్చే నెలలో కాంగ్రెస్ సభ

సూర్యాపేట లేదా ఖమ్మంలో 'సంవిధాన్ బచావో' పేరిట బహిరంగ సభ.. రాహుల్ హాజరు

ఈ నెలాఖరుకు నామినేటెడ్ పదవుల భర్తీ : టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

న్యూఢిల్లీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఫిబ్రవరిలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. 'సంవిధాన్ బచావో' పేరుతో ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో సూర్యాపేటలో గానీ, ఖమ్మంలో గానీ ఈ సభను నిర్వహిస్తామని, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవుతారని చెప్పారు. ఇక రాష్ట్రంలో ప్రభుత్వ నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ల చైర్మన్ల పదవులను ఈ నెలాఖరుకు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం జరిగింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీతోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దామోదర రాజ నర్సింహ, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంస్థాగత అంశాలతో పాటు ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. పీసీసీ కార్యవర్గ కూర్పుపై సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, పార్టీ పని తీరు భేషుగ్గా ఉందని కేసీ వేణుగోపాల్ ప్రశంసించారని, జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాల్సిందిగా దిశా నిర్దేశం చేశారని చెప్పారు. ఇక క్యాబినెట్ విస్తరణపై ముఖ్యమంత్రి, అధిష్ఠానం కలిసి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. డీసీసీ అధ్యక్ష పదవులు.. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తూ ప్రజల్లో ఉన్నవారికే దక్కుతాయన్నారు.

ఆ పార్టీ బీఆరెస్సెస్

(మొదటిపేజీ తరువాయి)

చేయలేదని విమర్శించారు. స్వాతంత్య్ర పోరాటాన్ని ప్రశంసించేందుకు, ప్రజలకు చెప్పేందుకు ఆరెస్సెస్ సిద్ధంగా లేదని, స్వాతంత్య్ర పోరాటాన్ని వక్రీకరించడమే వాళ్ల వాస్తవ సిద్ధాంతమని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు కూడా అందుకు నిదర్శనమని, స్వాతంత్య్ర పోరాటంతో వాళ్లకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. మోహన్ భాగవత్ ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపనతోనే దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చిందన్నారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్య్ర పోరాటాన్ని ఎవరైనా వక్రీకరిస్తే వారిపై చట్టపరమైన విచారణ చేయాలని, ఆ క్రమంలోనే మోహన్ భగవత్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీని తను డిమాండ్ చేసినట్లు తెలిపారు. ప్రధాని మోదీ భాగవత్‌తో ఉన్నారా లేక దేశ స్వాతంత్య్ర సమర యోధుల వెంట ఉండి భాగవత్‌పై చర్యలు తీసుకుంటారా.. అనేది స్పష్టం చేయాలని రేవంత్ డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ భాగవత్ వ్యాఖ్యలను తక్కువ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ వాళ్లు తప్పుడు ఆరోపణలు చేయడంలో ఉద్ధండులని, అందుకే ఆ పార్టీని తాము భారతీయ ఝూటా పార్టీ అంటున్నామని రేవంత్ ఎద్దేవా చేశారు.

140 ఏళ్ల తర్వాత సొంత కార్యాలయం.. నిస్వార్థ సేవకు నిదర్శనం

భారత్‌ను బలమైన, శక్తివంతమైన దేశంగా మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ నూతన కేంద్ర కార్యాలయం వేదికగా ప్రణాళికలు రూపుదిద్దుకుంటాయని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యాలయం దేశ ప్రయోజనాలకు వేదిక కాబోతుందన్నారు. దేశంలోని దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీలు, బలహీనవర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం 140 ఏళ్లుగా కృషి చేస్తోన్న కాంగ్రెస్.. ఇన్నేళ్లకు సొంత కార్యాలయాన్ని నిర్మించుకుందన్నారు. అంటే కాంగ్రెస్ పార్టీ ఎంత నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసిందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. 40 ఏళ్ల కింద ఆవిర్భవించిన బీజేపీ, 140 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ ఆర్థిక స్థితిగతులను పరిశీలించినా ఇది అర్థం అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం దేశ ప్రజలకు పండుగ రోజని రేవంత్ అభిప్రాయపడ్డారు. కొత్త భవనంలోకి కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం మారడాన్ని చరిత్రాత్మక ఘట్టంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభివర్ణించారు. కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన కూడా పాల్గొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం, రాహుల్ గాంధీ ప్రధాని అవడం ఖాయమన్నారు. కాగా, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఏపీపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, ఏఐసీసీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, ఎంపీలు మల్లు రవి, సురేష్ షెట్కార్, రఘువీర్‌రెడ్డి, పార్టీ నేతలు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



ఏఐసీసీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ ఆఫీసులపై దాడులు

తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ వాళ్లు పోలీసులతో కలిసి కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు చేశారని రేవంత్ అన్నారు. తాము ఆలా చేయడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి తాము నేర్చుకోవాల్సింది ఏమీ లేదన్నారు. ఎక్కడైనా, ఎవరిపైన అయినా దాడులు జరిగితే పోలీసులు చర్యలు చేపడతారని, శాంతి భద్రత సమస్య తలెత్తితే పోలీసులు జోక్యం చేసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో చట్టం ప్రకారం పాలనను కొనసాగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని స్పష్టం చేశారు. ఎక్కడైనా తప్పు జరిగితే దానిని సరిదిద్దుకొంటున్నామని చెప్పారు.

నేడు కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ భేటీ

న్యూఢిల్లీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌తోపాటు ఇతర మంత్రులతో భేటీ అయ్యే అవకాశం ఉంది.

50 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా నేడు విదేశీ పర్యటనకు సీఎం

» తొలుత సింగపూర్‌లో పర్యటన

» తర్వాత ప్రపంచ ఆర్థిక సదస్సుకు..

» 24న తిరిగి హైదరాబాద్‌కు సీఎం రాక

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. ఉన్నతాధికారులతో కలిసి సింగపూర్, స్విట్జర్లాండ్‌లో పర్యటించనున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్.. గురువారం రాత్రి 10 గంటలకు సింగపూర్‌కు పయనమవుతారు. ఈ నెల 17 నుంచి 20 వరకు నాలుగు రోజులపాటు అక్కడ గడపనున్నారు. ఈ సందర్భంగా సింగపూర్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో ఏర్పాటైన క్రీడా విశ్వవిద్యాలయాలు, స్టేడియాలను పరిశీలించి.. అక్కడి అధికారులతో సమావేశం కానున్నారు. అలాగే పలువురు పారిశ్రామికవేత్తలతోనూ సీఎం సమావేశమవుతారు. అనంతరం ఈ నెల 20న స్విట్జర్లాండ్‌కు వెళ్లి.. అక్కడ నాలుగు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొననున్నారు. కాగా, గతేడాది తొలిసారి దావోస్‌కు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి రూ. 40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు చేసుకున్నారు. ఇందులో అనేక అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలున్నాయి. ఈసారి అంతకుమించి పెట్టుబడులు సాధించాలనే లక్ష్యంతో ఉన్నారు. విస్తరణలో భాగంగా ఇక్కడే మరిన్ని పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా ఈసారి దావోస్‌లో ఆయా కంపెనీల చైర్మన్లు, సీఈవోలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే.. భారత్‌లో పెట్టుబడులకు సిద్ధమవుతున్న విదేశీ కంపెనీలు తెలంగాణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న లక్ష్యంగా ఈసారి దావోస్ సమావేశంలో 'తెలంగాణ పెవిలియన్' పేరుతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి దావోస్ సమావేశాల్లో రూ.50 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిసింది. కాగా, దావోస్ పర్యటన అనంతరం ఈ నెల 24న సీఎం హైదరాబాద్ చేరుకోనున్నారు.

కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట

గట్టిగా వాదనలు వినిపించాలి

నీటి కేటాయింపులపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

» 'గోదావరి-బనకచర్ల'పై అభ్యంతరాలతో కేంద్రానికి, ఏపీ సీఎంకు లేఖలు రాయాలి

» పోలవరం ముంపుపై ఐఐటీ అధ్యయనాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయించాలి

» నీటి పారుదల శాఖ సమీక్షలో ఆదేశాలు

న్యూఢిల్లీ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం1956లోని సెక్షన్ 3 ప్రకారం నీటి కేటాయింపులు చేపట్టాలంటూ కృష్ణా ట్రైబ్యునల్-2 ఎదుట బలమైన వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర నీటి పారుదల శాఖపై ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంటుందని.. ఆ చట్టం ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్ సైతం సెక్షన్ 3 ఆధారంగానే రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు చేపట్టాలని సూచించిందని.. ట్రైబ్యునల్ తదుపరి విధివిధానాలపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా స్టే ఇవ్వలేదని గుర్తు చేశారు. ఏపీ సర్కారు ఎలాంటి అనుమతులూ లేకుండా 'గోదావరి-బనకచర్ల' అనుసంధాన ప్రాజెక్టు చేపట్టడంపై అభ్యంతరాలు తెలుపుతూ.. కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు, ఏపీ సీఎం చంద్రబాబుకు, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు (జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ) లేఖలు రాయాలని ఆదేశించారు. విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రమైనా ఏ నదిపైనైనా ప్రాజెక్టు నిర్మించాలంటే జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీలతో పాటు పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలనే విషయాన్ని లేఖల్లో ప్రస్తావించాలని సీఎం సూచించారు. పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలం ముంపు విషయంపై హైదరాబాద్ ఐఐటీతో అధ్యయనం అంశాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయించాలని ఆదేశించారు. సమ్మక్క సారక్క బ్యారేజీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. ఇక.. గురువారం నుంచి రెండు రోజులపాటు కృష్ణా ట్రైబ్యునల్‌లో నీటి పంపకాలపై వాదనలు జరుగనున్న నేపథ్యంలో తెలంగాణ తరఫున బలమైన వాదనలు వినిపించాలని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయవాదులు వైద్యనాథన్, గోపాల్ శంకర్ నారయణన్‌కు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ సూచించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల వాటా ప్రతిపాదనకు గత బీఆర్ఎస్ సర్కారు సూచనప్రాయంగా ఒప్పుకుందని ఆయన మీడియాతో అన్నారు. నీళ్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగవద్దని.. రాష్ట్రంలో నీటి లభ్యత, సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున మెజారిటీ టీఎంసీలు రాష్ట్రానికి కేటాయించాలని మంత్రి డిమాండ్ చేశారు. కాగా.. ఈ సమీక్షలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ప్రభుత్వ సలహాదారు (నీటి పారుదల శాఖ) ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా పాల్గొన్నారు.



ఢిల్లీలో ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

సెమీ కండక్టర్ మిషన్‌లో.. తెలంగాణకు మద్దతివ్వండి

» కాళేశ్వరం-మంథని-రామగిరిని పర్యాటక సర్క్యూట్‌గా గుర్తించండి

» కేంద్ర మంత్రులకు మంత్రి శ్రీధర్ విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కేంద్రం కూడా సహకరించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర మంత్రిని కలిశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ రంగాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పలు ప్రముఖ సంస్థలు తెలంగాణలో తమ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయని, ఇలాంటి తరుణంలో డేటా భద్రత కీలకంగా మారిందన్నారు. 'నేషనల్ డిజాస్టర్ రికవరీ జోన్' ఏర్పాటుపై కేంద్రం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలు సెమీ కండక్టర్ల రంగంలో పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. వచ్చే నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని అశ్విని వైష్ణవ్‌ను శ్రీధర్ బాబు ఆహ్వానించారు.



కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో శ్రీధర్ బాబు

రామగిరి కోటను టూరిజం హబ్‌గా మార్చండి

కాళేశ్వరం-మంథని-రామగిరిని ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా గుర్తించి... అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీలో ఆయన షెకావత్‌ను కలిశారు. మంథని నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం, రామగిరి కోటను టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపాలని వినతి పత్రం అందజేశారు. 'దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలో గోదావరి నది ఒడ్డున వెలిసిన కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయానికి వేయ్యేళ్లకు పైగా చరిత్ర ఉందని తెలిపారు. ఈ ఏడాది మేలో సరస్వతి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, 30-40 లక్షల మంది ఇక్కడ పవిత్ర స్నానాలను ఆచరించేందుకు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. సోమ్‌నాథ్, కేదార్‌నాథ్, మహాకాళేశ్వర్, అయోధ్య, కాశీల మాదిరిగా ప్రత్యేకత కలిగిన ఈ ఆలయాన్ని కూడా ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, ఎకో టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. రామగిరి కోటను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని కోరారు.

రుణాల కోసం పాస్‌పుస్తకాలు అడగొద్దు

» వ్యవసాయేతర, అబాదీ భూములకు ప్రత్యేక పోర్టల్

» భూభారతి చట్టం-25 గెజిట్ విడుదల

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భూభారతి(రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం-2025 గెజిట్ విడుదలయింది. తెలంగాణ భూమి హక్కులు పట్టాదార్ పాస్‌పుస్తకం-2020(ధరణి)ను సవరించి, ఇటీవలే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చిన విషయం విదితమే. భూభారతి బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో ఇది చట్ట రూపం దాల్చగా బుధవారం గెజిట్ విడుదలయింది. కొత్త చట్టం ప్రకారం పంట రుణాల కోసం బ్యాంకుల్లో పట్టాదార్ పాస్‌పుస్తకం-టైటిల్ డీడ్ సమర్పించాల్సిన అవసరం లేదు. ఎలక్ట్రానిక్ రికార్డులను పరిశీలించి, ఆ రికార్డుల్లో బ్యాంకులో పంట రుణం తీసుకున్నట్టు బ్యాంకర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ బ్యాంకర్లు రైతుల నుంచి పట్టాదారు పాస్ పుస్తకాలను అడగొద్దు. రైతులు పంట రుణం చెల్లిస్తే.. వెంటనే ఆ రికార్డులను నవీకరించాల్సి ఉంటుంది. వ్యవసాయేతర భూముల వివరాలతో పాటు అబాదీ భూముల కోసం ప్రత్యేకంగా పోర్టల్‌ను సిద్ధం చేయనున్నారు. ఇక రైతులు తీసుకున్న పంట రుణాలు కట్టకపోతే.. ఆ రుణం వసూలు కోసం జిల్లా కలెక్టర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. కొత్త చట్టం ప్రకారం.. రికార్డులను ఎలక్ట్రానిక్ రూపంలోనూ భద్రపరచనున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తారు. ఇక కొత్త చట్టంలో అప్పీల్ వ్యవస్థను పునరుద్ధరించారు. తహసీల్దార్ నిర్ణయాన్ని 60 రోజుల్లోగా ఆర్డీవో, ఆర్డీవో నిర్ణయంపై కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఇచ్చారు. ప్రతీ కమతం సరిహద్దులను పక్కాగా కొలిచి.. ఆ హద్దులకు చెందిన వివరాలతో భూదార్ కార్డులు జారీ చేయనున్నారు. ఇక భూభారతి చట్టం అమలు కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. నోటిఫై చేసిన రోజు నుంచి ఈ చట్టం అమల్లోకి రానుంది.

కూలీలందరికీ 12వేలు ఇవ్వాలి

కోతల్లేకుండా అమలు చేయాలి: హరీశ్

హైదరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఎలాంటి కోతలూ విధించకుండా అమలు చేయాలని.. రాష్ట్రంలోని రైతు కూలీలందరికీ రూ.12 వేలు ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధిహామీ పథకం కింద 1.02కోట్ల మంది కూలీలుగా పనిచేస్తున్నారని, వారంతా ఎస్సీ ఎస్టీ, బీసీ వర్గానికి చెందిన నిరుపేదలు, రైతులేనని గుర్తుచేశారు. ఎకరంలోపు భూమి ఉన్న రైతులు 24,57,000 మంది ఉన్నారని.. గుంట, రెండు గుంటలు ఉన్న రైతులు రైతు భరోసా తీసుకోవడంతో రైతు కూలీ కింద డబ్బులు రాకుండా పోతాయని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ఈజీఎస్ పథకంలో కూలీల వయసు 60 ఏళ్లు దాటితే కార్డు కోల్పోతారని, ఈ పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలని పేర్కొన్నారు.



యూనివర్సిటీ వద్ద మంచు మనోజ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

మోహన్‌బాబు వర్సిటీ వద్ద ఉద్రిక్తత

» క్యాంపస్‌లోకి వెళ్లేందుకు మనోజ్ దంపతుల యత్నం

» అడ్డుకున్న పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది

తిరుపతి(వైద్యం)/చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద బుధవారం ఉద్రిక్తత నెలకొంది. వర్సిటీ క్యాంపస్‌లోకి వెళ్లేందుకు మంచు మనోజ్, ఆయన సతీమణి భూమా మౌనిక ప్రయత్నించగా పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. చివరికి క్యాంపస్ పక్కన ఫామ్‌హౌస్‌లోని తన నానమ్మ, తాత సమాధులకు నమస్కరించి మనోజ్ వెనుదిరిగారు. మండలంలోని ఎ.రంగంపేటలో సినీనటుడు మంచు మోహన్‌బాబుకు చెందిన పలు విద్యాసంస్థలు ఉన్నాయి. కొంతకాలంగా ఆయన కుటుంబంలో వివాదం తలెత్తి కుమారుడు మనోజ్‌తో ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. తన విద్యాసంస్థల్లోకి మనోజ్ ప్రవేశించకుండా అడ్డుకోవాలని కోరుతూ మోహన్‌బాబు కోర్టును ఆశ్రయించి అనుకూల ఉత్తర్వులు పొందారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ శ్రీనివాసమంగాపురం నుంచి రంగంపేట వరకూ దారిపొడవునా మనోజ్ అనుచరులు సుమారు 200 బ్యానర్లు ఏర్పాటు చేశారు. వాటిని బుధవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. మంచు విష్ణు అనుచరులు చేసిన పనిగా ప్రచారమైంది. బుధవారం మధ్యాహ్నం మనోజ్, ఆయన సతీమణి భూమా మౌనిక హైదరాబాద్ నుంచి తిరుపతి చేరుకున్నారు. తొలుత నారావారిపల్లె వెళ్లి, మంత్రి లోకేశ్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత రంగంపేట వచ్చి జల్లికట్టు వీక్షించారు. అనంతరం మోహన్‌బాబుకు చెందిన స్కూల్ క్యాంపస్ ప్రధాన గేటు వద్దకు చేరుకున్నారు. అంతకుముందే అక్కడకు భారీగా చేరుకున్న పోలీసులు, క్యాంపస్ సెక్యూరిటీ సిబ్బంది గేటు వద్ద మోహరించి, మనోజ్‌ను అడ్డుకున్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నందున లోపలకు అనుమతించలేమని స్పష్టం చేయడంతో ఆయన వారితో వాగ్వాదానికి దిగారు. తాను ఇక్కడే పుట్టి పెరిగానని, తన ఇంటికి తనను ఎందుకు వెళ్లనివ్వరని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాలను గౌరవించాలని పోలీసు అధికారులు నచ్చజెప్పడంతో అంగీకరించిన మనోజ్ గేటు వద్ద బౌన్సర్లను ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. 'ఎంతమంది బౌన్సర్లను పంపుతారో పంపండి... నేను ఒక్కడిని చాలు వారికి సమాధానం చెప్పడానికి' అంటూ సవాల్ విసిరారు. ఆ తర్వాత అక్కడనుంచి బయల్దేరి పక్కనే ఉన్న కాలేజీ క్యాంపస్ ప్రధాన గేటు వద్దకు వెళుతుండగా విష్ణు అనుచరులుగా భావిస్తున్న యువకుల బృందంలో ఒకరు కర్రతో మనోజ్ వాహనంపై బాదారు. ఆ గేటు వద్ద కూడా పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది మనోజ్‌ను నిలువరించారు. దీంతో ఆగ్రహించిన మనోజ్ గేటు దూకైనా లోపలకు వెళతానంటూ దాన్ని ఎక్కేందుకు యత్నించారు. మరోవైపు ఆయన అనుచరులు సైతం గేటుపైకి ఎక్కడంతో ఇరుపక్షాలకు చెందినవారి మధ్య తోపులాట జరిగింది. ఈ సమయంలో గందరగోళం నెలకొనడంతో సిబ్బంది ప్రధాన గేటు కాకుండా చిన్న గేటును తెరిచారు. దానినుంచి మనోజ్ దంపతులు లోపలకు వెళ్లి మోహన్‌బాబు తల్లిదండ్రుల సమాధులకు నివాళులర్పించి వెనుదిరిగారు. సుమారు అరగంట పాటు అరుపులు, కేకలు, నినాదాలతో అక్కడ గందరగోళం నెలకొంది. కాగా, కోర్టు ధిక్కరణకు పాల్పడిన మంచు మనోజ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసి, కోర్టుకు అప్పీలుకు వెళ్లనున్నట్లు ఎంబీయూ మీడియా ఇన్‌చార్జ్ రవిచంద్రబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్ సదుపాయం

» నేటి నుంచి అందుబాటులోకి

న్యూఢిల్లీ, జనవరి 15: అంతర్జాతీయ విమాన ప్రయాణాలు ఎక్కువగా చేసే వారికి వేగంగా ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ ఇచ్చేందుకు ఉద్దేశించిన 'విశ్వసనీయ ప్రయాణికులు-ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్(ఎఫ్‌టీఐ-టీటీపీ)' కార్యక్రమాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్టు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, కొచ్చి, అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుల్లో కూడా ఈ సేవలు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించింది. ఈ ఏడు ఎయిర్‌పోర్టులో ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్ కార్యక్రమాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అహ్మదాబాద్ నుంచి ప్రారంభిస్తారు. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని 2024 జూన్ 22న ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రారంభించారు. ఇప్పుడు మరో 7 ఎయిర్‌పోర్టులకు విస్తరించాలని నిర్ణయించారు. మొత్తం 21 ఎయిర్‌పోర్టుల్లో దీన్ని అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రయాణికులు ముందుగా ఎఫ్‌టీఐ-టీటీపీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని వేలిముద్రలు సమర్పించాలి. తర్వాత వారు ఎప్పుడైనా విమాన ప్రయాణాలు చేస్తే.. ఈ-గేట్ వద్ద వారి బోర్డింగ్ పాస్‌ను స్కాన్ చేస్తే ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ వస్తుంది. ప్రతీసారి క్యూలో నిలబడి ఇతర పత్రాలను సమర్పించాల్సిన అవసరం ఉండదు. ఐదేళ్లకొకసారి వేలి ముద్రలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ సదుపాయం భారత పౌరులు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డు ఉన్న వారికి మాత్రమే ఉంది. భవిష్యత్తులో విదేశీ పౌరులకు కూడా ఈ వెసులుబాటును కల్పించాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

పేపర్ హాకర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

» తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కాప్రా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పేపర్ హాకర్లు (పత్రికలను ఇంటింటికి వేసే వారు) ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల సంఘం రాష్ట్ర రెండో మహాసభకు శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దినపత్రికలను ఎంత అందంగా ముద్రించినా.. ఆ పత్రిక పాఠకుడి వద్దకు చేరకపోతే దానికి విలువ ఉండదన్నారు. ప్రచురితమైన పత్రికలను పాఠకుల వద్దకు చేర్చడంలో హాకర్ల పాత్ర కీలకం అని పేర్కొన్నారు. పేపర్ హ్యాకర్లకు అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తింపు లభిస్తే ప్రభుత్వం తరఫున వారికి అనేక ప్రయోజనాలు అందుతాయని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి హ్యాకర్లకు అన్ని సౌకర్యాలు కల్పించేలా తన వంతు కృషి చేస్తానని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మనమాల సత్యం, ప్రధాన కార్యదర్శి రాంప్రసాదరావు, రాష్ట్ర కోశాధికారి ఉప్పు రాజేందర్, కర్ణాటక నుంచి ప్రశాంత్, బూపేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటరమణ, ఈసీఐఎల్ ఏరియా ప్రతినిధులు శ్రీను దశరథ్, గంగాధర్, బిజ్జు, హమీద్, ఎం.నరేష్, కె.నరేష్, శ్రీనివాస్, సంఘం 33 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పేపర్ వెండర్లు, డిస్ట్రిబ్యూటర్లు, పేపర్ హాకర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ'లో గుర్రంపోడు విద్యార్థిని

» ప్రధాని మోదీతో ముచ్చటించిన అంజలి


ప్రధాని మోదీతో కలిసి 'పరీక్షాపే చర్చ' కార్యక్రమంలో పాల్గొన్న అంజలి

గుర్రంపోడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించే 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థిని పాల్గొన్నారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె. అంజలి.. ఢిల్లీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మోదీని కలిసి మాట్లాడారు. ఎన్‌సీఈఆర్‌టీ అంజలిని ఢిల్లీకి పంపింది. మండలంలోని ఆమలూరుకు చెందిన కటికర్ల శంకర్, పార్వతమ్మ కుమార్తె అంజలి ఆరో తరగతి నుంచి మోడల్ స్కూల్‌లో చదువుతోంది. అంజలి ఈ కార్యక్రమంలో పాల్గొనడంపై పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి, గైడ్ టీచర్ సీత అభినందనలు తెలిపారు.

ఏప్రిల్ 29 నుంచి ఎప్‌సెట్

(మొదటిపేజీ తరువాయి)

ఎప్‌సెట్‌లో అగ్రి, ఫార్మసీ కోర్సుల పరీక్షలను ఏప్రిల్ 29, 30 తేదీల్లో, ఇంజనీరింగ్ విభాగం పరీక్షలను మే 2 నుంచి 5వ తేదీ వరకు జరగనున్నాయి. మార్చి 25వ తేదీతో ఇంటర్మీడియట్ పరీక్షలు ముగుస్తాయి. ఆ తర్వాత నెల రోజులకు ఎప్‌సెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గతంలో పోలిస్తే ఈసారి కాస్త ముందుగానే ఎప్‌సెట్ పరీక్షలు మొదలవ్వనున్నాయి. ఇక, ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించే ఈ-సెట్ పరీక్షలు మే12న జరగనున్నాయి. న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి నిర్వహించే లాసెట్ పరీక్షలను జూన్ 6న నిర్వహిస్తారు. ఇక, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఐసెట్ జూన్ 8,9 తేదీల్లో, ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పీజీఈసెట్ పరీక్షలు జూన్ 16-19 తేదీల్లో జరగనున్నాయి. ఆయా పరీక్షలకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ, ఫీజు తదితర పూర్తి వివరాలతో కూడిన నోటిఫికేషన్లను సెట్ల వారీగా త్వరలో విడుదల చేస్తారు.

ప్రవేశ పరీక్షల షెడ్యూల్

పరీక్ష	తేదీలు
ఎప్‌సెట్ (ఎంసెట్)	ఏప్రిల్ 29- మే 5
ఈసెట్	మే 12
ఎడ్‌సెట్	జూన్ 1
లాసెట్	జూన్ 6
ఐసెట్	జూన్ 8,9
పీజీఈసెట్	జూన్ 16-19
పీఈసెట్	జూన్ 11-14

కోట్లు కూతెట్టాయి!

(మొదటిపేజీ తరువాయి)



జిల్లాలో మూడురోజుల్లో రూ.250కోట్లకుపైగా పందేలు జరిగాయి. తూర్పు గోదావరి జిల్లాలో రూ.150కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.100కోట్లుకుపైగా పందేలు, గుండాట వ్యాపారం జరిగింది. వెరసి మొత్తం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతా కలిపి 1500కిపైగా బరుల్లో పందేలు జరిగాయి. పశ్చిమలో ఒక్క పందేనికే రూ.1.25 కోట్లు కాశారు. ఇక, గుండాటలో కాకినాడ జిల్లాలో వ్యాపారులకు లక్షలకు లక్షలు కురిపించాయి. ఒక్కో గ్రామంలో ఏర్పాటు చేసిన బరుల వద్ద రెండు నుంచి నాలుగు వరకు గుండాట బోర్డులు ఏర్పాటు చేసి లక్షల్లో లావాదేవీలు జరిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో కోడిపందేలు, పేకాట, గుండాట జోరుగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు జగ్గయ్యపేట నుంచి మచిలీపట్నం, హనుమాన్ జంక్షన్ వరకు బరులను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో సాగిన కోడి పందాల్లో రూ.400 కోట్లు చేతులు మారాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్కో పందెం రూ.లక్ష నుంచి రూ.7 లక్షల వరకు కొనసాగాయి. వీఐపీ బరుల్లో రూ.3 నుంచి రూ.5 లక్షల పైనే పందాలు వేశారు. ఒక్కో బరిలో రోజుకు 70 నుంచి 100కుపైగా పందేలు వేశారు. ఇందుకు తమ వంతు సహకారం అందించిన పోలీసులు, మిగిలిన శాఖల అధికారులకు కలిపి ఒక్కో బరికి రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు మామూళ్లు అందాయని చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం పెద అమిరం, సీసలిలో పెద్ద బరులు ఏర్పాటయ్యాయి. ఇక్కడ ముసుగు పందేలు జోరుగా సాగాయి. తాడేపల్లిగూడెంలో ఒక్కో ముసుగు పందెం రూ.27 లక్షలు కాశారు. యూనికార్న్, యాక్టివా వంటి ఆఫర్‌లు భీమవరంలో ప్రకటించారు. భీమవరం, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పందెం రాయుళ్లు చెరో వాహనాన్ని దక్కించుకున్నారు. నర్సాపురం, మొగల్తూరు మండలాల్లోని హోటళ్లలో పేకాటలు జరిగాయి. జబర్దస్త్ టీమ్‌తో పాటు యాంకర్ శ్రీముఖి పండగ రెండు రోజులూ నర్సాపురంలో సందడి చేశారు.ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలో కోడి పందేల్లో విజేతలకు బహుమతిగా 12 బైక్‌లను అందజేశారు. కాకినాడ జిల్లాలోని కరప మండలంలో ఎక్కువమంది పందెంరాయుళ్లను ఆకర్షించడానికి గిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. పందేల్లో ఎవరు ఎక్కువ గెలిస్తే వారికి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్లను మూడురోజులపాటు అందించారు. కరపలోని కొరుపల్లి బరిలో మూడురోజుల జరిగిన 64 కోడిపందేల్లో ఎక్కువ పందేలు గెలిచిన డేగల నాగేంద్ర అనే (గోల్డ్‌మ్యాన్) వ్యక్తికి మహీంద్రా థార్ జీపును కనుమరోజు అందించారు. ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన సత్తిరెడ్డి, ఆత్రేయపురం మండలం మెర్లపాలేనికి చెందిన గోవిందు, అమలాపురం రూరల్ మండలం మాగాంకు చెందిన సురేష్‌చౌదరి బుల్లెట్ దక్కించుకున్నారు. మండపేటలో హోండా యాక్టివా ద్విచక్రవాహనాలు ఇచ్చారు.

పారిన తెలంగాణ మద్యం

ఏలూరు జిల్లావ్యాప్తంగా దాదాపు 80 కోట్ల రూపాయలు కోడి పందేల రూపంలోను, మరో 30 కోట్ల రూపాయలు పేకాటలోను జనం చేతులు మారాయి. ఒకటికాదు.. రెండు కాదు ఏకంగా బరులన్నింటిలోనూ ఎలాంటి బెరుకు లేకుండా పేకాట, గుండాట యథేచ్ఛగా సాగాయి. బరుల వద్ద మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. తెలంగాణ సరిహద్దున ఉన్న చింతలపూడి నియోజకవర్గానికి పెద్దఎత్తున తెలంగాణవాసులు తరలివచ్చారు. వస్తూ వస్తూ తెలంగాణ మద్యం తెచ్చారు.

పులివెందులలో పందేల జోరు

ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కొణిజేడు కొండల వద్ద మంగళ, బుధవారాల్లో రూ.కోట్లలో పందెం నడిచింది. ప్రతి రోజూ 30 జతలకు తగ్గకుండా పందేలు వేశారు. పైపందేలు సైతం పెద్దఎత్తున జరిగాయి. బరుల వద్ద మందు, బిర్యానీ, తినుబండారాల దుకాణాలను ఏర్పాటుచేశారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె, పులివెందుల, లింగాల, చక్రాయపేట మండలాల్లో పందేలు కోట్లలో సాగాయి. రెండు మూడు చోట్ల ముక్కలాట కూడా నిర్వహించారు. పులివెందులలో ఓ చోట ప్రవేశ రుసుం కట్టిన తర్వాతే బరిలోకి అనుమతించారు.



బరిలో మౌన వ్యూహం

ఏలూరు జిల్లా భీమడోలులో బుధవారం చీకటి పడే వేళకు 5 పుంజులు మిగిలాయి. ఈసారి ఒకేపందెం వేయాలని నిర్ణయించిన నిర్వాహకులు.. 5 పుంజులను బరిలోకి దింపారు. రసంగి రకం పుంజు వీరోచితంగా పోరాడి మిగిలిన మూడు పుంజులను మట్టి కరిపించింది. పోరు జరుగుతున్నంత సేపు అబ్రాస్ రకం కోడి కాలు కదపలేదు. మిగిలిన పుంజుల పోరాటాన్ని చూస్తూ ఉండిపోయింది. చివరకు రక్తమోడుతున్న రసంగి కూడా నేలకొరిగింది. అబ్రాస్ విజేతగా నిలిచింది. దీనిని వీడియో తీసిన కొందరు.. సోషల్ మీడియాలో పెట్టడంతో నిమిషాల వ్యవధిలోనే వైరల్‌గా మారింది.

భాగ్యనగరీ ఊపిరి పీల్చుకో!

» గ్రేటర్ హైదరాబాద్‌లో.. పడిపోయిన విద్యుత్తు డిమాండ్

» మెరుగుపడిన గాలి నాణ్యత సూచీ

» సంక్రాంతికి జనం ఊళ్లకు.. నగరం ఖాళీ

» వరుస సెలవులు.. చలి కూడా కారణమే

హైదరాబాద్ సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ వచ్చిందంటే.. గ్రేటర్ హైదరాబాద్ నగరం సగానికి పైగా ఖాళీ అవుతుంది. పండక్కి సొంతూళ్లకు వెళ్లేవారితో రోడ్లలో ట్రాఫిక్ కనిపించదు. అయితే.. ఈ సారి అనూహ్యంగా విద్యుత్తు డిమాండ్ తగ్గిపోయి.. గాలి నాణ్యత సూచీ(ఏక్యూఐ) మెరుగుపడింది. గ్రేటర్ హైదరాబాద్‌లో సాధారణంగా రోజుకు 62-65 మిలియన్ యూనిట్ల విద్యుత్తు డిమాండ్ ఉంటుంది. సోమ, మంగళ, బుధవారాల్లో ఆ డిమాండ్ 15-18% తగ్గి.. 47-50 మిలియన్ యూనిట్లుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్లలో విద్యుత్తు డిమాండ్ భారీగా తగ్గిందని, మరో రెండుమూడు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అభిప్రాయపడ్డారు. వినియోగం తగ్గడానికి చలి కూడా ఓ కారణమని పేర్కొన్నారు. మరో రెండ్రోజులపాటు ఉదయం వేళల్లో పొగమంచు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు నగరంలో గాలి నాణ్యత సూచీ మెరుగుపడింది. పీఎం10(సూక్ష్మధూళి) కణాల సంఖ్య గణనీయంగా తగ్గడంతో.. పీల్చే గాలిలో నాణ్యత మెరుగుపడిందని.. ఈ పరిస్థితి ఉబ్బసం వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు, చిన్నారులకు ఉపశమనం కలిగిస్తుందని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులు వివరించారు. పీఎం10 కణాలు 115 మైక్రోగ్రాములుగా ఉన్నట్లు తెలిపారు. కొంపల్లితోపాటు.. సనత్‌నగర్, నాచారం వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో ఏక్యూఐ 58గా ఉండడం గమనార్హం.! పీఎం10 విలువలు హెచ్‌సీయూ వద్ద 63, సోమాజిగూడలో 74, ఈసీఐఎల్/కాప్రా వద్ద 90 మైక్రోగ్రాములుగా ఉన్నట్లు వెల్లడించారు. నగరవాసులు ఊళ్లకు వెళ్లడం, విద్యాసంస్థలు, పరిశ్రమలకు సంక్రాంతి సందర్భంగా సెలవులివ్వడం, వాహనాల రద్దీ తగ్గడం వంటి కారణాలతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గాలి నాణ్యత పెరిగినట్లు పేర్కొన్నారు.

ఆ లెక్క తేలాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ విస్తరణాధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి డిప్యూటీ తహసీల్దారు స్థాయి అధికారులతో బృందాలు ఏర్పాటుచేశారు. అంటే.. వ్యవసాయశాఖ, పంచాయతీ రాజ్, రెవెన్యూ... 3 శాఖల అధికారులు సంయుక్త సర్వే చేస్తారు. అలాగే, మండలస్థాయిలో 4నుంచి 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు. ఈ బృందాలకు ఎంపీడీవో, తహసీల్దారు, మండల వ్యవసాయాధికారి, ఎంపీవో, అవసరమైతే డిప్యూటీ తహసీల్దారులు సారథ్యం వహిస్తారు.

సర్వేలో గుర్తించేవి ఇవే!

వ్యవసాయభూముల జాబితాలో ఉండి పంటలు సాగు చేయకుండా, స్థిరాస్తి వెంచర్లుగా మారిన భూములు, కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు ఉన్న భూములు, ఇండ్లు, ఫంక్షన్ హాళ్లు, ఇతరత్రా వ్యాపార సముదాయాలు నిర్మించిన భూములు, పరిశ్రమలు, మైన్స్ ఏర్పాటుచేసిన భూములు, అభివృద్ధి పనులకోసం ప్రభుత్వం సేకరించిన భూములను ఐదు రోజుల పాటు జరిగే సర్వేలో గుర్తిస్తారు. 21- 24వ తేదీ దాకా గ్రామసభలు నిర్వహించి సర్వేలో సేకరించిన వివరాలను ప్రదర్శించి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈనెల 26న రైతుభరోసాను ప్రారంభించనున్న నేపథ్యంలో 24, 25 తేదీల నాటికి అనర్హుల తుది జాబితా రూపొందిస్తారు. 24వ తేదీ ప్రభుత్వానికి సర్వే నివేదిక చేరుతుంది. ఆ వివరాలను క్రోడీకరించి 25వ తేదీకి తుది జాబితా సిద్ధం చేస్తారు.

తెగిన బతుకు దారం

» పతంగులు ఎగురవేస్తూ వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి మృతి

» మాంజా తగిలి పలువురికి గాయాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


కానిస్టేబుల్ బాలరాజు


నరేందర్(ఫైల్)

సరదాల సంక్రాంతి కొన్ని కుటుంబాలకు విషాదాన్ని మిగిల్చింది. పతంగులు, మాంజాలు యమపాశాలుగా మారి నలుగురిని పొట్టనబెట్టుకోగా.. పలువురు మెడ భాగాల్లో మాంజా కోసుకుని, తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన చింతల్‌వార్ మాధవరావు(60) ఏడాదిగా మెహిదీపట్నం మార్కండేయనగర్‌లో ఉంటున్నారు. తాము అద్దెకుంటున్న భవనం నాలుగో అంతస్తు పైన కొందరు యువకులు సంక్రాంతి సందర్భంగా గాలిపటాలను ఎగురవేస్తుండగా.. చూడడానికి వెళ్లారు. గాలిపటాలను చూస్తూ.. కిందపడ్డారు. తీవ్ర గాయాలపాలైన మాధవరావును ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. జిల్లెలగూడ మిథిలానగర్‌కు చెందిన బీజేపీ నేత కె.మహేశ్‌యాదవ్(39) మంగళవారం సాయంత్రం ఇంటిపైన గాలిపటం ఎగురవేస్తూ.. ప్రమాదవశాత్తు కిందపడ్డారు. తలకు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందారు. యాదాద్రి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలుకు చెందిన జూపల్లి నరేందర్(48) మంగళవారం తన సోదరుడి డాబాపై పతంగి ఎగురవేస్తూ.. ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌కు చెందిన హుజైఫ్(10) అనే బాలుడు బుధవారం భవనంపై గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదశాత్తు కింద పడ్డాడు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఏర్పుల బాలరాజు మంగళవారం బైక్‌పై నారాయణగూడ ఫ్లైఓవర్ పైనుంచి వెళ్తుండగా.. మెడకు మాంజా తగిలి తీవ్రగాయాలపాలయ్యారు. హైదరాబాద్ పాతనగరంలోని లలిత్‌బాగ్‌కు చెందిన ఎస్.రామచంద్రన్ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గాలిపటాన్ని తీసుకునే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. 50% కాలినగాయాలతో ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. యాదగిరిగుట్ట మండలం గోధుమకుంటలో నారాయణ, ఆయన భార్య వీరమణి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. మాంజా తగిలి గాయాలపాలయ్యారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సైలాని బాబాకాలనీకి చెందిన జావేద్ అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా.. చైనా మాంజా తగిలి మెడపై తీవ్ర గాయాలయ్యాయి. కత్తితో కోసినట్లు మెడ తెగడంతో.. 30 కుట్లు వేసినట్లు వైద్యులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో డబ్బా రఘు అనే బాలుడి మెడకు చైనా మాంజ చుట్టుకుని తీవ్ర గాయమైంది. ఇదే జిల్లాలో మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లో గుజ్జేటి ప్రవీణ్, నవీపేటలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన అద్నాన్, భద్రాద్రి జిల్లా చుంచుపల్లిలో ముగ్గురు, కొత్తగూడంలో ఒకరు, విద్యానగర్ కాలనీ వద్ద దంపతులు ద్విచక్రవాహనాలపై వెళ్తుండగా.. మాంజా తగిలి గాయాలపాలయ్యారు.

హైకోర్టు తాత్కాలిక సీజేగా జస్టిస్ సుజాయ్ పాల్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి చెందిన జస్టిస్ సుజాయ్ పాల్ 1964లో జన్మించారు. 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకుని.. సివిల్, పారిశ్రామిక, సర్వీస్, కాన్‌స్టిట్యూషనల్ లా తదితర విభాగాల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2011లో మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్ బెంచ్‌లో న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014లో శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. గతేడాది మార్చి 26న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. కాగా, తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయమూర్తులు నియామకం కానున్నారు. సీనియర్ న్యాయాధికారులు రేణుక యార, నందికొండ నర్సింగ్‌రావు, ఈ తిరుమల దేవి, బీఆర్ మధుసూదన్‌రావును హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. వీరి నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం లభించగానే వీరు ప్రమాణ స్వీకారం చేస్తారు. రేణుక యార ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా, నందికొండ నర్సింగ్‌రావు సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, ఈ తిరుమలదేవి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పనిచేస్తున్నారు. తిరుమలదేవి విజిలెన్స్ రిజిస్ట్రార్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. బీఆర్ మధుసూదన్‌రావు ప్రస్తుతం హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. రిజిస్ట్రార్ ఎంక్వైరీస్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హైకోర్టులో 42 మంది న్యాయమూర్తులకుగాను ప్రస్తుతం 26మంది ఉన్నారు. నియామకాలు జరిగితే ఆ సంఖ్య 30 అవుతుంది.

విద్యాభ్యాసం హైదరాబాద్‌లోనే..

రేణుక యార ప్రస్తుతం సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 1973 జూన్ 14న ఐలయ్య, నాగమణి దంపతులకు హైదరాబాద్‌లో జన్మించారు. విద్యాభ్యాసమంతా హైదరాబాద్‌లోనే పూర్తిచేశారు. 1998లో న్యాయవిద్య పూర్తి చేసి, బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు అయ్యారు. కొన్నాళ్లు ప్రాక్టీస్ చేశాక 2012లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శితో పాటు వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఆమె పనిచేశారు.

విశ్వవిద్యాలయంలో న్యాయవిద్య

మధుసూదన్‌రావు బొబ్బిలి రామయ్య ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రార్‌గా ఉన్నారు. 1969 మే 25న అనసూయ, ఎల్లయ్య దంపతులకు ఖాజీపేటలో జన్మించారు. కాకతీయ వర్సిటీలో న్యాయవిద్య పూర్తి చేశారు. 1998లో న్యాయవాదిగా నమోదై, 2012లో జిల్లా జడ్జి అయ్యారు. నెల్లూరు, చిత్తూరు, మేడ్చల్ మల్కాజిగిరి సహా సీబీఐ కోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. రాష్ట్ర వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యునల్, మేడ్చల్ మల్కాజిగిరి ప్రిన్సిపల్ జడ్జి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శిగా పని చేశారు.

సెయింట్ ఆన్స్‌లో చదివి..

ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, రిజిస్ట్రార్ విజిలెన్స్‌గా ఉన్న తిరుమలాదేవి 1964 జూన్ 2న సంగారెడ్డిలో జన్మించారు. లా పూర్తిచేశాక హైకోర్టు, సిటీ కోర్టులలో కొన్నాళ్లు న్యాయవాదిగా పనిచేశారు. 2012లో జిల్లా జడ్జిగా ఎంపికై తొలుత నిజామాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జిగా విధులు నిర్వహించారు. ఖమ్మం జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జడ్జి సహా వరంగల్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్ జడ్జిగా కీలక కేసుల విచారణ చేపట్టారు. హైకోర్టు రిజిస్ట్రార్‌గా, తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

జిల్లా జడ్జి నుంచి..

ప్రస్తుతం సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా ఉన్న నర్సింగ్‌రావు నందికొండ.. పెంటయ్య, మణెమ్మ దంపతులకు 1969 మే 3న జన్మించారు. 1995లో న్యాయవిద్య పూర్తి చేశారు. 2012లో జిల్లా జడ్జిగా ఎంపికై విశాఖపట్నం అదనపు జడ్జిగా చేశారు. న్యాయ శాఖ కార్యదర్శిగా, హైకోర్టు రిజిస్ట్రార్‌గా, గుంటూరు, వరంగల్, రంగారెడ్డి కోర్టులు, జ్యుడీషియల్ అకాడమీలలోనూ పనిచేశారు.

ఆంధ్ర హైకోర్టు న్యాయమూర్తులుగా హరిహరనాథ శర్మ, లక్ష్మణరావు!

» కేంద్రానికి సుప్రీం కొలీజియం సిఫారసు

అమరావతి/న్యూఢిల్లీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా న్యాయాధికారులు అవధానం హరిహరనాథశర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావును నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ఈ నెల 11న జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. వీరి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 28 మంది ఉన్నారు. కాగా, హరిహరనాథ శర్మ 1968 ఏప్రిల్ 16న జన్మించారు. ఆయన స్వస్థలం కర్నూలు. తల్లిదండ్రులు రామచంద్రయ్య, సుబ్బమ్మ. కర్నూలు ఉస్మానియా కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసిన హరిహరనాథశర్మ నెల్లూరు వీఆర్ లా కాలేజీలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1994లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. కర్నూలు జిల్లా కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. 2007 అక్టోబరులో జిల్లా జడ్జిగా నియమితులయ్యారు. 2023 నుంచి ఏపీ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. కాగా, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు 1975 ఆగస్టు 3న జన్మించారు. స్వగ్రామం ప్రకాశం జిల్లా కనిగిరి. ప్రాథమిక విద్యను ప్రకాశం జిల్లాలో పూర్తి చేసిన ఆయన.. నెల్లూరు వీఆర్ లా కాలేజీలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 2014లో జ్యుడీషియల్ సర్వీసులోకి వచ్చారు. 2021 సెప్టెంబరు 2న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా నియమితులయ్యారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.